CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 50 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 1 జనవరి 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE : 50 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 1 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## 2026 సంవత్సరానికి అట్టహాసంగా స్వాగతం పలికిన న్యూజిలాండ్...

# వెలిగిపోయిన స్కై టవర్

- మొదటగా 2026కి స్వాగతం పలికిన పసిఫిక్ దేశాలు
- న్యూజిలాండ్ ఆక్లాండ్‌లో ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు
- వర్షం కురుస్తున్నా స్కై టవర్ నుంచి బాణసంచా కాల్పులు
- అందరికంటే ముందు కొత్త ఏడాదిని చూసిన కిరిబాటి దీవి
- న్యూజిలాండ్ నార్త్ ఐలాండ్‌లో పలుచోట్ల రద్దయిన వేడుకలు



వివరాలు 2లో..

## సిరిసిల్లలో పర్యటించిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం

- అపారెల్ పార్కును సందర్శించిన కేటీఆర్
- కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలతో నేత కార్మికులకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం
- 25 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో పార్కును ఏర్పాటు చేసినట్లు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్లలోని అపారెల్ పార్కును సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నేత కార్మికులకు అన్యాయం జరుగుతోందని అన్నారు. అపారెల్ పార్కులో తమ హయాంలో వచ్చిన రెండు పరిశ్రమలు మినహా ఇప్పటి వరకు కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఆయన పేర్కొన్నారు. 25 వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో ఈ పార్కును ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

సంక్రాంతి లోపు వర్కర్ టు ఓనర్ పథకం లబ్ధిదారులను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో 10 వేల మందితో నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని కేటీఆర్ అన్నారు. అపారెల్ పార్కును రూ.400 కోట్లతో ఏర్పాటు చేసింది తామేనని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ఏమీ చేయలేదని ఆయన విమర్శించారు.అంతకుముందు కేటీఆర్ సిరిసిల్ల పట్టణ ఎస్సీ బాలుర హాస్టల్ విద్యార్థులతో కలిసి

వివరాలు 2లో..



## 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు వెల్లడి
- అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి
- ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్య సాధన దిశగా పయనిస్తున్నట్లు పేర్కొన్నారు.

వివరాలు 2లో..

# ఉద్యమకారులను ఉరికిచ్చి కొడ్తమన్నరు

- ఈ ప్రభుత్వమైనా ఉద్యమకారులకు న్యాయం చేయాలె
- 250 గజాల ఇంటి స్థలం వెంటనే ఇవ్వాలె
- ఇంటి స్థలాల కోసం అన్ని జిల్లాల్లో ఉద్యమం
- కమిటీల పేరుతో కాలయాపన వద్దన్న ఎమ్మెల్సీ




- బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ వ్యతిరేకుల పెత్తనం
- సెక్రటేరియేట్కు వెళ్తే ఇక్కడేం పని అని బెదిరించిండ్రు
- 12 వందల మంది అమరులైతే 540 మందికే లబ్ధి

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో 12 వందల మంది అమరులైతే 540 మంది కి మాత్రమే మేలు జరిగిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు.. ఎంతో మంది అమరవీరుల కుటుం బాల వారు వచ్చి వారి బాధలు తనకు చెప్పారన్నారు. 12 ఏళ్లలో ఎంతో మంది ఉద్యకారులు చనిపో యారని, హాస్పిటల్ లో చేరితే వారికి సాయం కూడా చేయలేదని అన్నారు. నిజమైన ఉద్యకా రుల కుటుంబాలు ఎంతో దారుణమైన పరిస్థితులు ఎదుర్కొన్నారన్నా రు. తెలంగాణ వ్యతిరేకులు ఉద్యమపార్టీలో చేరారని ఆరోపించారు. ఉద్యమకారులపైనే పెత్తనం చెలాయిస్తూ కేసులు పెట్టారని గుర్తు చేశారు. సెక్రటేరియేట్ కు వెళ్తే మనల్నే ఇక్కడ ఏం పని అంటూ అవమానించారన్నారు. ఉద్యమకారులను ఉరికిచ్చి కొడుతామని కూడా బెదిరించారని అన్నారు. తెలగాణ ఉద్యమకారులతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కరీంనగర్ లో భూపోరాటానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల జాగా ఇవ్వాలనే డిమాండ్ తో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. ఉద్యమకా రులు ఎక్కడికక్కడ భూములు ఆక్రమించు కోవాలని

వివరాలు 2లో..

## ప్రపంచంలోనే అందరికంటే ముందుగా 2026కు స్వాగతం పలికిన కిరిబాటి

- కిరిబాటిలో గ్రాండ్‌గా 2026కు వెల్కమ్
- పసిఫిక్ దేశమైన కిరిబాటిలో మొదలైన న్యూ ఇయర్ వేడుకలు
- కిరితిమతి దీవికే క్రిస్మస్ ఐలాండ్ అని పేరు
- కిరితిమతిలో అడుగుపెట్టిన 2026




వివరాలు 2లో..




ఈ కొత్త సంవత్సరం మీ కలలన్నింటినీ నిజం చేయాలని కోరుకుంటూ... మీకు మీ కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2026 Happy New Year 2026

## ఒకే లాంచర్ నుంచి రెండు 'ప్రళయ్' క్షిపణులు...

# ప్రయోగం విజయవంతం

- భారత్ అమ్ములపొదిలో మరో అస్త్రం 'ప్రళయ్'
- వరుసగా రెండు మిస్సైల్స్ పరీక్ష విజయవంతం
- 150 నుంచి 500 కిలోమీటర్ల లక్ష్యాలను ఛేదించే సత్తా
- డీఆర్డీవో శాస్త్రవేత్తలను అభినందించిన రాజ్‌నాథ్ సింగ్
- త్వరలోనే సైన్యంలో చేరనున్న ప్రళయ్ క్షిపణులు



వివరాలు 2లో..



# 2025లో ఏసీబీ దూకుడు 199 కేసులు, 273 మంది అరెస్ట్

- 2025లో తెలంగాణ ఏసీబీ 199 అవినీతి కేసులు నమోదు
- మొత్తం 273 మంది అరెస్ట్, వీరిలో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులు
- అక్రమాస్తుల కేసుల్లో రూ. 96.13 కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు
- ఫిర్యాదుల కోసం క్యూఆర్ కోడ్ ఆధారిత వ్యవస్థను ప్రారంభించిన ఏసీబీ
- ఏడాది మొత్తం మీద 157 ట్రాప్ కేసులు నమోదు


వివరాలు 2లో..

# ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ విస్తరించండి

- ఉక్రెయిన్‌పై కీలక నిర్ణయం తీసుకున్న పుతిన్
- భద్రతా బఫర్ జోన్ విస్తరించే దిశగా ఆదేశాలుమ
- ముందుకు సాగుతున్న రష్యా బలగాలు

**హైదరాబాద్ పెన్ పవర్:**కొన్ని రోజులుగా ఉక్రెయిన్‌పై భారీ దాడులు చేస్తున్న రష్యా... తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఉక్రెయిన్ కు చెందిన మరింత భూభాగాన్ని ఆక్రమించుకునే దిశగా అడుగులు వేస్తోంది.

వివరాలు 2లో..



# ఎవరూ మద్యం తాగి వాహనం నడపవద్దు

- ఈరోజు ఫెయిల్ అవండి!: ఇదే నూతన సంవత్సర చివరి సందేశం అంటూ సజ్జనార్ ఆసక్తికర ట్వీట్
- పరీక్షలలో 35 మార్కులు వస్తే గట్టెక్కినట్లేనని వ్యాఖ్య
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మాత్రం ఔట్ అయినట్లేనని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్ 'ఎక్స్' వేదికగా ఒక ట్వీట్ చేశారు. "నూతన సంవత్సర వేడుకలకు ఇది నా చివరి సందేశం" అంటూ ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఆయన సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈరోజు ఫెయిల్ కావడానికి ప్రయత్నించండని ఆయన పేర్కొన్నారు. ఒకవేళ మీరు పాస్ అయితే చంచల్‌గూడ జైలుకు పంపించబడతారని,




వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### నూతన సంవత్సరాది పూర్వాపరాలు

ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో సంవత్సరాది పండగను వివిధ దినాలలో జరుపుకుంటారు. ఇలా జరుపుకోవడానికి కారణం సంవత్సర పరిగణన వేరువేరు మాసాలలో జరగడమే. ప్రపంచంలో అత్యధికులు ఆచరించేది ప్రస్తుత గ్రెగేరియన్ క్యాలెండర్ క్రీ.శ.1582లో రూపొందించినది. జనవరి 1వ తేదీన నూతన సంవత్సర తొలి రోజును పండగలా జరుపుకోవడం సాపేక్షంగా కొత్త దృగ్విషయం. క్రీ.పూ.2000లో వసంత సమరాత్రి సమయాన మార్చి మధ్య కాలంలో మెసపొటేమియాలో నూతన సంవత్సర ఉత్సవాలు తొలి నాళ్ళలో జరుపుకునే వారు. అలాగే వివిధ ప్రాంతాలలో రుతు సంబంధంగా ప్రాచీనులు విభిన్న రోజులలో సంవత్సరాదిని పాటించేవారు. ఈజిప్టియన్లు, ఫొయెనిషియన్లు, పర్షియన్లు సమరాత్రి ప్రారంభం, గ్రీకులు శీతకాల ఆయనాంత సమయాన జరుపుకునే వారు. పూర్వపు రోమన్లు మార్చి నెల 1వ తేదీని కొత్త సంవత్సర ఆరంభ దినంగా నియమం పెట్టుకున్నారు. ఆనాటి క్యాలెండర్ మార్చితో ప్రారంభమై 10నెలలతో కూడి ఉండేది. లాటిన్ లో "సెప్టెం" అనగా ఏడు అని, "అక్టో" అనగా ఎనిమిది అని "నొవం" అనగా తొమ్మిది అని, "దశం" అనగా పది అని అర్థం. క్రీ.పూ.153లో ప్రప్రథమంగా జనవరి 1న నూతన సంవత్సర తొలి రోజుగా పరిగణించారు. వాస్తవానికి క్రీ.పూ.700 వరకు జనవరి మాసం ఉనికే లేదు. రోమ్ రెండవ రాజైన నుర్మా పొంటిలియస్ జనవరి, ఫిబ్రవరి మాసాలను జత చేయడం జరిగింది. రోమ్ సామ్రాజ్యంలో పౌర యుద్ధం చోటు చేసుకుని, గణతంత్ర రాజ్యంలో ఇరువురు ఉన్నతాధికారులైన అమాత్యులు కొత్తగా ఎన్నికైన సందర్భాన వారి పదవీ కాలాన్ని ఏడాదిగా నిర్ణయించారు. ఆ సందర్భంగా మార్చి నుండి జన వరికి తొలి రోజును మార్చినా, అది ఖచ్చితంగా పాటించ బడలేదు. అప్పటికీ మార్చి 1ననే కొత్త సంవత్సర వేడుకలు జరిగేవి. క్రీ.పూ.46లో జూలియస్ సీజర్ ప్రాచీన చాంద్రమానాధారిత రోమన్ క్యాలెండర్ ను మెరుగు పరిచి, సౌర మాన ఆధారిత నూతన క్యాలెండర్ ను పరిచయం చేయగా, సదరు క్యాలెండర్ జనవరి 1ననే కొత్త సంవత్సర ప్రారంభ దినంగా పరిగణింప చేయగా, అది క్రమేణ నిలకడగా పాటించ బడింది. మధ్యయుగాన ఐరోపాలో నూతర వత్సర సంబరాలు అన్యమత సంబంధమైనవిగా భావించ బడగా, క్రీ.శ.567లో జనవరి 1వ తేదీన నూతన సంవత్సర ప్రారంభ దినాన్ని పాల కులచే రద్దు చేయబడింది. మధ్యయుగ క్రైస్తవులు ఐరోపాలో చాలా వరకు కొత్త సంవత్సర దిన వేడుకలను జీసస్ జన్మదిన సందర్భంగా డిసెంబర్ 25న, మార్చి 1న, మార్చి 25న, ఈస్టర్ సందర్భంగా పాటించేవారు. 1582వ సంవత్సరంలో సంస్కరింపబడి, పునరుద్ధరింప బడిన గ్రెగేరియన్ క్యాలెండర్ జనవరి 1వ తేదీని ప్రకటింపగా, వెనువెంటనే చాలా వరకు క్యాథలిక్ దేశాలు స్వీకరించాయి. తర్వాత క్రమంగా ప్రొటెస్టెంట్ దేశాలు కూడా స్వీకరించాయి. అయితే 1752 వరకు బ్రిటిషర్లు స్వీకరించలేదు. అప్పటికీ బ్రిటిష్ సామ్రాజ్యం, వారి అమెరికన్ కాలనీలు మార్చి మాసంలోనే నూతన సంవత్స వేడుకలు జరుపుకునే వారు. 1752 తర్వాత బ్రిటిష్ రాచరిక పాలకులు తమ ఆధీనంలోని దేశాలన్నింటిలో జన వరి 1వ తేదీని నూతన సంవత్సర తొలి రోజుగా ఆచరించే చర్యలు గైకొన్నారు. మొట్టమొదటి సారిగా గ్రెగేరియన్ క్యాలెండర్ కు, జూలియస్ సీజర్ క్యాలెండర్ కు గల రోజుల వ్యత్యాసాన్ని సవరించి, 1582 అక్టోబర్ మాసంలో 5 నుండి 14వ తేదీలను ఇటలీ, పోర్చుగల్, స్పెయిన్, పోలండ్ దేశాలలో లేకుండా చేసి, 4తర్వాత 15ను మార్చడం జరిగింది. 1752 సెప్టెంబరులో 3నుండి 13 తేదీలు తొలగించి, 11రోజులను లేకుండా సరి చేశారు.. జనవరి 7 ఈజిప్టియన్లు, 11న ఓల్డ్ స్కాటిష్, 14న ఈస్టర్న్ ఆర్థడాక్స్, 21న కొరియన్లు, మార్చి 1న రోమన్లు, ఏప్రిల్ 13,14ను (బైసాకి) నానక్ సాహి క్యాలెండర్ ఆధారంగా సిక్కులు, ఉగాదిని తెలుగువారు, ఏప్రిల్ 14ను అగ్నేయాసియా దేశాలు, ఏప్రిల్ మొదటి వారంలో పౌర్ణమిని బౌద్ధులు, మొహర్రం నెల మొదటి రోజు ఇస్లాం, జూన్ 21ని ఏనిషియెంట్ గ్రీక్, జూలై 8ని ఆర్మేనియన్, ఆగస్టు 8ని మళయాళీలు, 23ను జొరాష్ట్రియన్, సెప్టెంబర్ 1ని రష్యన్ ఆర్తడాక్స్ క్రిస్టియన్, 11ను ఇథియోపియన్, అక్టోబర్ 3ను మొరాకో, నవంబర్ లో దీపావళిని జైనులు, డిసెంబర్ లో సిక్కిం న్యూ ఇయర్ డేగా పాటించడం అనవాయితీ.

## ఉక్రెయిన్‌లో బఫర్ జోన్ విస్తరించండి

- మొదటి పేజీ తరువాయి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నుంచి సైన్యానికి ఉక్రెయిన్ భూభాగంలో 'భద్రతా బఫర్ జోన్'ను విస్తరించమని ఆదేశాలు వచ్చాయని రష్యా సైనిక జనరల్ వాలేరి గెరసిమోవ్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో, సుమీ, ఖర్కీవ్ ప్రాంతాల్లోని కొన్ని గ్రామాలను ఆక్రమించేందుకు రష్యా సైన్యాలు ముందుకు సాగనున్నాయి. మరోవైపు, పుతిన్ అధికారిక నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్లు ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, పుతిన్ ఇచ్చిన ఆదేశాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. సరిహద్దుల్లో ఉక్రెయిన్ చొరబాట్లకు అడ్డుపడేలా భద్రతా బఫర్ జోన్ ఏర్పాటు చేయాలనేది పుతిన్ నిర్ణయం. ఇటీవల ఉక్రెయిన్ సుమీ ప్రాంతంలోని నాలుగు సరిహద్దు గ్రామాలను మాస్కో సీజ్ చేసింది. పుతిన్ ఇచ్చిన తాజా ఆదేశాల ప్రకారం, బఫర్ జోన్‌ను మరింత విస్తరించడం కోసం సైన్యాలు ముందుకు కదలనున్నాయి. ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నప్పటికీ, పరస్పర దాడులు ఆగడం లేదు. రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ ప్రకారం, ఉక్రెయిన్ తాజాగా 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను రష్యాపై ప్రయోగించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో సరిహద్దుల్లో సాంకేతిక, భౌగోళిక మార్పులపై మరిన్ని ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం ఉంది.

# 2026 సంవత్సరానికి అట్టహాసంగా స్వాగతం పలికిన న్యూజిలాండ్...

# వెలిగిపోయిన స్కై టవర్

ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్యాలెండర్ మారుతున్న వేళ.. కిరిబాటి దీవుల తర్వాత న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్ నగరం 2026కు ఘన స్వాగతం పలికింది. అక్కడి స్థానిక సమయం ప్రకారం గడియారం ముల్లు 12 దాటగానే.. ఆక్లాండ్ నడిబొడ్డున ఉన్న న్యూజిలాండ్ ఎత్తైన కట్టడం 'స్కై టవర్' బాణసంచా వెలుగులతో మెరిసిపోయింది. సుమారు 5 నిమిషాల పాటు సాగిన ఈ కనువిందులో 3,500 రకాల బాణసంచాను స్కై టవర్ అంతస్తుల నుంచి కాల్చారు. అయితే, అక్కడి వాతావరణం వేడుకలకు కాస్త ఆటంకం కలిగించింది. భారీ వర్షం, ఉరుముల సూచన ఉండటంతో న్యూజిలాండ్ నార్త్ ఐలాండ్‌లోని పలు చిన్న కమ్యూనిటీ ఈవెంట్లను రద్దు చేశారు. అయినా ప్రధాన వేడుకలు మాత్రం వర్షంలోనే కొనసాగాయి. ఆక్లాండ్ కంటే ముందే, పసిఫిక్ మహాసముద్రంలోని మారుమూల దేశమైన 'కిరిబాటి'లోని ఓ అటోల్ (కిరితిమతి దీవి) ప్రపంచంలోనే తొలిసారిగా 2026లోకి అడుగుపెట్టింది. అక్కడి అనుభవాన్ని ఓ పర్యాటకుడు వివరిస్తూ.. "లాటిటైట్లు లేవు, మనుషుల జాడ లేదు, చిమ్మచీకటి, లెక్కలేనన్ని పీతలు మాత్రమే ఉన్నాయి" అంటూ ప్రకృతి ఒడిలో న్యూ ఇయర్ జరుపుకున్నట్లు తెలిపారు. ఇక 600 మంది జనాభా మాత్రమే ఉండే న్యూజిలాండ్ చాతం ఐలాండ్‌లోనూ కొత్త ఏడాది సంబరాలు జరిగాయి. తెల్లవార్లూ తమ బృందం వేడుకలు చేసుకుంటుందని అక్కడి ఓ హోటల్ యజమాని పేర్కొన్నారు. ప్రపంచంలోని తూర్పు దేశాల నుంచి పడమర వైపుకు కొత్త సంవత్సరం 2026 నెమ్మదిగా విస్తరిస్తోంది.

## ప్రపంచంలోనే అందరికంటే ముందుగా 2026కు స్వాగతం పలికిన కిరిబాటి

ప్రపంచమంతా 2026 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. పసిఫిక్ మహాసముద్రంలోని కిరిబాటి దేశంలోని కిరితిమతి (క్రిస్మస్ ఐలాండ్) దీవిలో అప్పుడే కొత్త సంవత్సరం అడుగుపెట్టింది. ప్రపంచంలోనే అందరికంటే ముందుగా 2026కు స్వాగతం పలికిన ప్రాంతంగా కిరితిమతి నిలిచింది. అంతర్జాతీయ సమయ రేఖ (International Date Line) ఆధారంగా ఇక్కడ కొత్త సంవత్సరం ముందుగా ప్రవేశిస్తుంది. భారత కాలమానం ప్రకారం ఇక్కడ మధ్యాహ్నం 3.30 గంటలకే కొత్త ఏడాది ప్రవేశించింది. దీంతో స్థానికులు బాణసంచా పేల్చుతూ, ఉత్సాహంగా కొత్త సంవత్సర వేడుకలు జరుపుకుంటున్నారు. కిరిబాటి దేశంలో అంతర్భాగమైన కిరితిమతి దీవి.. హవాయికి దక్షిణాన, ఆస్ట్రేలియాకు ఈశాన్యంలో ఉంది. కిరిబాటిలోని ఇతర ప్రాంతాలు కూడా మరికొద్ది గంటల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టనున్నాయి. తూర్పు నుంచి పడమర వరకు దాదాపు 4,000 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ దేశంలో అనేక పగడపు దీవులు (అటోల్స్) ఉన్నాయి. భౌగోళికంగా హవాయికి దగ్గరగా ఉన్నప్పటికీ.. టైమ్ జోన్ల కారణంగా కిరిబాటిలో ఒక రోజు ముందుగానే న్యూ ఇయర్ వేడుకలు జరగడం విశేషం. బ్రిటన్ నుంచి 1979లో స్వాతంత్ర్యం పొందిన కిరిబాటి జనాభా సుమారు 1,16,000. దీనిని స్థానికంగా 'కిరిబాస్' అని పిలుస్తారు. దక్షిణ పసిఫిక్‌లో అతిపెద్ద మెరైన్ రిజర్వ్ ఇక్కడే ఉంది. అయితే, గ్లోబల్ వార్మింగ్ కారణంగా సముద్ర మట్టాలు పెరుగుతుండటంతో.. లోతట్టు ప్రాంతాలైన ఈ దీవులు భవిష్యత్తులో ముంపు ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. కిరితిమతి తర్వాత న్యూజిలాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలు వరుసగా 2026కు స్వాగతం పలకనున్నాయి.

## సిరిసిల్లలో పర్యటించిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి, అనంతరం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. అంతకుముందు జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

## ఎవరూ మద్యం తాగి వాహనం నడపవద్దు

- మొదటి పేజీ తరువాయి

అక్కడ ఉచిత భోజనం ఉంటుందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. విద్యా పరీక్షలో 35 మార్కులు వస్తే ఉత్తీర్ణులైనట్లేనని, కానీ డ్రంక్ అండ్ డ్రైవ్ మీటర్‌లో 35 (బీఏసీ) దాటితే మాత్రం అనర్హులవుతారని ఆయన పేర్కొన్నారు. పరీక్షలో ఫెయిలైతే ఏడాది మాత్రమే నష్టపోతామని, కానీ రోడ్డు మీద తేడా కొడితే జీవితం ఆగమవుతుందని ఆయన సున్నితంగా హెచ్చరించారు. అందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మన రోడ్లు రక్తసిక్తం కావడానికి తాము అంగీకరించేది లేదని ఆయన తేల్చి చెప్పారు. యువత బాధ్యత కంటే మద్యం ఎక్కువ అని భావిస్తే, చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన అన్నారు. నూతన సంవత్సర బహుమతిగా అనవసర బిల్లులు చెల్లించడం లేదా ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడం కాకుండా, సురక్షితంగా ఇంటికి వెళ్లడం మంచిదని ఆయన సూచించారు. తాగి వాహనం నడపడాన్ని హైదరాబాద్ పోలీసులు ఏమాత్రం సహించరని ఆయన స్పష్టం చేశారు.

## ఉద్యమకారులను ఉరికిచ్చి కొడ్తమన్నరు

- మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. కొట్లాడితేనే 250 గజాలా జాగా వస్తుందన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తే సహించబోమన్నా రు. తెలంగాణ వచ్చాక కూడా ఉద్యమకారుల కు గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యూ ఉద్యమ వ్యతిరేక శక్తులు కేసులు పెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారుల కు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని అన్నారు. కరీంనగర్ గడ్డ మీద ఏ పోరాటం చేసిన అది సక్సెస్ అవుతుందని, అందుకే ఇక్కడి నుంచి పోరాడుతున్నామని అన్నారు. ఒక్క కరీంనగర్ లో మాత్రమే కాదు అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ఉద్యమకారులకు ఇస్తామన్న 250 గజాల భూమి ఇచ్చే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో విలువైన భూములు ఉంటాయని, కానీ అక్కడ కూడా వదలబోము ని చెప్పారు. కదుపు మాడ్చుకొని కొట్లాడితే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు మేలు చేస్తామని అధికా రంలోకి వచ్చిందని తెలిపారు. అఫిడవిట్లు పెట్టకోమన్నారని, ఇప్పుడు వారిపై కేసులు లేవంటున్నారని తెలిపారు. ఉద్యకారులంద రిపై కేసులు ఉంటాయా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసి ఎంతో మంది ఆగమయ్యారని, ఏ ఊరికి, జిల్లాకు వెళ్లినా అక్కడి ప్రజలు ఉద్యమకారులెవరో చెబుతా రని అన్నారు. వాళ్లు చెప్పిన వారికే ప్రభుత్వం ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని అన్నారు. ఇప్పుడు మళ్లీ కమిటీలు అంటున్నారని, వాటిని ఒప్పుకునేది లేదన్నారు. ఉద్యమకారుల ఫోరం ఇచ్చిన డేటా ప్రకారమే ఉద్యమకారులను గు ర్తించాలని కోరారు. ఆ డేటాని సీఎం రేవంత్ ముందు పెడుదామని అన్నారు. ప్రభుత్వ పెద్దలు దిగి వచ్చే వరకు పోరాటం కొనసాగి స్తూనే ఉంటుందని చెప్పారు.

## 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- మొదటి పేజీ తరువాయి

అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కొత్త ఏడాది ప్రతి కుటుంబం ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 2026 సంవత్సరంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో తెలంగాణ వేగవంతమైన పురోగతిని సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకలకు హైదరాబాద్ నగరం ముస్తాబైంది. నగరంలో వివిధ ప్రాంతాల్లో కొత్త సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు వినోద కార్యక్రమాలు నిర్వహించి 2026 సంవత్సరం రాగానే పరస్పరం శు భాకాంక్షలు చెప్పుకుంటారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్న తరుణంలో రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఒకే లాంచర్ నుంచి రెండు 'ప్రళయ్' క్షిపణులు...

## ప్రయోగం విజయవంతం

భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. బుధవారం ఒడిశా తీరంలో డీఆర్‌డీఓ నుంచి ఉపరితలంనుంచి ప్రయోగించే స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి 'ప్రళయ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒకే లాంచర్ నుంచి రెండు క్షిపణులను స్వల్ప వ్యవధిలో (సాల్వో లాంచ్) ప్రయోగించి వాటి సామర్థ్యాన్ని విజయవంతంగా పరిశీలించారు. యూజర్ ఎవాల్యుయేషన్ ట్రయల్స్‌లో భాగంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు రక్షణ శాఖ వెల్లడించింది. బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) ఆధ్వర్యంలో ఈ ప్రయోగం జరిగింది. ప్రయోగించిన రెండు క్షిపణులు నిర్దేశిత మార్గంలో ప్రయాణించి, లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదించాయని అధికారులు తెలిపారు. చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో మోహరించిన ట్రాకింగ్ సెన్సార్ల ద్వారా క్షిపణి పనితీరును ధృవీకరించుకున్నారు. డీఆర్డీవో సీనియర్ శాస్త్రవేత్తలు, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులు ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. 'ప్రళయ్' క్షిపణి 150 నుంచి 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఇది పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన సాలిడ్ ప్రొపెల్లెంట్ క్వాసీ-బాలిస్టిక్ మిసైల్. అత్యాధునిక నావిగేషన్, గైడెన్స్ వ్యవస్థతో పనిచేసే ఈ క్షిపణి.. వివిధ రకాల వార్‌హెడ్‌లను మోసుకెళ్లి శత్రువుల స్థావరాలపై విరుచుకుపడగలదు. హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్సీఐ)తో పాటు పలు డీఆర్డీవో ల్యాబ్స్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) వంటి సంస్థల సహకారంతో దీనిని అభివృద్ధి చేశారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. సాల్వో లాంచ్ విజయవంతం కావడంతో క్షిపణి విశ్వసనీయత నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. ఈ విజయంపై డీఆర్డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ మాట్లాడుతూ.. త్వరలోనే ఈ క్షిపణి వ్యవస్థను సైన్యంలోకి ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు తుది దశలో ఉన్నాయని తెలిపారు.

## 2025లో ఏసీబీ దూకుడు

### 199 కేసులు, 273 మంది అరెస్ట్

తెలంగాణలో అవినీతిపై యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) ఉక్కుపాదం మోపింది. 2025 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 199 అవినీతి కేసులు నమోదు చేసి, 273 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ డైరెక్టర్ జనరల్ చారు సిన్హా బుధవారం వెల్లడించారు. ఈ ఏడాది ఏసీబీ పనితీరుపై విడుదల చేసిన వార్షిక నివేదికలో కీలక వివరాలను ఆమె పంచుకున్నారు. నివేదిక ప్రకారం, 2025లో నమోదైన మొత్తం 199 కేసుల్లో 157 ట్రాప్ కేసులు ఉన్నాయి. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఈ కేసుల్లో 176 మంది ప్రభుత్వ ఉద్యోగులతో సహా మొత్తం 224 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీటితో పాటు, ప్రభుత్వ అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై 15 కేసులు, ప్రభుత్వ ఉద్యోగులు నేరపూరిత ప్రవర్తనకు పాల్పడినందుకు మరో 26 కేసులను నమోదు చేశారు. ఈ కేసుల్లో 34 మందిని అరెస్ట్ చేసినట్టు డీజీ తెలిపారు. ఈ ఏడాది 15 అక్రమాస్తుల కేసుల్లో సుమారు రూ. 96.13 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు చారు సిన్హా వివరించారు. అలాగే, 157 ట్రాప్ కేసుల్లో నిందితుల నుంచి మొత్తం రూ. 57.17 లక్షల లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నామని, అందులో రూ. 35.89 లక్షలను ఫిర్యాదుదారులకు తిరిగి అందజేశామని పేర్కొన్నారు. కేసుల దర్యాప్తు అనంతరం, నిందితులపై ప్రాసిక్యూషన్‌కు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, 115 కేసుల్లో అనుమతులు లభించాయని, వాటిలో చార్జిషీట్లు దాఖలు చేశామని చెప్పారు. కేసుల నమోదుతో పాటు నివారణ చర్యలపై కూడా ఏసీబీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా అవినీతి ఆరోపణలపై 26 సాధారణ విచారణలు (రెగ్యులర్ ఎంక్వైరీలు) జరిపింది. అలాగే సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆర్టీఏ చెక్‌పోస్టులు, సంక్షేమ హాస్టళ్లు వంటి 54 కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. సిబ్బంది నైపుణ్యాన్ని పెంచేందుకు ఈ ఏడాది ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు డీజీ తెలిపారు. 73 మంది అధికారులకు నిందితుల ప్రొఫైల్స్ తయారుచేయడం, నిఘా పద్ధతులు, బినామీ లావాదేవీల (నిషేధ) చట్టం, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు, డిజిటల్ ఆధారాల సేకరణ, ట్రాప్ మరియు అక్రమాస్తుల కేసుల చట్టపరమైన అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. అవినీతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు డిసెంబర్ 3 నుంచి 9 వరకు 'అవినీతి నిరోధక వారోత్సవాలు' నిర్వహించామని చారు సిన్హా తెలిపారు. ఈ సందర్భంగా మారుమూల ప్రాంతాల ప్రజలు కూడా సులభంగా, సురక్షితంగా, మధ్యవర్తులు లేకుండా ఫిర్యాదు చేసేందుకు వీలుగా 'క్యూఆర్ కోడ్' ఆధారిత ఫిర్యాదుల వ్యవస్థను ప్రారంభించారు. కరపత్రాలు, పోస్టర్ల పంపిణీతో పాటు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన కల్పించారు. ప్రజలు అవినీతికి సంబంధించిన సమాచారాన్ని టోల్-ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా అందించవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.



# ఈ మాత్రలు వాడొద్దు...

## తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరిక

- నిమెసులైడ్ 100 ఎంజీ దాటిన మందుల తయారీ, విక్రయాలపై నిషేధం
- కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలతో అప్రమత్తమైన తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్
- కాలేయ సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉండటంతో నిర్ణయం
- ప్రజలు వెంటనే ఆ మందుల వాడకం ఆపేయాలని సూచన
- ప్రత్యామ్నాయ మందుల కోసం వైద్యులను సంప్రదించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** నిమెసులైడ్ (Nimesulide) 100 ఎంజీ కంటే ఎక్కువ మోతాదులో ఉన్న మందులను ప్రజలు వాడొద్దని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA) బుధవారం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ మందుల తయారీ, విక్రయం మరియు పంపిణీని దేశవ్యాప్తంగా నిషేధిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోనూ ఈ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.
నిమెసులైడ్ అనేది నొప్పి నివారణకు వాడే నాన్-స్టెరాయిడ్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్. అయితే ఇది కాలేయం (లివర్) పై విషపూరిత ప్రభావం చూపడంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలకు కారణమవుతోందని ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు సంప్రదింపుల అనంతరం, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్-1940లోని సెక్షన్ 26ఏ కింద ఈ అధిక మోతాదు మందులను నిషేధించారు. కేవలం అధిక మోతాదు మందులకే ఈ నిషేధం వర్తిస్తుందని, తక్కువ మోతాదు ఫార్ములేషన్లు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ తరహా మందులు వాడుతున్న రోగులు తక్షణం వాటిని ఆపేయాలని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం సూచించారు. సురక్షితమైన ప్రత్యామ్నాయ చికిత్స కోసం అర్హులైన వైద్యులను సంప్రదించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిషేధిత మందులను కొనుగోలు చేయవద్దని, ఇళ్లలో

-4 లో

# తెలంగాణ రౌండప్

# హైదరాబాద్‌లో కొందరు కట్టాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నారు

- పరిశుభ్రతలో నగరాన్ని అగ్ర స్థానంలో నిలపడమే లక్ష్యమన్న ఆర్వీ కర్ణన్
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీ ఆరో ర్యాంకు సాధించిందన్న కర్ణన్
- గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 2 వేల కిలోమీటర్లకు పెరిగిందని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో కొందరు ఆస్తి పన్నును తక్కువగా చెల్లిస్తున్నట్లు గుర్తించామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఆస్తి పన్ను వసూళ్లపై భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. రానున్న 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.3,000 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ బుధవారం ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఇప్పటికే రూ.1,512 కోట్లు వసూలు చేశామని, ఇది గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అధికమని

-4 లో

# స్కిల్స్ యూనివర్సిటీలో వెయ్యి మందికి చేరిన శిక్షణ పొందిన విద్యార్థులు

- పీపీపీ విధానంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణ
- రేవంత్ రెడ్డి ఛాన్సలర్‌గా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వైస్ ఛాన్సలర్‌గా స్కిల్స్ యూనివర్సిటీ
- పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డ్‌కు ఛైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరుకుంది. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలకు సరిపోయే నైపుణ్యాన్ని అందించే లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి గత ఏడాది ఆగస్టు 1న శంకుస్థాపన చేశారు. ఈ యూనివర్సిటీని పీపీపీ విధానంలో నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛాన్సలర్‌గా, విశ్రాంత ఐఏఎస్ అధికారి సుబ్బారావు వైస్ ఛాన్సలర్‌గా ఉన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీని పర్యవేక్షిస్తోంది. పారిశ్రామికవేత్తలతో కూడిన బోర్డుకు ఆనంద్ మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీలో తాత్కాలిక క్యాంపస్ నిర్వహిస్తున్నారు. లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, ఫార్మా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి రంగాల్లో



స్వల్పకాలిక, సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. మైక్రోసాఫ్ట్, రెడ్డీస్ ల్యాబ్స్, ఏఐజీ, అపోలో ఆసుపత్రులు, జీఎంఆర్ కార్గో వంటి సంస్థలు యూనివర్సిటీలో భాగస్వామ్యమయ్యాయి.

## తెలంగాణ ఉద్యోగులకు శుభవార్త...

# పెండింగ్ బిల్లులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- డిసెంబర్ నెలకు సంబంధించి రూ.713 కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం
- పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లకు చేరడంతో ఆందోళన చేపట్టిన ఉద్యోగులు
- ఆగస్టు నుంచి ప్రతి నెల రూ.700 కోట్లు విడుదల చేస్తున్న ప్రభుత్వం


**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల్లో భాగంగా డిసెంబర్ నెలకు సంబంధించిన రూ.713 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యోగ సంఘాలతో కుదిరిన ఒప్పందం ప్రకారం, ప్రతి నెల రూ.700 కోట్లు విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖాధికారులను ఈ నెల నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల గ్రాట్యుటీ, జీపీఎఫ్, సరెండర్ లీవులు, అడ్వాన్సులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో సుమారు రూ.10 వేల కోట్లకు చేరాయి. ఈ సమస్యపై ఉద్యోగ సంఘాలు జూన్ నెలలో ఆందోళన చేపట్టాయి. ప్రతి నెల రూ.700 కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి విడతగా జూన్ నెలాఖరులో రూ.183 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం, ఆగస్టు నుంచి ప్రతి నెల రూ.700 కోట్లు విడుదల చేస్తోంది.

## హైదరాబాద్ సాఫ్ట్‌వేర్

# ఇంజినీర్ హత్య..

## భార్య సహా ఆరుగురికి జీవిత ఖైదు

- జగిత్యాల జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు
- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన భార్య, బంధువులు
- నిందితులకు జీవిత ఖైదు, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐదేళ్ల క్రితం జరిగిన హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ హత్య కేసులో మృతుడి భార్యతో పాటు మరో ఐదుగురు మహిళలకు జీవితఖైదు విధిస్తూ జగిత్యాల జిల్లా న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. అల్వాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాచర్ల పవన్ కుమార్ (38) సజీవ దహనం కేసులో న్యాయమూర్తి ఈ తీర్పును వెలువరించారు. ఈ కేసు వివరాల్లోకెళితే... జగిత్యాలకు చెందిన విజయ్ కొండగట్టుకు దాదాపు 1.5 కిలోమీటర్ల దూరంలో ఒక కుటీరాన్ని నిర్మించుకున్నాడు. అయితే విజయ్ తమ్ముడు జగన్ అనారోగ్యంతో మృతి చెందాడు. విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బావ పవన్ కుమార్, భార్య కృష్ణవేణితో కలిసి 2020 అక్టోబర్ 20న కుటిరానికి చేరుకున్నాడు. అయితే పవన్ కుమార్ తన భర్తకు చేతబడి చేయించి చంపాడని ఆరోపిస్తూ అక్కడే ఉన్న జగన్ భార్య సుమలత బంధువులతో కలిసి అతనిని కుటీరంలో బంధించి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గది తాళం తీయగా, పవన్ పూర్తిగా దహనమయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా, పవన్ కుమార్ భార్య కృష్ణవేణితో పాటు మరో ఐదుగురు మహిళలు ఈ కేసులో నిందితులుగా తేలారు. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం కృష్ణవేణి సహా ఆరుగురు మహిళలకు జీవిత ఖైదుతో పాటు రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

# ఆస్తుల కోసమే కేసీఆర్ కుటుంబంలో కొట్లాట



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్తుల కోసమే బీఆర్ఎస్ అధినేత,మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంలో కొట్లాట జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో ఒక్క పైసా పని చేయకుండా రాష్ట్రా న్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో నిర్మించతలపెట్టిన నూతన ఏటీసీకి ఆయన ఇవాళ శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ సర్కార వ్యవస్థను నాశనం చేసిందని, ఇచ్చిన హామీలను కేసీఆర్ మర్చి పోయారని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందన్న మంత్రి యువతకు నాణ్యమైన విద్యతోపాటు ఆధునిక నైపుణ్యం, శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించా రు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.3,622 కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ఇందిరమ్మ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ఇప్పుడు మళ్లీ కొనసాగిస్తున్నామని అర్హులైన ప్రతి ఒక్కరి కీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్కూల్స్ పేదలకు వరంగా మారాయని, ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి గుర్తు చేశారు. రాసున్న రోజుల్లో కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు. విడుదల అవుతాయని యువతకు భరోసా ఇచ్చారు.

# హైదరాబాద్‌లో కొందరు కట్టాల్సిన ఆస్తి పన్ను కంటే తక్కువగా చెల్లిస్తున్నారు

-3 పేజి తరువాయి

ఆయన వెల్లడించారు. నగరంలో ఇటీవల నిర్వహించిన జీఐఎస్ ఆధారిత సర్వేలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని కమిషనర్ తెలిపారు. ఈ సర్వేలో 1.02 లక్షలకు పైగా ఆస్తులు పన్ను పరిధిలో లేవని లేదా తక్కువ పన్ను చెల్లిస్తున్నాయని గుర్తించినట్లు వివరించారు. ఈ ఆస్తుల ద్వారా అదనంగా రూ.500 కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉందని, ఈ అంచనాలతోనే వచ్చే ఏడాది లక్ష్యాన్ని పెంచినట్లు పేర్కొన్నారు.

అదే సమయంలో, ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోయిన వారికి జీహెచ్ఎంసీ 'వన్-టైమ్ సెటిల్మెంట్' (ఓటీఎస్) పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద, పేరుకుపోయిన వడ్డీలో 10% మొత్తాన్ని అసలుతో పాటు ఒకేసారి చెల్లిస్తే, మిగిలిన 90% వడ్డీని మాఫీ చేయనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోకి కొత్తగా వచ్చిన పట్టణ స్థానిక సంస్థలకు కూడా ఈ ఓటీఎస్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.గత ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ చరిత్రలోనే తొలిసారిగా రూ.2,000 కోట్ల మైలురాయిని దాటి రికార్డు స్థాయిలో పన్ను వసూలు చేసింది. పెరిగిన ఆదాయంతో నగరంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల పనులను మరింత వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. పరిశుభ్రతలో నగరాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా 2026లో కృషి చేస్తామని ఆయన అన్నారు. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో జీహెచ్ఎంసీ ఆరో ర్యాంకును సాధించిందని గుర్తు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 650 చదరపు కిలోమీటర్ల నుంచి దాదాపు 2 వేల కిలోమీటర్ల వరకు విస్తరించిందని అన్నారు. వార్డులు కూడా 150 నుంచి 300కు పెరిగాయని జీహెచ్ఎంసీ కమిషనర్ వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పారిశుద్ధ్యంపై 300 వార్డుల్లో నిరంతరం ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోందని తెలిపారు. వచ్చే ఆర్థిక
సంవత్సరానికి రూ.3 వేల కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

జీఐఎస్ సర్వే ద్వారా 14 లక్షల ప్రాపర్టీలను సర్వే చేసినట్లు పేర్కొన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే నగర పౌరులు తమ ఆస్తి పన్నును నేరుగా జీహెచ్ఎంసీ వెబ్ సైట్, యాప్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. హైదరాబాద్ నగరంలో రవాణా సదుపాయం మరింత మెరుగుపర్చేందుకు పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని అన్నారు.

# ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్న కవిత

**కరీంనగర్, డిసెంబర్ 31,పెన్ పవర్:**
తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి వారికి ఇంటి స్థలాలు కేటాయించాలని పోరాటం చేయనుంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు వేదికగా కవిత భూ పోరాటాన్ని ప్రారంభించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ హామీని అమలు చేయాల్సిందిగా డిసెంబర్ 9వ తేదీ వరకు గడువు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆమె ప్రత్యక్ష పోరాటానికి దిగారు. కమ్యూనిస్ట్ పార్టీల శైలిలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయడం ద్వారా తమ ఉద్యమంలో భాగంగా నిరసనను దిగాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. కరీంనగర్‌లో మొదలైన ఈ భూ పోరాటాన్ని త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరింపజేయాలని కవిత భావిస్తున్నారు. ఉద్యమకారులకు దక్కాల్సిన ఇంటి స్థలాల హక్కు కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కవిత తెలిపారు. అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి స్థలం ఇచ్చే వరకు తెలంగాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ఈ సందర్భంగా ఆమె పునరుద్ఘాటించారు.కరీంనగర్ గడ్డ మీద ప్రారంభించిన ఏ ఉద్యమమైన విజయవంతమవుతుందని.. ఇప్పుడు ఇదే కరీంనగర్ నుండి నేడు తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కోసం చేపట్టిన ఉద్యమం కూడా విజయవంతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ గడ్డ నుంచి ప్రారంభం అయిన పోరాటం... భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉద్యమకారులను ఏకం చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరుల కుటుంబాలతో పాటు, ఉద్యమకారులకు న్యాయం జరిగే వరకు ఎత్తిన పిడికిలి దించకుండా పోరాడుతాం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేంతవరకు ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉండాలని నిర్ణయం తీసుకున్నారు.

# ఏపీ ప్రభుత్వంతో కుమ్మక్కు తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్న హరీష్

**హైదరాబాద్, డిసెంబర్ 31, పెన్ పవర్:**
ఏపీ ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టును ప్రస్తుతం నల్లమల సాగర్ కిందకు మార్చిందని, ఇది కేవలం పేరు మార్పు మాత్రమే తప్ప లక్ష్యం మాత్రం తెలంగాణ నీటిని దొంగిలించడమేనని హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో హరీష్ రావు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన నల్లమల సాగర్ ప్రాజెక్టుపై, అలాగే రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఇది కేవలం నీటి తరలింపు కాదని, తెలంగాణ హక్కులను కాలరాసే జల దోపిడీ అని అభివర్ణించారు.



నల్లమల సాగర్ అక్రమ ప్రాజెక్టుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూత్రధారి అయితే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాత్రధారిగా మారి జల ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలు తమ నీటి వాటా కోసం గట్టిగా పోరాడుతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో ఉన్నారని మండిపడ్డారు. తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారుగా మాజీ అధికారి ఆదిత్యానాథ్ దాస్ నియామకాన్ని హరీష్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో ఏపీ సీఎస్‌గా ఉండి, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి వందకు పైగా లేఖలు రాసిన వ్యక్తిని తీసుకొచ్చి సలహాదారుగా పెట్టుకోవడం అంటే దొంగకు తాళాలు ఇచ్చినట్లే అని విమర్శించారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తికి కీలక బాధ్యతలు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ఇది తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన స్పష్టం చేశారు. బనకచర్ల, నల్లమల సాగర్ వివాదాల పరిష్కారానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీలు వేయడాన్ని హరీష్ రావు ఒక డ్రామాగా అభివర్ణించారు. ఒకవైపు కోర్టులో కేసు వేస్తూ, మరోవైపు చర్చల కోసం కమిటీలు వేయడం వల్ల కోర్టులో కేసు వీగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొట్టినట్లు ఉండాలి.. దెబ్బ తాకకూడదు అన్న చందంగా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఏపీ జలదోపిడీ సాగడానికి పరోక్షంగా సహకరిస్తోందని ఆరోపించారు. గోదావరి - కృష్ణా అనుసంధానం ద్వారా తెలంగాణకు దక్కాల్సిన 45 టీఎంసీల వాటాను ఏపీ గంపగుత్తగా తరలించుకుపోయే ప్రయత్నం చేస్తోందని హరీష్ రావు వివరించారు. ఈ విషయంలో సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు వచ్చినా తెలంగాణ ప్రభుత్వం నిద్ర నటిస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే, అసెంబ్లీలో నల్లమల సాగర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని, ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నాకు రావాలని సవాల్ విసిరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పక్షాన తామే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం గోదావరి నీళ్లు కృష్ణా ద్వారా తరలిస్తే, గోదావరి అవార్డు ప్రకారం, 45:21:14 తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు కృష్ణాలో నీటి వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధంగా కూడా తెలంగాణకు నీటి వాటా దక్కకుండా ఉండేందుకు కృష్ణాలో కలుపకుండానే, పెన్నా బేసిన్ కు గోదావరి నీటిని తరలించే పెద్ద కుట్రకు తెరతీశారన్నారు. నిజానికి పోలవరం బనకచర్ల విషయంలో కర్ణాటక, మహారాష్ట్రలు తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాశాయన్నారు. వరద జలాల మీద కట్టే ప్రాజెక్టు కట్టేందుకు ఏపీకి అవకాశం ఇస్తే అదేవిధంగా ప్రాజెక్టులు కట్టేందుకు డీపీఆర్‌లు పంపుతామని అన్నారని.. గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం ప్లాన్ కర్ణాటక, మహారాష్ట్రకు అర్థం అయ్యింది, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం అర్థం కాలేదన్నారు.

# యూరియా కోసం మళ్లీ కష్టాలు



**వరంగల్, డిసెంబర్ 31, పెన్ పవర్:**
తెలంగాణలో రైతులకు యూరియా సమస్య ఇంకా తీరలేదు. నెలలు గడుస్తున్నా, సాగు సీజన్ కొనసాగుతున్నా రైతుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన ఒక ఘటన అద్దం పడుతోంది. పొలాలకు సకాలంలో ఎరువులు అందక, పంటలు ఎండిపోతాయనే ఆందోళనతో అన్నదాతలు పడుతున్న అగచాట్లు వర్ణనాతీతంగా మారాయి. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడినా ప్రయోజనం లేకపోయింది.తమ కళ్ల ముందే పంటలు దెబ్బతింటుంటే చూస్తూ భరించలేక, కనీసం ఎరువులు ఇప్పించమని కోరుతూ ఒక రైతు ఏకంగా వ్యవసాయ అధికారి కాళ్ల మీద పడి వేడుకోవడం అందరినీ కలిచివేసింది. నిన్న (శనివారం) పంపిణీ కేంద్రానికి వచ్చిన రైతులకు తగినన్ని యూరియా బస్తాలు
అందుబాటులో లేకపోవడంతో తీవ్ర నిరాశ ఎదురైంది. అధికారులు అక్కడి నుండి వెళ్లే ప్రయత్నం చేస్తుండగా, తమకు ఎలాగైనా యూరియా కావాలని రైతులు అడ్డుకున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటను కాపాడుకోవాలనే ఆవేదనతోనే కనీసం ఒక్క యూరియా బస్తా ఇప్పించండి బాంచన్ నీకాళ్లు మొక్కుతా అంటూ.. ఆ రైతు అధికారుల కాళ్ళు మొక్కి ప్రాధేయపడాల్సి వచ్చింది. ఈ హృదయవిదారక దృశ్యం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల కొరత, రైతుల కష్టాలపై గత కొన్ని నెలలుగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఇది కేవలం ఒక్క రైతు గోస మాత్రమే కాదు, ఎరువుల కోసం ఎదురుచూస్తున్న రాష్ట్రంలోని మొత్తం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితికి అద్దం పడుతోంది. పలు జిల్లాల్లో యూరియా బస్తాల కోసం అర్థరాత్రి నుంచే క్యూ లైన్లు కనిపిస్తున్నా యూరియా తమ చేతికి రావడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై రైతుల అభిప్రాయాల సేకరణ

**మునుగోడు, డిసెంబర్ 31 పెన్ పవర్:** మిర్యాలగూడ డివిజన్ వ్యవసాయ అధికారి ధీరావత్ సైదా నాయక్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సందర్శించి ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌పై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ. . తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ యాప్ ద్వారా యూరియా కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతున్నట్లు చెప్పారు. గతంలో మాదిరిగా క్యూలైన్లలో నిలబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే బుకింగ్ చేసుకుని, తాము ఎంచుకున్న దుకాణంలో సులభంగా యూరియా పొందుతున్నామని హర్షం వ్యక్తం చేశారు.

# ఇద్దరు దొంగల అరెస్టు

**నకిరేకల్, డిసెంబర్ 31 పెన్ పవర్:** ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. డిండి గ్రామీణ సీఐ భీసన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వీరబోయినపల్లి గ్రామానికి చెందిన జంగ పరశురాములు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ దొంగతనాలకు పాల్పడుతుండేవాడు. 2022 ఫిబ్రవరి 15న అదే గ్రామానికి చెందిన తుమ్మల వెంకటయ్య ఇంట్లో 10.5 తులాల బంగారం ఎత్తుకెళ్లాడు. వెంకటయ్యకు ఇద్దరు భార్యలు పద్మ, రాములమ్మ కావడంతో కుటుంబ సభ్యులే బంగారం తీసి ఉండవచ్చునని భావించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. పరశురాములు దొంగిలించిన బంగారం స్నేహితుడైన రూప్లాతండాకు చెందిన కేతావత్ నరసింహకు అందించాడు. అనంతరం వారు స్థానిక బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నారు. అదే అదునుగా భావించిన పరశురాములు ఈ నెల 16న అర్ధరాత్రి మరోసారి అదే ఇంటికి దొంగతనానికి వెళ్లగా కుటుంబ సభ్యులు గుర్తించారు.

# పైపులైన్ పనులకు అనుమతుల గండం

**భువనగిరి, డిసెంబర్ 31 పెన్ పవర్:** భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లాలో తాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రత్యేకంగా వేస్తున్న పైపులైన్ పనులకు అటవీ శాఖ అనుమతులు అడ్డంకిగా మారాయి. అవసరాల మేరకు తాగునీటిని సరఫరా చేసేందుకు మల్లన్న సాగర్ నుంచి నేరుగా ప్రత్యేకంగా పైపు లైన్ వేసే పనులు 2024లో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని భువనగిరి, ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పలు ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకంలో మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాలను పంపిణీ చేస్తున్నారు. హైదరాబాద్ జంటనగరాలకు సరఫరా చేస్తున్న హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది.

# రేపల్లెవాడలో కళ్యాణ లక్ష్మి చెక్కు పంపిణి




**నిజామాబాద్ అర్బన్, డిసెంబర్ 31 పెన్ పవర్:** ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు, బుధవారం రేపల్లెవాడ గ్రామపంచాయతీలో కళ్యాణ లక్ష్మి లబ్ధిదారురాలు నాయి కోటి బాలమణికి సర్పంచ్ వనితా సాయిరాం చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పిట్ల యాదయ్య, గ్రామ సెక్రెటరీ రాధిక కూడా పాల్గొన్నారు. ఈ సంఘటన కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సహాయాన్ని తెలియజేస్తుంది.

# తాత్కాలిక ఆనందానికి విలువైన జీవితం నాశనం చేసుకోవద్దు:

**నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 31 పెన్ పవర్:** నూతన సంవత్సరం వేడుకలను ఆనందంగా, చట్టానికి లోబడి జరుపుకోవాలని కామారెడ్డి పట్టణ ప్రజలకు టౌన్ సీఐ నరహరి సూచించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, డిసెంబర్ 31న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తామని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో డీజేలు, అధిక శబ్దం వచ్చే సౌండ్ బాక్సులు వినియోగిస్తూ ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జర్నలిస్టుల బస్ పాస్ సమస్యలను పరిష్కరించాలి



**ఆర్మూర్, డిసెంబర్ 31 పెన్ పవర్:** కామారెడ్డి డిపో మేనేజర్ దినేష్ కు బుధవారం టీయుడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు తమ ఆర్టీసీ బస్సు పాసుల జారీలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ, డిపోలో పాసుల ప్రింట్ సరిగ్గా రావడం లేదని, దీంతో ప్రయాణంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. పాసులను లామినేషన్ చేసి ఇవ్వాలని, అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్న కొందరు సిబ్బంది 35 కిలోమీటర్ల వరకే ఇస్తామంటూ ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే జర్నలిస్టుల బస్ పాస్ సమస్యలను పరిష్కరించాలని డిఎం ను కోరారు.

# ఈ మాత్రలు వాడొద్దు... తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరిక

-3 పేజి తరువాయి

నిల్వ ఉంచుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మార్కెట్ నుంచి ఈ మందులను పూర్తిగా తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ బ్రాండ్లను విక్రయించే ఫార్మా కంపెనీలు తక్షణం ఉత్పత్తిని నిలిపివేసి, మార్కెట్లో ఉన్న స్టాక్‌ను వెనక్కి పిలిపించాలని ఆదేశించారు. ఎక్కడైనా ఈ మందులు విక్రయిస్తున్నట్లు గమనిస్తే సమీపంలోని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ లేదా డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు

# అజారుద్దీన్ పదవికి గండం



**హైదరాబాద్, డిసెంబర్ 31,పెన్ పవర్:** నూహ్యంగా మంత్రి అయ్యారు. జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వేళ..ముస్లిం ఈక్వేషన్ ఆయనకు అమాత్య యోగాన్ని తెచ్చి పెట్టింది. నిజానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచి గ్రేటర్ కోటాలో మంత్రి కావాలనుకున్నారు అజారుద్దీన్. అయితే ఎంఐఎం అబ్జక్షన్స్‌తో అజార్‌ను జూబ్లీహిల్స్ సీటు రేస్ నుంచి తప్పించారు కాంగ్రెస్ పెద్దలు. సరిగ్గా ఉపఎన్నిక జరుగుతున్న టైమ్‌లోనే ఆయన్ను హడావుడిగా మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. అయితే ఏ సభకు ఎన్నిక కాకుండానే మంత్రి అయిన..అజార్ ఆరు నెలల్లోపు ఏదో ఒక సభకు ఎన్నిక కావాల్సి ఉంది.అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా చేసే ఆలోచనలోనే మంత్రివర్గంలోకి తీసుకుంది ప్రభుత్వం. కానీ గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై సస్పెన్స్ వీడటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం నామినేట్ చేసింది. వీరి నియామకాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకం చెల్లదని వారి పదవులను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంది.గత ఆగస్ట్ 30న జరిగిన క్యాబినెట్ సమావేశంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై చర్చించిన మంత్రిమండలి ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ఫైల్ పంపింది. అయితే కోదండరాం, అమీర్ అలీఖాన్ నియామకంపై వేసిన కేసులో తాము తుది తీర్పు ఇచ్చేంత వరకు కొత్త నియామకాలు చేపట్టొద్దని సుప్రీంకోర్టు చెప్పడంతో కోదండరాం, అజారుద్దీన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణస్వీకారం చేయలేదు. అయితే గత అక్టోబర్ 31న మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అజారుద్దీన్ ఏప్రిల్ 30లోపు ఎమ్మెల్సీ లేదా ఎమ్మెల్యేగా ఎన్నిక కావాల్సి ఉంది.తెలంగాణలో ప్రస్తుతం ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అయ్యే పరిస్థితి లేదు. వచ్చే ఏడాది నవంబర్‌లో మూడు ఎమ్మెల్సీలు ఖాళీ కానున్నాయి. కానీ అజారుద్దీన్ మంత్రిగా కొనసాగాలంటే అప్పటివరకు ఆగే పరిస్థితి లేదు. ఒకవేళ ఎమ్మెల్సీ కవిత రాజీనామాను స్పీకర్ ఆమోదించినా అది నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు ఆ స్థానాన్ని భర్తీ చేసే అవకాశం లేదంటున్నారు. దీంతో అజారుద్దీన్ మంత్రి పదవి..సుప్రీంకోర్టు తుది తీర్పుపైనే ఆధారపడి ఉందని అంటున్నారు. సుప్రీంకోర్టు ఫైనల్ డెసిషన్ వచ్చే వరకు అజారుద్దీన్, కోదండరాం ఎదురు చూడటం తప్ప మరో మార్గం లేదని లీగల్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు.ఏప్రిల్ 30 వరకు అజారుద్దీన్ ఏదో ఒక సభలో సభ్యుడిగా ఎన్నిక కావాలి. లేకపోతే ఆయన మంత్రి పదవి ఊస్ట్ అయ్యే అవకాశముంది. దీంతో ఈ సమస్యను ఎలా అధిగమించాలనే దానిపై కాంగ్రెస్ నేతలు లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చిస్తున్నారట. ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో అప్పీల్ చేసైనా సరే ఎమ్మెల్సీల నియామకంపై సందిగ్ధతకు చెక్ పెట్టాలని భావిస్తున్నారట. లేకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి ఆరు నెలల ముచ్చటగానే మిగిలిపోనుంది.గతంలో నందమూరి హరికృష్ణ కూడా సేమ్ టు సేమ్ ఇలాంటి సిచ్యువేషనే ఎదుర్కొన్నారు. అప్పట్లో హరికృష్ణ కూడా ఏ సభలో సభ్యుడు కాకపోవడంతో మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ఇక ఆయన రాజకీయాలకే దూరం కావాల్సి వచ్చింది. మళ్లీ చట్టసభలో ఎన్నడూ అడుగుపెట్టలేకపోయారు. ఇప్పుడు అజారుద్దీన్‌కు కూడా అలాంటి పరిస్థితి ఏర్పడిందంటున్నారు.ఒకవేళ ఏప్రిల్ 30లోపు సుప్రీంకోర్టు ఫైనల్ తీర్పు ఇవ్వకపోతే..అజారుద్దీన్‌తో రాజీనామా చేయించి మళ్లీ క్యాబినెట్‌లోకి తీసుకుంటారన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. ఎలాగూ క్యాబినెట్ ప్రక్షాళన చేయాలనే ఆలోచన ఉండటంతో..అజార్‌ను రిజైన్ చేయించి..మళ్లీ మంత్రివర్గంలోకి తీసుకుంటే..ఇంకో ఆరు నెలల టైమ్ ఉంటుందని భావిస్తున్నారట. అప్పటిలోగా సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వడమో లేక..నవంబర్‌లో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ సీట్లలో ఒక బెర్త్ కట్టబెట్టమో రెండింటిలో ఏదో ఒక ఆప్షన్ ఉంటుందనేది హస్తం పార్టీ పెద్దల ఆలోచన అంటున్నారు. ఏదైనా అజారుద్దీన్‌కు..హస్తం పార్టీకి పెద్ద కష్టమే వచ్చిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# 152 కేసులు...223 మంది ఉద్యోగులు

**హైదరాబాద్, డిసెంబర్ 31, పెన్ పవర్:** తెలంగాణలో అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న ఏసీబీ (యాంటీ కరప్షన్ బ్యూరో) ఈ ఏడాది సరికొత్త రికార్డులు నమోదు చేసింది. కరప్షన్ కేసుల నమోదులో గత ఏడాదితో పోలిస్తే భారీగా పెరుగుదల కనిపించింది. అవినీతి అధికారులను వెంటాడుతూ ఏసీబీ చర్యలు చెప్పటిశీది . ఈ ఏడాది ఇప్పటివరకు తెలంగాణ ఏసీబీ 220కు పైగా కేసులను నమోదు చేసింది. ఈ కేసుల్లో 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అరెస్ట్ చేయడం విశేషం. ముఖ్యంగా అధిక శాతం కేసులు ట్రాప్ కేసులే కావడం గమనార్హం. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన అధికారుల సంఖ్య ఈ ఏడాది మరింత పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏసీబీ నమోదు చేసిన కేసుల సంఖ్య దాదాపు 100 వరకు ఎక్కువగా ఉంది. గత సంవత్సరం మొత్తం 152 కేసులు నమోదు కాగా, వాటిలో 223 మంది ఉద్యోగులను అరెస్ట్ చేశారు. అయితే ఈ ఏడాది కేసుల సంఖ్య మాత్రమే కాకుండా, దాడుల తీవ్రత కూడా పెరిగినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.అత్యధికంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు ఏసీబీ వలలో చిక్కడం విశేషం. కీలక శాఖల్లో పనిచేస్తున్న అధికారులు లంచాలకు అలవాటు పడటంపై ఏసీబీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఏసీబీ స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది.మరోవైపు ఆదాయానికి

మించిన ఆస్తుల కేసుల నమోదులో కూడా ఈ ఏడాది పెరుగుదల కనిపించింది. అవినీతితో అక్రమంగా ఆస్తులు కూడబెట్టిన అధికారులపై ఏసీబీ దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే 17 మంది అవినీతి అధికారుల భరతం పట్టినట్టు ఏసీబీ వెల్లడించింది. మొత్తంగా చూస్తే, తెలంగాణలో అవినీతిపై ఏసీబీ చేపడుతున్న చర్యలు మరింత కఠినంగా మారాయి. భవిష్యత్తులో కూడా అవినీతిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఏసీబీ ముందుకెళ్తున్నట్టు స్పష్టమవుతోంది.

# మాయం అవుతున్న గుట్టలు

**హైదరాబాద్, డిసెంబర్ 31, పెన్ పవర్:** రాత్రి పడితే చాలు మొరం మాఫియా రాత్రికి రాత్రి గుట్టలను గుటుక్కుమని మాయం చేస్తున్నారు. గ్రామ శివారులు పట్టణ శివారు లతోపాటు చెరువులు గుట్టలను తవ్వేస్తూ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నది. సెలవు దినాలతో పాటు రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టరాజ్యంగా మొరం తరలిస్తూ లక్షలాది రూపాయలను అర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని జుక్కల్ మద్నూర్ బిచ్కుంద పిట్లం పెద్ద కోడాప్గల్ నిజాంసాగర్ బీర్కూర్ నస్రుల్లాబాద్ నాగిరెడ్డిపేట్ ఎల్లారెడ్డి బాన్సువాడ, బీర్కూర్ కోటగిరి వర్ని చందూర్ పోతంగల్ రుద్రూర్ మోస్రా మండలాల్లో మొరం, మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతుంది.అనుమతులు లేకుండా భారీగా మొరం తరలిస్తూ అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.ఒకటి టిప్పర్ వంటి వాహనాలకు మొరం కు ప్రభుత్వం నుంచి ఒక టన్నుకు రాయల్టీ డిఎంఎఫ్, ఎస్ఎంటి, ఇతర పన్నులు అన్ని కలిపి ఒక టన్నుకు రూ.56 రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఒక టిప్పర్ కు సుమారు రూ. 900 రాయల్టీ చెల్లించాలి. కానీ ఇవేవీ లేకుండానే మొరశీ తరలింపు చేస్తున్నారు. రోజుకు వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మొరం ఒక్కో టిప్పర్ ధర రూ 4000 నుండి 4500 వరకు విక్రయిస్తున్నారు.రోజువారీగా సగటున బాన్సువాడ మండలం నుండే లక్షల్లో వాల్టా రూపంలో ప్రభుత్వానికి ఆదాయం రావాల్సి ఉండగా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రాయల్టీ సొమ్ము, అక్రమార్కుల జేబుల్లోకి వెళ్తుండడంతో గుట్టలు స్వాహా చేస్తున్న మాఫియా పై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు మొరం కావాలంటే సవా లక్ష నియమ నిబంధనలు పెట్టే అధికారులు. అక్రమ రవాణా చేసే వ్యాపారులకు ఎలాంటి నిబంధనలు వర్తించవు. సెలవు వచ్చిందంటే చాలు ఏ అనుమతులు ఉండవు. సర్కారుకు వాల్టా రాయల్టీ చెల్లించరు.అయినా రాత్రి, పగలు అనే తేడా లేకుండా మొరం కొల్లగొడుతారు. ప్రభుత్వానికి ఎలాంటి వాల్టా రాయల్టీ చెల్లించకుండా అధికారులకు మచ్చిక చేసుకొని అక్రమ రవాణా చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట మొరం దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బాన్సువాడ మండలం కొల్లూరు శివార్లలో, సోమేశ్వర్, దేశాయిపేట్, బుడిమి, జక్కల దాని తాండ కెనాల్ శివార్లలో గ్రామ శివారులోని గుట్టల్లో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు కొనసాగుతున్నాయి.టిప్పర్లలో నిత్యం వందల ట్రిప్పుల మొరాన్ని సోమేశ్వర్ శివారు ప్రైవేట్ వెంచర్, బాన్సువాడ లోని ప్రైవేటు వెంచర్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. అక్రమ రవాణా రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినప్పటికీ తెరవెనుక ఈ అక్రమ దందా అధికారులు సంపూర్ణంగా వ్యాపారులకు సహకరిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ అక్రమ దందాకు అధికారులు అండగా ఉండడంతో మూడు పువ్వులు ఆరుకాయలుగా విరజిల్లింది.దీంతో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు ఈ అక్రమ దందా కు వత్తాసు పలకడంతో వ్యాపారులకు ఈ అక్రమ దందా ద్వారా కాసులు వర్షం కురిపించేందుకే అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ జీతం తీసుకుంటూ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులే ప్రభుత్వ గండి కొడుతున్న మాఫియాకు వత్తాసు పలుకుతూ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.అధికారులకు ఏదైనా సమాచారం తెలుసుకు నేందుకు ఫోన్ చేస్తే మండల అధికారులు, జీపిఓలు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం బట్టి చూస్తే అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉన్నదో ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వ ఆదాయానికి గండికోడుతూ మొరం తరలించే వారికి అండగా ఉన్న మండల ఆయా శాఖల అధికారుల పై జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు ఇంత జరుగుతున్న రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తు న్నారని ఆరోపణలు ఉన్నాయి.అక్రమార్కులు రాత్రిపూట తవ్వకాలు జరిపి గుట్టలను, చెరువులను మాయం చేస్తున్నారు. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా అధికార పార్టీకి చెందిన నాయకుల పేరు చెప్పి తవ్వకాలు చేపడుతున్నారు. మొరం మాఫియా ఆగడాలు మితిమీరడంతో వనరులు, వృక్ష సంపద కనుమరుగవుతున్నది.అనుమతులు లేకుండా సాగుతున్న మొరం వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్నది. మొరం వ్యాపారం చేయాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉన్నది. కానీ బాన్సువాడ డివిజన్లో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అక్రమ మొరం,మట్టి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ శాఖ అధికారులు మామూలు తీసుకొని అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల పేరిట అధికారులకు తెలుపుతూ ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్న ఇండ్ల నిర్మాణాలు, వెంచర్లు ఇతరత్రా నిర్మాణాలకు రాత్రి సమయాల్లో మట్టి, మొరం విక్రయాలతో వ్యాపారం సాగిస్తున్నారు. మట్టి, మొరం అక్రమ తవ్వకాలను నియంత్రించాలని స్థానికులు పేర్కొంటున్నారు.సెలవు దినాల్లో,రాత్రి వేళలో జరుగుతున్న అక్రమ మురం తవ్వకాలు రవాణాకు రెవిన్యూ పోలీస్ శాఖలో కొంతమంది అధికారులు కుమ్మక్కు అయినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు పోలీస్ శాఖ పనిలో ఎదుట నుండే అక్రమ మొరం రవాణా సాగుతున్న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు ఉన్నాయి.ఇంత అక్రమ రవాణా జరుగుతున్న అటు రెవెన్యూ ఇటు పోలీస్ శాఖ నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారుల ప్రమేయం ఉండడంతోనే రాత్రి వేళలో అక్రమ రవాణా సాగుతుందని పలు విమర్శలు కూడా తావు ఇస్తుంది ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందంతో తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వంగ రాజేశ్వర్ రెడ్డి మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**సిద్దిపేట, డిసెంబర్ 31పెన్ పవర్:** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం ఖాతా గ్రామానికి చెందిన శివరాత్రి శ్రీనివాస్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, వారికి ?5,000 ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ పెద్దను కోల్పోవడం బాధాకరమని, కష్టకాలంలో అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్లూరు సోనీ మహేష్, నవీన్ పాల్గొన్నారు.

## ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి

**గజ్వేల్, డిసెంబర్ 31పెన్ పవర్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా చేపట్టిన ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం గజ్వేల్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మ్యాపింగ్ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వార్డుల వారీగా బీఎల్‌వోలు, సూపర్ వైజర్లు, బిల్ కలెక్టర్లు సమన్వయంతో పనిచేసి, ఇంటింటి సర్వేలు వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రెండు చోట్ల ఓటు హక్కు ఉన్న వారి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఒకే చోట ఓటు ఉండేలా వెరిఫై చేయాలన్నారు.

## యూరియా కోసం బారులు తీరిన రైతులు

**మెదక్, డిసెంబర్ 31పెన్ పవర్:** మెదక్ జిల్లా నిజాంపేటలో యూరియా కోసం రైతులు బారులు దీరారు. ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా తెల్లవారుజాము నుంచే దుకాణాల వద్దకు చేరుకున్నారు. రెండు దుకాణాలకు రెండు లారీల యూరియా వచ్చిందని తెలుసుకొని పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. నిజాంపేటతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వచ్చి యూరియా కోసం నిరీక్షిస్తున్నారు.

## వికలాంగుల హక్కులపై దాడి:



**నారాయణపేట, డిసెంబర్ 31పెన్ పవర్:** నారాయణపేట జిల్లా కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వికసిత్ భారత్ – రోజ్‌గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు, 2025 ప్రతులను దగ్ధం చేశారు. ఈ బిల్లు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి, గ్రామీణ వికలాంగుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని వేదిక కార్యదర్శి కె. కాశప్ప ఆరోపించారు. కేంద్రం తీసుకువచ్చిన బిల్లు రద్దు అయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఆయన తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 6,38,088 మంది వికలాంగులకు ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించబడిందని ఆయన పేర్కొన్నారు.

## గొర్రెలకు నట్టల మందు పంపిణీ: సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

**జడ్చర్ల, డిసెంబర్ 31పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గొర్రెల నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా, జడ్చర్ల నియోజకవర్గం/ఊర్కొండ మండలంలోని నర్సంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ పులిమామిడి శైలజ శ్రీశైలం గారి ఆధ్వర్యంలో బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం పశువుల ఆరోగ్య పరిరక్షణకు దోహదపడింది.

## బస్సు కోసం గ్రామస్థుల ఆందోళన

**వనపర్తి, డిసెంబర్ 31పెన్ పవర్:** వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపురం నుంచి పామాపురం వెళ్లే బస్సు సకాలంలో రావట్లేదని స్థానికులు వాపోయారు. దీంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం లేదని వారి తల్లిదండ్రులు బస్సు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమయానికి బస్సులు నడిపించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## తాళం వేసిన ఇళ్లపై దొంగల గాలం

**దేవరకద్ర, డిసెంబర్ 31పెన్ పవర్:** మద్దూరు, తాళాలు వేసిన, గ్రామ చివరలో, ఒంటరి వ్యక్తులు ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడుతున్నారు. నెల రోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో రాత్రి 9 గంటలు గడిస్తే ఒక్కరు కూడా ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు చోరీలకు ఉపక్రమిస్తున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నారు. నలుగురు, ఐదుగురు ప్రైవేటు వాహనాల్లో అర్ధరాత్రి తాళాలు ఉన్న ఇళ్లలో చొరబడుతున్నారు. ఈ క్రమంలో వారంతా పక్కాగా రెక్కీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. మద్దూరు మండలం నాగిరెడ్డిపల్లిలో ఇటీవల తాళం ఉన్న ఆరు ఇళ్లలో చొరబడి బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారు. మద్దూరు పట్టణంలో ఓ వ్యక్తి ముసుగు ధరించి ఇంట్లో దొంగతనానికి పాల్పడే ప్రయత్నం చేయగా సీసీ టీవీలో రికార్డు అయింది. ఇంటి యజమాని నిద్రలేవటంతో పారిపోయాడు.

## నిధుల స్వాహా నిజమే!

**మహబూబ్‌నగర్, డిసెంబర్ 31పెన్ పవర్:** వీపనగండ్ల, వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు, మిల్లుకు తరలించినట్లు రైతుల ఖాతాల్లో ప్రభుత్వ ఖజానా నుంచి రూ.14,90,735 నగదు జమ చేసి స్వాహాకు పాల్పడింది నిజమేనని తేలింది. పత్రికల్లో వచ్చిన వార్తలకు జిల్లా అధికారులు స్పందించారు. అదనపు డీఆర్డీవో సరోజ, డీపీఎం ప్రభాకర్, మార్కెటింగ్ ఏపీఎం రాంబాబు, ఏపీఎం మద్దిలేటి, సిబ్బంది గోపల్‌దిన్నెలోని రైతు వేదికలో చేపట్టిన విచారణకు గ్రామ రైతులు, మహిళా సంఘాల సభ్యులు భారీగా హాజరయ్యారు. వారి ఎదుటే ఆపరేటర్ కావలి జగదీశ్వర్‌ను, ధాన్యం విక్రయించినట్లు పేర్కొన్న రైతులను, మహిళా సంఘాల సభ్యులను విచారణ చేశారు.

# త్వరలో 14 వేల పోలీస్ కానిస్టేబుళ్ల భర్తీ



**హైదరాబాద్, డిసెంబర్ 31, పెన్ పవర్:** నిరుద్యోగులకు భారీ శుభవార్త. కొత్త సంవత్సరం 2026లో పెద్ద సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తుంది. సరికొత్తగా జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్ చేసి శాఖల వారీగా ఖాళీలతో నివేదికలను రూపొందిస్తోంది. తాజాగా రిటైర్మెంట్లు పెరగడంతో ఏర్పడిన ఖాళీలను పదోన్నతులతో పాటు, నేరుగా నోటిఫికేషన్లతో నియమించుకోవాలన్న యాక్షన్ ప్లాన్ కు తుది మెరుగులు దిద్దుతోంది.ప్రైవేట్ రంగంలో భారీ సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపడుతున్న ప్రభుత్వం.. ప్రభుత్వ రంగంలోనూ ఆయా శాఖల్లోని ఖాళీలను భర్తీకి పెద్ద సంఖ్యలో ఉద్యోగాల నియామకాలను చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం జనవరి, ఫిబ్రవరి నెలలో నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆర్టీసీలో 198 సూపర్ వైజర్ పోస్టులు, పోలీస్ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు, యూనివర్శిటీల నియామకాల్లో జాప్యం, పలు శాఖల్లో కారుణ్య నియామకాలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.పోలీస్ శాఖలో త్వరలో భారీ సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 14వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నామని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. సుమారు 14వేల స్టయిపెండరీ క్యాడెట్ కానిస్టేబుళ్లతోపాటు ఇతర యూనిఫామ్ సర్వీసుల కానిస్టేబుళ్ల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉన్నాయని డీజీపీ తెలిపారు. నూతన సంవత్సరంలో దీనికి సంబంధించిన ప్రకటన వెలవడుతుందని ఆయన చెప్పారు.

తెలంగాణ పోలీసు శాఖలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తెలంగాణ పోలీసుల కృషి ప్రశంసనీయమని కొనియాడారు.తెలంగాణ పోలీసు శాఖలో ఖాళీల భర్తీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపి కబురు. రాష్ట్రంలో దాదాపు 14 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. చాలా కాలంగా నోటిఫికేషన్ కోసం నిరీక్షిస్తున్న వేలాది మంది అభ్యర్థుల్లో ఈ ప్రకటన కొత్త ఆశలు చిగురింపజేసింది. మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో.. ‘తెలంగాణ నేర వార్షిక నివేదిక–2025‘ను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. డీజీపీ ప్రకటనతో త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇక రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయన్న విమర్శలను డీజీపీ కొట్టిపారేశారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య 2.33 శాతం మేర తగ్గుముఖం పట్టిందన్నారు. 2023 నవంబర్ నాటికి రాష్ట్రంలో 2,34,158 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది నవంబర్ నాటికి ఆ సంఖ్య 2,28,695కు తగ్గిందని చెప్పారు. ముఖ్యంగా అల్లర్ల సంఖ్య 42 శాతం తగ్గడం పోలీసుల పనితీరుకు నిదర్శనమని డీజీపీ పేర్కొన్నారు. శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, ప్రతిపక్షాల ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.‘రాష్ట్రంలో మొత్తం నేరాలు తగ్గినప్పటికీ.. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మహిళల ప్రతిష్ఠకు భంగం కలిగించే కేసులు గత ఏడాదితో పోల్చితే 9.02 శాతం పెరిగాయి. 2021లో 4,476 గా ఉన్న ఇటువంటి కేసులు, 2025 నాటికి 6,476కు చేరుకోవడం గమనార్హం. మహిళలపై మొత్తం నేరాల సంఖ్య కూడా 3.16 శాతం పెరిగి 20,551కి చేరింది. అయితే, అత్యాచారాలు, వరకట్న వేధింపులు, కిడ్నాప్‌లు, ఆత్మహత్య ప్రేరణ వంటి కేసులు తగ్గడం కొంత ఊరటనిచ్చే అంశం. మోసపూరితంగా శారీరక సంబంధం పెట్టుకునే ఉదంతాలపై కొత్తగా అమల్లోకి వచ్చిన బీఎన్ఎస్ సెక్షన్ 69 కింద ఈ ఏడాది 69 కేసులు నమోదు చేశాం.దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు 41 శాతం పెరుగుతుంటే.. తెలంగాణలో మాత్రం పోలీసుల ముమ్మర కసరత్తు వల్ల 3 శాతం తగ్గాయి. సైబర్ నేరాల వల్ల కలిగే ఆర్థిక నష్టాలు దేశస్థాయిలో 6 శాతం తగ్గగా, తెలంగాణలో ఏకంగా 21 శాతం తగ్గుదల నమోదైంది. తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (౧+జూదీ) కృషి ఫలితంగా ఈ ఏడాది 24,498 మంది బాధితులకు రూ.159.65 కోట్లను తిరిగి ఇప్పించగలిగారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన ‘ఈగల్‘ బృందం ఈ ఏడాది విశేష ఫలితాలను సాధించింది. సుమారు రూ.172.93 కోట్ల విలువైన డ్రగ్స్‌ను జప్తు చేశారు. ఎన్‌డీపీఎస్ కేసుల నమోదులో 30.36 శాతం పెరుగుదల కనిపించింది, అంటే నిఘా పెరగడం వల్ల నేరస్థులు ఎక్కువగా పట్టుబడుతున్నారు. ఇక మావోయిస్టుల విషయానికి వస్తే, తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఏడాది 509 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.‘ అని డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు.

# గజగజ వణికిస్తున్న చలి



**అదిలాబాద్, డిసెంబర్ 31, పెన్ పవర్:** తెలంగాణను గడ్డకట్టే చలి వణికిస్తోంది. మూడు వారాలుగా కొనసాగుతున్న తీవ్ర చలితో జనజీవనం స్తంభించింది. ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయాయి. హైదరాబాద్‌లోనూ చలి తీవ్రత పెరిగింది. మేఘాలు లేకపోవడం, హిమాలయాల నుంచి చల్లని గాలులు రావడమే దీనికి కారణాలని నిపుణులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ అయ్యాయి.తెలంగాణ రాష్ట్రాన్ని గడ్డకట్టే చలి వణికిస్తోంది. గత మూడు వారాలుగా తీవ్రమైన చలిగాలులు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తోంది. వరుసగా 24వ రోజు కూడా చలి తీవ్రత ఏమాత్రం తగ్గకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు గజగజలాడుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోయి సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ ఆయా ప్రాంతాలకు ‘ఆరెంజ్ అలర్ట్‘ జారీ చేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.భాగ్యనగరంలో కూడా చలి తీవ్రత ఊహించని స్థాయిలో పెరిగింది. సాధారణంగా కాస్త వెచ్చగా ఉండే హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడం గమనార్హం. శేరిలింగంపల్లిలోని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో 8.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నగరంలోని ఇతర ప్రాంతాలైన రాజేంద్రనగర్ 10 డిగ్రీల సెల్సియస్, మౌలాలి 10.2 డిగ్రీల సెల్సియస్, గచ్చిబౌలి 10.9 డిగ్రీల సెల్సియస్ వంటి

చోట్ల కూడా చలి గాలులు తీవ్రంగా ఉన్నాయి. తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కురుస్తుండటంతో ఆఫీసులకు వెళ్లేవారు. పాఠశాల విద్యార్థులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వాతావరణ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఈ ఏడాది డిసెంబర్ నెలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. దీనికి ప్రధానంగా మూడు కారణాలు కనిపిస్తున్నాయి. మేఘాలు లేకపోవడం వల్ల భూమి పగటిపూట గ్రహించిన వేడి రాత్రివేళ త్వరగా అంతరిక్షంలోకి వెళ్ళిపోతోంది. హిమాలయాల నుంచి వీస్తున్న పొడి, శీతల గాలులు నేరుగా తెలంగాణ మీదుగా ప్రవహిస్తున్నాయి. రాత్రి సమయాల్లో భూమి ఉపరితలం వేగంగా చల్లబడటం వల్ల కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రాష్ట్రంలోనే అత్యంత శీతల ప్రాంతంగా నిలిచింది. ఇక్కడ 5.6 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చలి నుంచి తట్టుకోవడానికి ఉదయం, రాత్రి సమయాల్లో చలిమంటలనే ఆశ్రయిస్తున్నారు. రాబోయే రెండు మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉన్నందున.. వృద్ధులు, చిన్నపిల్లలు ఉదయం పూట బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేడి ఆహారం, గోరువెచ్చని నీటిని తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు.

# ప్రజలకు శాపంగా మారుతున్న మద్యం దుకాణాలు

**కూకట్ పల్లి: పెన్ పవర్:** మద్యం ప్రియులకు మేలు చేసేలా తెరుచుకుంటున్న వైన్ షాపులు, సామాన్య ప్రజలకు మాత్రం శాపంగా మారుతున్నాయి.ఇప్పటికే కూకట్పల్లి ప్రాంతంలో వైన్ షాపుల సంఖ్య పెరిగినా, జనావాసాల మధ్యలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ నిర్లక్ష్యానికి ఉదాహరణగా కూకట్పల్లిలోని దారువాల వైన్స్ నిలుస్తోంది. నేషనల్ హైవే మీద ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలు ఉండగా, అదే మార్గంలో ఈ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయడం వాహనదారుల కష్టాలను రెట్టింపు చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నా యి. ప్రజలు సేదతీరేందుకు ఏర్పాటు చేసిన బతుకమ్మ కుంట, ఐడిఎల్ చెరువు

సమీపంలోని పార్కులు, ఇప్పుడు మందుబాబుల అడ్డాలుగా మారాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అనుమతులు లేకుండా, టౌన్ ప్లానింగ్ అధికారులను ప్ర భావితం చేసి రేకుల షెడ్డు ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.పార్కుల్లోనే మద్యం సేవించడంతో మహిళలు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.ఇక హైవే నుంచి హైటెక్ సిటీకి వెళ్లే హైస్పీడ్ రోడ్డుపై, యూటర్న్ వద్ద వైన్ షాప్ ఏర్పాటు చేయడం ప్రమాదాలకు ఆహ్వానం

పలికినట్లేనని స్థానికులు హెచ్చరిస్తున్నారు. పక్కనే హెవీ వెహికల్ పార్కింగ్, రోజూ ట్రాఫిక్ రద్దీ ఉన్న ఈ రోడ్డుపై దారువాల వైన్స్ ప్రారంభం ప్రజలకు తీవ్రమైన కష్టంగా మారింది.బతుకమ్మ వేడుకలు, వినాయక నిమర్జన జరిగే ఈ ప్రాంతంలో ప్రజలకు ఇబ్బందిగా మారిన ఈ అక్రమ మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కూడళ్ళు, రోడ్ల మధ్యలో పచ్చదనం పెంచేలా చర్యలు చేపట్టండి

**హైదరాబాద్ పెన్ పవర్:** నగరంలో ప్రధాన రోడ్లలోని డివైడర్లలో, కూడళ్ళలో పచ్చదనం పెంచేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని వెంగమాంబ కూడలి, వెస్ట్ చర్చి రోడ్డు, బాలాజీ కాలనీ, ఎస్.వి.నగర్, తదితర ప్రాంతాల్లో డివైడర్లను, కూడళ్ళను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్బంగా అన్ని డివైడర్ల మధ్యలో పలు రకాల పూల మొక్కలు నాటి సుందరంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే కూడళ్ళలో కూడా పచ్చిక పెంచి మొక్కలు పెంచాలని తెలిపారు. డివైడర్లు, కూడళ్ళ మధ్య ఉన్న మొక్కలు పాడు కాకుండా ఇనుప గ్రిల్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రహరీ గోడలకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పెయింటింగ్ చేయించేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డి.ఈ.లు మధు, మహేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, అంబేద్కర్ పూలే ఫౌండేషన్ వ్యవస్థపాక అధ్యక్షులు పరసారత్నం, ప్రజలు తదితరులు ఉన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

**హుజూరాబాద్, డిసెంబర్ 31పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా తిమ్మపూర్ మండలం కొత్తపల్లి వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపెల్లి రెడ్డి కాలనీ సమీపంలో డివైడర్ మధ్య నుంచి సైకిల్‌పై రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని.. కరీంనగర్ వైపు వెళ్తున్న హుజురాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ బ్లూ కోర్ట్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## చెక్ పవర్ ఉందని చెడుగుడులాడొద్దు!

**ఖమ్మం, డిసెంబర్ 31పెన్ పవర్:** గ్రామ పంచాయతీ పాలనపై పంచాయతీరాజ్ చట్టం విధి విధానాలను రూపొందించింది. పంచాయతీల్లో సర్పంచి, ఉపసర్పంచులకు కలిపి చెక్‌పవర్ ఉంటుంది. పంచాయతీల్లో నిర్వహించే ప్రతి పనికి, అవసరానికి ఇద్దరి ఆమోదం ఉండాలి. ఈ క్రమంలో రాజకీయాలు చోటుచేసుకోవడం, ఆమ్యామ్యాలు, పొరపాట్లు సంతకాల చుట్టూ తిరుగుతుంటాయి. అందుకే చెక్‌పవర్ ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరించకపోవడం మంచిది.

## విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య దంపతుల కోటి విరాళం



**మధిర, డిసెంబర్ 31పెన్ పవర్:** తిరుమల తిరుపతి దేవస్థానానికి విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ గుంటూరు వాసులు లావు రత్తయ్య దంపతులు కోటి రూపాయలు విరాళంగా అందించారు. శ్రీ వెంకటేశ్వర విద్యా దాన ట్రస్టుకు ఈ విరాళాన్ని చెక్కు రూపంలో తిరుమల లోని టిటిడి చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విరాళం తిరుమల తిరుపతి దేవస్థానం అన్నదాత కార్యక్రమానికి, నిత్య అన్నదానం సందర్భంగా ఉపయోగపడుతుంది.

## సంక్రాంతి ముందే కోడి పందేల జోరు

**వైరా, డిసెంబర్ 31పెన్ పవర్:** సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో, జిల్లాలో కోడి పందేల సందడి ప్రారంభమైంది. అశ్వారావుపేట, దమ్మపేట, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లందు, బూర్గంపాడు మండలాల్లోని ఆయిల్పామ్ తోటల్లో పుంజులు పందేలకు సిద్ధమవుతున్నాయి. రెండు, మూడు నెలల ముందు నుంచే వీటికి బలవర్ధకమైన ఆహారం అందిస్తూ, ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో కోడి రకాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు ధర పలుకుతోంది. పందేల రాయుళ్లు ఇప్పుడు కోళ్ల కొనుగోళ్ల కోసం తోటల బాట పడుతున్నారు.

## తగినన్ని యూరియా నిల్వలు ఉన్నాయి: ఏడిఏ

**పాలేరు, డిసెంబర్ 31పెన్ పవర్:**యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రఘునాథపాలెం సొసైటీలో యూరియా నిల్వలు, పంపిణీని ఏవో ఉమామహేశ్వర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో రైతులకు తగినన్ని యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. గడిచిన ఐదు రోజుల్లో సుమారు 200 టన్నుల యూరియాను సొసైటీల ద్వారా రైతులకు అందించామన్నారు. ప్రస్తుతం అన్ని సొసైటీల్లో కలిపి 150 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు.

## యూట్యూబర్‌పై కేసు నమోదు

**సత్తుపల్లి, డిసెంబర్ 31పెన్ పవర్:** హిందూ దేవతల పట్ల అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ వీడియో విడుదల చేసిన యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడిపై ఖమ్మం ఖానాపురంహవేలి ఠాణాలో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ కథనం మేరకు.. విశాఖపట్టణానికి చెందిన అన్వేశ్ అనే యువకుడు విదేశాల్లో ఉంటూ ఓ పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. ఇటీవల అతను భక్తుల మనోభావాలు దెబ్బతినేలా హిందువులు పూజించే సీతాదేవి, ద్రౌపదీదేవిలపట్ల అసభ్యంగా ఇటీవల వీడియో విడుదల చేశాడు. దానవాయిగూడేనికి చెందిన జి.సత్యనారాయణరావు అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

## మౌనిక గౌడ్ కు తెలంగాణ గౌడ సంఘం మహిళా కార్యదర్శి పదవి



**వర్ధన్నపేట, డిసెంబర్ 31పెన్ పవర్:**తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొనగాని యాదగిరి గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలో గౌడ కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మౌనిక గౌడ్ సేవలను గుర్తించి, ఆమెను తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా నియమించారు. ఈ నియామకం వరంగల్ హనుమకొండ కేంద్రంగా జరిగింది.

## నేరాల తగ్గింపునకు చర్యలు: సీపీ ధార కవిత

**వరంగల్ ఈస్ట్, డిసెంబర్ 31పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ పోలీస్ స్టేషన్‌ను బుధవారం సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత సందర్శించారు. గత మూడేళ్ల నేరాల వివరాలు అడిగి, వాటిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మడికొండ సీఐ పుల్యాల కిషన్, ఇతర పోలీస్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. అధికారులు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు.

## రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**వరంగల్ వెస్ట్, డిసెంబర్ 31పెన్ పవర్:** రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వరంగల్–చింతలపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య అబ్బని కుంట మైసమ్మ దేవాలయం సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మృతుడికి 45 ఏళ్ల వయసు ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

## మద్యం సేవించి పట్టుపడితే కేసులు తప్పవు:

**ఆదిలాబాద్, డిసెంబర్ 31 పెన్ పవర్:** జిల్లా కేంద్రంలో సోమవారం అర్ధరాత్రి ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ, మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ సాయి కిరణ్ తెలిపారు. రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లపై తిరిగేవారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. న్యూ ఇయర్ వేడుకలను కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని, రోడ్లపై కేకులు కట్ చేయవద్దని సూచించారు.

## బోంద్రేట్ గ్రామంలో పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ



**బోథ్, డిసెంబర్ 31పెన్ పవర్:** తానూర్ మండలంలోని బోంద్రేట్ గ్రామంలో సర్పంచ్ రవీంద్ర పటేల్ ఆధ్వర్యంలో మేకలు, గొర్రెలకు భోసి క్లస్టర్ వెటర్నరీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అమృతం నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ రవీందర్ పటేల్ ను డాక్టర్ అమృతం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కదం నాగేందర్ పటేల్, ఉప సర్పంచ్ శివప్రసాద్ బత్తి, వార్డ్ సభ్యులు శంకర్ బాలేరావ్, భోజరాం పటేల్, అశ్విని యోగేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ నేతల కీలక భేటీ

**నిర్మల్, డిసెంబర్ 31పెన్ పవర్:** బుధవారం నిర్మల్ లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు వెద్మ బొజ్జు పటేల్ మున్సిపల్ ఎన్నికలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ బలోపేతం, సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని నిర్ణయించారు. స్థానిక సమస్యలు, అభివృద్ధి, ఎన్నికల వ్యూహాలపై అభిప్రాయాలు మార్పిడి చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

## జల్ భగీరథి నీటి కుంటలను పరిశీలించిన కలెక్టర్

**ముథోల్, డిసెంబర్ 31పెన్ పవర్:** జల్ భగీరథి పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణంలో అవకతవకలు జరిగాయని సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు ప్రచారాలపై స్పందిస్తూ, మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో నీటి కుంటలను కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు కోసం మంచిర్యాల జిల్లాలో చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించిందని ఆయన తెలిపారు.

## ఛలో కొండగట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి:

**కరీంనగర్, డిసెంబర్ 31పెన్ పవర్:** జనసేనాని, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కొండగట్టు అంజన్న సన్నిధికి రానున్న నేపథ్యంలో, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. సిర్పూర్ నియోజకవర్గం కాగజ్‌నగర్ పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి మందిరంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ పిలుపు ఇచ్చారు. పవన్ కళ్యాణ్ రాక సందర్భంగా, కొండగట్టులో 96 సత్రం గదుల నిర్మాణానికి రూ. 35.19 కోట్లతో భూమి పూజ నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

## మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ



**మానకొండూరు, డిసెంబర్ 31పెన్ పవర్:** పట్టణంలోని నరేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో స్వర్గీయ మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్ రావు స్మారకార్థం, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు ఆధ్వర్యంలో జనవరి 4 ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మెట్పల్లి పట్టణ జువ్వాడి భవన్‌లో మెగా జాబ్ మేళా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో నిర్వహించబడుతోంది.

## పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు నమోదు చేయాలి

**సిరిసిల్ల, డిసెంబర్ 31పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు, ఎరువులు కొనుగోలు చేసే రైతుల పట్టాదారు పాస్ పుస్తకం వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాప్, పెద్దూర్ లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆమె ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్, స్టాక్ ఎరువుల నిల్వలను పరిశీలించి, విక్రయించిన ఎరువులు, రైతుల వివరాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫెర్టిలైజర్ షాపులు ఉదయాన్నే తెరవాలని, సాగుకు అనుగుణంగా ఎరువుల పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## నిజమే చిరుత పులి ముద్రలే: ఫారెస్ట్ అధికారులు

**వేములవాడ, డిసెంబర్ 31పెన్ పవర్:** వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజీపేట గ్రామ శివారులో రైస్ మిల్ వెనుక వరిమడిలో చిరుత పులి కాలిముద్రలు కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని ఫారెస్ట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అవి చిరుత పులి ముద్రలేనని ఎఫ్ఆర్ఓ మహమ్మద్ ఖలీలుద్దీన్ స్పష్టం చేశారు. రాత్రి సమయంలో అటవీ లేదా వరి పొలాల వైపు వెళ్లవద్దని, అటవీ సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ గమనిస్తున్నారని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మూడేళ్ల ముందు నుంచే హడావిడి..

**కాకినాడ, డిసెంబర్ 31, పెన్ పవర్:**
సాధారణంగా ఎన్నికలు దగ్గరపడుతుండడంతో సీట్లు దక్కించుకునేందుకు నేతలు పోటీ పడుతుంటారు.. దానికోసం ప్రచార అస్త్రాలతోపాటు ప్రజలతో మమేకమవ్వడం, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం.. అధినేతలను, ముఖ్యనేతలను కలుసుకుని తన గుర్తింపును పదిలపరచుకోవడం వంటివి చూస్తుంటాం.. కానీ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ప్రతిపక్షపార్టీ వైఎస్సార్ సీపీ లో పరిస్థితి దీనికి భిన్నంగా మారింది.. సాధారణ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల కాలం ఉన్నా వైసీపీ నాయకులు వైసీపీ అసెంబ్లీ సీటు కోసం నానా హైరానా పడుతున్నారు.. బరిలో మేమున్నామంటే మేమున్నామంటూ నియోజకవర్గ సమన్వయకర్తతో సంబంధం లేకుండా ఎవరికివారు తమ ఉనికిని చాటుకునేందుకు కాపాడుకునేందుకు వీర ప్రయత్నాలు చేస్తున్నారు.. 2012 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘోర పరాజయం తరువాత చాలా నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు సైలెంట్ మోడ్‌లోకి వెల్లిపోయారు.. ఇదే తీరు అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలోకూడా కనిపించింది.. అయితే వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మార్పు తరువాత అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది.. అమలాపురం నియోజకవర్గంలో తిరుగులేని పాత్ర పోషించిన మాజీ మంత్రి విశ్వరూప్ నియోజకవర్గానికి దూరమవ్వడం.. ఆయన కుమారుడు శ్రీకాంత్ నాయకత్వాన్ని అంగీకరించని కొందరు పార్టీ నేతలు పక్కచూపులు చూడడం.. మొత్తం మీద నియోజకవర్గంలో వైసీపీ ఐక్యతా రాగం బీటలువారి రిజర్వుడు కేటగిరిలో ఉన్న కొందరు నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.. ఇటీవల ఉప్పలగుప్తంలో జరిగిన జగన్ జన్మదిన వేడుకలో ప్రోటోకాల్ పాటించలేదంటూ ఎమ్మెల్సీ ఇజ్రాయేల్ అసహనం వ్యక్తం చేస్తూ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయముందని, అధిష్టానం ఎవరికి సీటు ఇచ్చినా వారి గెలుపుకోసం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.. అంటే అమలాపురం వైసీపీలో సీటు కోసం హీటు పెరిగిందా అన్న సెటైర్లు వినిపిస్తున్నాయి.. అమలాపురం పార్లమెంటు స్థానం నుంచి తొలిసారిగా ఎంపీగా పోటీచేసి విజయం సాధించిన మాజీ ఎంపీ చింతా అనురాధ ఇటీవల కాలంలో తన స్పీడు పెంచారు.. మొన్నటి ఎన్నికల్లో సీటు దక్కకపోవడంతో నియోజకవర్గానికి చాలా కాలం దూరమయ్యారు.. అయితే ఎన్నికల సమయంలో మాత్రం అడపా దడపా ప్రచారంలో పాల్గొన్న అనురాధ మొత్తం మీద సీఈసీ సభ్యురాలిగా పదవిని తెచ్చుకోగలిగారు. దీంతో అప్పటి నుంచి స్పీడు పెంచిన అనురాధ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు.. ఓ పక్క పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ప్రత్యేకంగా తన వర్గంతో పరామర్శల నుంచి పలుకరింపుల వరకు ఒక్క రోజులో అనేక చోట్ల చుట్టేస్తున్నారు.. అంతటితో ఆగక సోషల్ మీడియా వేదికగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఎంపీ అనురాధ వెంట నడుస్తున్నవారిలో ఎక్కవ మంది గతంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గమే ఉండడం కనిపిస్తోంది.. ఉప్పలగుప్తంలో జరిగిన జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలో మాజీ మంత్రి విశ్వరూప్, నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీకాంత్, ఎమ్మెల్సీలు ఫోటోలు లేకుండానే ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం అక్కడి వారు చింతా అనురాధా నాయకత్వాన్ని బలపరుస్తున్నట్టు చెప్పకనే చెప్పినట్లయ్యింది.. గుడ్ సీడ్ ఫౌండేషన్ ద్వారా విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహించే వైసీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డిని తరచూ కలవడం, ఇటీవల జరిగిన జగన్ జన్మదిన వేడుక సందర్భంగా భారీ స్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం ఎప్పటిలానే కనిపించినా ఈ ఏడాది అయితే మరింత జోరు పెంచినట్లు కనిపిస్తోంది.. అయితే గత కొన్ని నెలలుగా ఒకప్పుడు మాజీ మంత్రి విశ్వరూప్ అత్యంత సన్నిహితులుగా మెలిగిన వారిలో కొంత మంది రమణారావు వెంట కనిపిస్తున్నారు.. జగన్ అజెండాతో కొంత మంది పార్టీ యువత చేస్తున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం, నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేయడంతోపాటు ఆ వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తన ఉనికిని చాటుకునేందుకు మరింత స్పీడు పెంచినట్లు కనిపిస్తోంది.. ఇదిలా ఉంటే మాజీ ఎంపీ అనురాధ, రమణారావు పలు కార్యక్రమాలకు కలిసి పాల్గొనడం ఆ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ కానీ, ఇతర ముఖ్యనేతలు కనిపించకపోవడంపై చర్చ సాగుతోంది..నియోజకవర్గంలో మాజీ మంత్రి విశ్వరూప్ అనుచర వర్గంలో చాలా మంది పక్కచూపులు చూడడం ఇంతకాలం అసంతృప్తితోనే ఆయన వెంట నడిచారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.. ఓటమి తరువాత అందులోనూ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాధ్యతల మార్పు తరువాత వర్గీయులకు వంక దొరికిందా అన్న చర్చ జరుగుతోంది.. ఇటీవల ప్రకటించిన పార్టీ పదవుల్లో ఆశపడి భంగపడ్డ వారు, అధికారంలో ఉన్నప్పుడు తమకేమీ ఉపయోగపడలేదన్న అసంతృప్తితోనే దూరమవుతున్నట్లు కొందరు చెబుతున్నట్లు తెలుస్తోంది.. అయితే ముఖ్య అనుచరగణంలో కొందరు మాత్రం విశ్వరూప్ వెంటే ఉండగా విశ్వరూప్ స్థానికంగా పెద్దగా ఉండకపోవడంతో వారు ఇటీవలకాలంలో సైలెంట్ అవుతున్నారు.. ఇక తప్పక నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీకాంత్ పిలుస్తున్నప్పుడు వెళ్లి హాజరవుతున్నట్లు తెలుస్తోంది.. రాబోయే ఎన్నికల పండుగ కోసం ఎదురు చూస్తున్న కొందరు వైసీపీ నాయకులు ముందే కూసిన కోయిల చందంగా ప్రచారార్భాటాలతో దూసుకుపోతుండగా మీరు కోనసీమకు మళ్లీ రావాలంటూ ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబుకు కొందరు వైసీపీ నాయకులు స్వాగతం పలుకుతున్నారని తెలుస్తోంది.. సోషల్ మీడియా వేదికగా కూటమి నేతలపై విరుచుకుపడుతున్న బొజ్జా ఐశ్వర్యకు వైసీపీ బెర్త్ ఖాయం అంటూ మరికొందరు జోష్యం చెప్పడం నియోజకవర్గంలో కనిపిస్తోంది.. ఎన్నికలకు చాలా సమయం ఉన్నా మొత్తం మీద అమలాపురం వైసీపీలో మాత్రం సీట్ కోసం హీట్ కనిపిస్తోంది..

# కేడర్ లో జోష్ నింపిన కేసీఆర్




**హైదరాబాద్, డిసెంబర్ 31, పెన్ పవర్:**
బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ రాజకీయ క్షేత్రంలో తనదైన శైలిలో గర్జించారు. తెలంగాణ రాజకీయాల్లో మునుపటి జోష్‌ను నింపుతూ పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడిన తీరు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించకుండానే, అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న వైఫల్యాలను ఎండగట్టిన ఆయన, ముఖ్యంగా ప్రజల ప్రాణధారమైన కృష్ణా జలాల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ఈ వ్యవహారంలో రెండు ప్రభుత్వాలు 'దొంగాట' ఆడుతున్నాయని, తెలంగాణ హక్కులను తాకట్టు పెడుతున్నాయని ఆయన మండిపడ్డారు.పాలనాపరమైన వైఫల్యాలపై కేసీఆర్ చేసిన విమర్శలు గంభీరంగా ఉండటమే కాకుండా, తెలంగాణ అస్తిత్వానికి సంబంధించిన అంశాల చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పేరును ఎక్కడా ఉచ్చరించకుండానే, కేసీఆర్ తనదైన శైలిలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ వైఖరి వల్ల రైతులకు, సాధారణ ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను ఆయన సోదాహరణంగా వివరించారు. ముఖ్యంగా కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించే దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.తన పదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధిని, ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ ఆయన చేసిన విమర్శలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. గతంలో కంటే మరింత స్పష్టతతో, పదునైన మాటలతో కేసీఆర్ రంగంలోకి దిగడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. కేసీఆర్ పునరాగమనం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీస్తుందన్న సంకేతాలను ఈ సమావేశం బలంగా ఇచ్చింది.

**జనవరి 2 నుంచి అసెంబ్లీకి...**

14 ఏళ్ల పోరాటం. పదేళ్ల అధికారం. రెండేళ్ల ప్రతిపక్ష పాత్ర. ఒకే ఒక్కడు. ఆయనే కేసీఆర్. నాడు ఉద్యమ నాయకుడిగా అయినా..తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా..ఆయన ఫాంహౌస్‌లో ఉన్నా వార్తే. తెలంగాణ భవన్‌కు వచ్చినా హాట్ టాపికే. అసెంబ్లీకి అటెండ్ అయితే అందరిలో క్యూరియాసిటీ. అలాంటి సీనే మళ్లీ రిపీట్ అయింది. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్ కేసీఆర్ మీడియా ముందుకు వచ్చారు.కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై కాంగ్రెస్ సర్కార్ తీరును తూర్పార బట్టారు. ఇక పోరు బాటే అంటూ హెచ్చరించారు. ఆ తర్వాత వారం రోజుల్లోనే అసెంబ్లీ స్టార్ట్ అయింది. మొదటి రోజు సమావేశాలకు సార్ అటెండ్ అయ్యారు. ప్రధాన ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్ దగ్గరికి వెళ్లి మరీ సీఎం రేవంత్ పలకరించారు. ఆ తర్వాత సభలో 5 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు మాజీ సీఎం. దీంతో కేసీఆర్ సభకు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇంతకు జనవరి 2 నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు కేసీఆర్ వస్తారా రారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో నందినగర్‌లోని తన నివాసంలో ముఖ్యనేతలతో సమావేశాలు నిర్వహిస్తూ..శాసనసభా వేదికగా సర్కార్‌ను ఇరకాటంలో పెట్టే ప్లాన్ చేస్తున్నారట గులాబీ దళపతి.అటు సర్కార్ కూడా జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌లో కృష్ణా గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చకు సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎజెండాను కూడా ఫిక్స్ చేసింది. జనవరి 2న కృష్ణా, 3న గోదావరి బేసిన్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సభలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇవ్వనున్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు తమకు కూడా అవకాశం ఇవాలని ప్రతిపక్షం బీఆర్ఎస్ కోరుతోంది. కీలక అంశాలపై అసెంబ్లీలో చర్చ జరగనున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ సభకు వస్తారా రారా అన్నదే ఆసక్తికరంగా మారింది.అయితే జనవరి రెండు నుంచి జరిగే అసెంబ్లీ సెషన్‌కు అటెండ్ కావాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. కృష్ణా-గోదావరి జలాలు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని నిజానిజాలు చెప్పాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు టాక్. అసెంబ్లీకి హాజరుపై ముఖ్యనేతల సమావేశంలో గులాబీ బాస్ ఇండైరెక్ట్ హింట్ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఏ అంశంపై అయినా చర్చకు మనం రెడీగా ఉన్నామ్. ప్రిపేర్ అయి రావాల్సింది అధికార పక్షం. మనది డైరెక్ట్ అటాకే. నీటి లెక్కలన్నీ నాలుక మీదే ఉన్నాయని కేసీఆర్ అన్నట్లుగా తెలుస్తోంది. దీంతో సార్ సభకు వస్తారన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది.కృష్ణా జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై మీడియా సమావేశంలో కేసీఆర్ చేసిన కామెంట్స్‌కు..సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చించేందుకు ప్రభుత్వం రెడీగా ఉందని..దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని ఛాలెంజ్ చేశారు. దీంతో తాను సభకు హాజరు కాకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే స్వయంగా తాను సభకు హాజరై..కృష్ణాజలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చలో పాల్గొని కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టాలని డిసైడ్ అయ్యారట గులాబీ బాస్.ఇరిగేషన్ విషయంలో సీఎంతో సహా మంత్రులెవరికీ సరైన అవగాహన లేదనేది కేసీఆర్ అంచనా అంటున్నారు. అందుకే వాళ్లు మాట్లాడాలంటే ప్రిపేర్ అయి రావాలి. మనది డైరెక్ట్ అటాకే అని కారు పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారట. మొత్తం అసెంబ్లీ సెషన్‌కు కాకపోయినా..నదీ జలాలు, పాలమూరు ఎత్తిపోతలపై చర్చకు మాత్రం తాను తప్పకుండా అటెండ్ కావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే.. విమర్శలు, ప్రతి విమర్శలు..వాగ్వాదాలు..సభ ఎంత ఇంట్రెస్టింగ్‌గా కొనసాగుతుందో చూడాలి.

# కొత్తగా అత్యాధునిక బస్ స్టాండ్

**వరంగల్ డిసెంబర్ 31, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోంది. గడిచిన ఏడాది కాలంలో ఇక్కడ ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు మొదలయ్యాయి. అయితే.. ప్రతిష్టాత్మకమైన వరంగల్ ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. దాదాపు 74.50 కోట్ల రూపాయల వ్యయంతో స్మార్ట్ సిటీ పథకం కింద ఈ మోడల్ బస్టాండ్ నిర్మాణాన్ని ప్రతిపాదించారు. కానీ.. రెండేళ్లు గడుస్తున్నా పనులు ప్రాథమిక దశలోనే ఆగిపోవడం విమర్శలకు దారితీస్తోంది.వరంగల్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న అసంపూర్తి బస్టాండ్ ప్రాంగణం ప్రస్తుతం అధ్వాన్నంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు నిర్మాణం కోసం తీసిన గుంతల్లో నీరు నిలిచి, ఆ ప్రాంతమంతా ఒక చెరువులా కనిపిస్తోంది. ఈ దుస్థితిపై వరంగల్ బీజేపీ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన నీటిలో పడవలు, తెప్పలపై ప్రయాణిస్తూ ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన కమిషన్ల వివాదాల వల్లే ఈ పనులు ఆగిపోయాయని వారు ఆరోపిస్తున్నారు.కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు సాగాల్సి ఉంది. భవిష్యత్తులో 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ బస్టాండ్ డిజైన్ రూపొందించారు. ఇప్పటికే సాంకేతిక, పరిపాలనా అనుమతులన్నీ లభించినప్పటికీ.. నిధుల కొరత పనులకు ఆటంకంగా మారింది. కాళోజీ కళాక్షేత్రం కోసం ప్రభుత్వం ఇవ్వాల్సిన 70 కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉండటం.. గతంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 'కుడా' ఇచ్చిన 45 కోట్ల రూపాయల అప్పు తిరిగి రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.రైల్వే స్టేషన్ నుంచి దిగిన ప్రయాణికులు వెంటనే బస్సు ఎక్కడానికి వీలుగా ఉండే

ఈ బస్టాండ్ నిర్మాణం ఆగిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిధుల సర్దుబాటు లేకపోవడం వల్ల పనులు నిలిచిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో... కొత్త సంవత్సరం ప్రారంభంలోనైనా నిధుల విడుదల జరిగి పనులు పునఃప్రారంభం అవుతాయని అధికారులు ఆశిస్తున్నారు. ఒకవేళ పనులు వేగవంతం అయితే.. 2026 నాటికి ఓరుగల్లు నగరం ఆధునిక హంగులతో కూడిన బస్టాండ్‌ను సొంతం చేసుకోనుంది.

# తెలుగువారికి బృహత్సంహితలు పానుగంటి సాక్షి వ్యాసాలు

**విజయవాడ, డిసెంబర్ 31, పెన్ పవర్:** పానుగంటి ప్రతిభ అనన్యం. ప్రజ్ఞ బహుముఖీనం, నాటకకర్తగా, వ్యాసరచయితగా ఆయన పేరు సుస్థిరం. ప్రక్రియ ఏదైనా ఆయన రచనలకు హాస్యం ఆలంబనం. పదాలు గుప్పించడంలోను, ఒకమాటకు పది మాటలు వాడి వ్యంగ్యాన్ని, వర్ణనను, హాస్యాన్ని రంగరించడంలోను ఆయనకు ఆయనే సాటి. సాక్షి వ్యాసాల శైలి వరద గోదావరిలాగా ఝరీవేగంతో పరుగులెట్టేది. కొందరు ఆయనను "ఆంధ్రా అడిసన్" అంటారు. మరికొందరు ఆయనను "ఆంధ్రా షేక్స్పియర్" అంటారు. గ్రాంథిక భాషలో సామాజిక రుగ్మతలను ఎండగడుతూ ఆయన రాసిన సాక్షి వ్యాసాలు తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నాయి. ఆయన రాసిన నాటకాలు కూడా ఆనాటి సాహితీ అభిమానుల ఆదరణను పొందాయి. " పాను గంటి సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి.. ఎంచేతనంటే వాటిలో పేను లాంటి భావానికాయన ఏను గంటి రూపాన్నియ్యడం నేనుగంటి" అని శ్రీశ్రీ సైతం కొనియాడిన మేటి సాహితీ శిఖరం పానుగంటి. పానుగంటి లక్ష్మీ నరసింహారావు తెలుగు సాహితీవేత్త. తెలుగు సాహిత్యానికి అనేక అమూల్యా భరణాలు అందించిన నరసింహారావును పాఠక లోకం 'కవిశేఖరుడ'నీ, 'అభినవ కాళి దాసు' అనీ బిరుదులతో అభినందించింది. నవంబరు 2, 1865వ తేదీన రాజమహేంద్రవరం తాలూకా సీతానగరంలో రత్నమాంబ, వెంకట రమణయ్య దంపతులకు జన్మించారు. 1884లో మెట్రిక్యులేషన్, 1886లో ఇంటర్, 1888లో బి.ఎ. పరీక్షలలో ఉత్తీర్ణు లైనారు. పెద్దాపురం హైస్కూలులో ఉపాధ్యాయుడిగా చేరిన పాను గంటి, ఆ రోజుల నుండే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. అయితే ఉపాధ్యాయుడిగా తన సంపాదన చాలక పోవడంతో తొలుత లక్ష్మీనరసాపురం సంస్థానంలో దివానుగా చేరారు. ఆ తర్వాత ఉర్లాం, అనెగొంది, పిఠాపురం మొదలైన సంస్థానాల్లో కూడా పనిచేశారు. ఆయన లక్ష్మీ పురం జమిందారిణి రావు చెల్లయమ్మ గారి దివానుగా చేరారు. ఆరు సంవత్సరాల తర్వాత అభిప్రాయ భేదాల మూలంగా ఉద్యోగం మాని వేశారు. తరువాత ఉర్లాము సంస్థానం లోను, బళ్ళారి జిల్లాలోని ఆనెగొంది సంస్థానంలోను దివానుగా కొంత కాలం పనిచేశారు. పిఠాపురం మహారాజా శ్రీ సూర్యారావు బహదూరు పానుగంటి రచనల గురించి వినగా, రాజాకు మైనారిటీ తీరగా రాజ్యాధికారం చేపట్టిన తర్వాత పంతులు గారిని 1915-16 మధ్య 'నాటక కవి'గా తమ ఆస్థానంలో నియమించారు. ఆయన కోరికపై అనేక నాటకాలు వ్రాసారు. వాటి నన్నింటిని మహారాజుగారే అచ్చు వేయించారు. పానుగంటి వారి రచనలల్లో ప్రముఖమైనవి సాక్షి వ్యాసాలు. సువర్ణముఖి, ఆంధ్రపత్రిక లలో 1913 నుండి 1933 మధ్యకాలంలో ప్రచురించ బడ్డాయి. వ్యాసాలన్నీ అచ్చమైన గ్రాంథిక భాషలో ఉన్నా, వ్యవహారానికి దగ్గరగా ఉండే శైలితో రాయడం రచయిత ప్రత్యేకత. వినోద ప్రధానశైలిలో రాస్తూ.. ఆనాటి సామాజిక రుగ్మతలను ఎండ గట్టడం ఈ వ్యాసాల ప్రధాన ఉద్దేశం. 1711 - 12 లో స్పెక్టేటర్ అనే ఆంగ్ల పత్రికలో జోసెఫ్ అడ్డిసన్, రిచర్డ్ స్టీల్ వ్రాసిన స్పెక్టేటర్ పేపర్స్ వ్యాసాలతో ప్రేరణ పొందిన పానుగంటి ఈ వ్యాసాలను రాశారంటారు. ఈ వ్యాసాలలో కాలాచార్యుడు, జంఘాల శాస్త్రి, వాణీదాసు, బొర్రయ్య శెట్టి అనే పాత్రల ద్వారా సామాజిక విషయాలపై చర్చలను పెడతారు రచయిత. వారి సంభాషణల ద్వారా పాఠకుడికి అందాల్సిన సందేశాన్ని అందిస్తారు. "సాక్షి వ్యాసాలు" పుస్తకంగా వచ్చాక, అనతికాలం లోనే పానుగంటి వారి పేరు ఆంధ్రదేశంలో మారుమ్రోగి పోయింది. ఆ వ్యాసాలు విశేష పాఠకాదరణ పొందాయి. సాక్షి వ్యాసాల రాసిన తర్వాత పిఠాపురం జమీందరు ప్రేరణతో ఇంకా అనేక రచనలు చేశారు పానుగంటి. సారంగ ధర చరిత్ర, వృద్ధ వివాహము, రాధాకృష్ణ, నర్మదా పురుకుత్సీయము, సరస్వతి, దుష్టప్రధాని, ఆనందనాథ, కల్యాణ రాఘవము, కంఠాభరణము, విజయ రాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర, బుద్ధ బోధసుధ, వీరమతి, పూర్ణిమ అందులో ప్రముఖమైనవి. ఆయన రాసిన నాటకాలే పానుగంటి వారి అభినవ కాళిదాసు బిరుదును పొందేలా చేశాయి. తన రచనల వలన తొలినాళ్లలో ఆయన విశేషంగా ధనమార్జించినా, అవసాన దశలో పేదరికానికి, ఋణబాధకు గురవడం గమనార్హం. సంస్థానం అందించే గౌరవ వేతనంపైనే ఆయన ఆధారపడాల్సి వచ్చింది. "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును" అని తన చివరిదశలో ఆ మహా రచయిత వాపోయాడంటేనే అతని పరిస్థితి అప్పుడు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత అనారోగ్యం కూడా అతన్ని బాగా కుంగదీసింది. తెలుగు పాఠకులపై చెరగని ముద్ర వేసిన సాక్షి వ్యాసాలను ఆ రోజుల్లో కుర్రకారుతో సహా ఎందరో ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఆ రోజుల్లో అవి కలిగించిన సంచలనం అంతా యింతా కాదు. "జంఘాలశాస్త్రి" అనే పాత్ర ముఖతః పానుగంటి వారు సమకాలిక సాంఘిక దురాచారాల మీద, మూఢ విశ్వాసాల మీద పదునైన విమర్శలు చేసేవారు అని నందూరి రామమోహనరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృదుమధుర నవార్థభాసుర వచనరచనా విశారదులైన" మహాకవి ఆధునిక కాలమున ఎవరు అని ప్రశ్నించినచో నా ప్రత్యుత్తరము "పానుగంటి లక్ష్మీనరసింహారావు"గారని. .. నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బురపడని గద్యప్రేమికు లుండరని, నాటకములలో కన్యాశుల్కము ఎట్టిదో గద్య రచనములలో సాక్షి అటువంటిదని మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. ఆయన తెలుగు సాహితీ లోకాన్ని విడిచి తిరిగి రాని లోకాలకు పానుగంటి వారు వెళ్లినా, సాక్షి వ్యాసాలు మాత్రం చరిత్రలో చిరస్థాయిగా ఉండి పోయాయి. ఇప్పటికీ తెలుగు విద్యార్థుల పాఠ్యాంశాలలో ఈ వ్యాసాలను ప్రచురించడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమే. సుమారు ఇరవై సంవత్సరాలు ఆయన జీవితం సుఖంగా జరిగింది. ఆ రోజుల్లో దివాణం తరువాత వ్యయానికి వీరి గృహమే అనేవారు. ఆధునిక శ్రీనాధునిగా జీవించారు. ఉద్యోగాల వలన, రచనల వలన విశేషంగా డబ్బు గడించినా దానిని నిలువ చేయడంలో శ్రద్ధ కనపరచ లేదు. ఆధునిక శ్రీనాధుని వలెనే అనుభవించి నన్నాళ్ళూ బాగా అనుభవించి, తుది రోజులలో పేదరికానికి ఋణ బాధకు లోనయ్యారు. మహారాజా వారు బాగా పోషించినా, పంతులుగారికి తుదిదశలో వైషమ్యాలేర్పడి, తమదగ్గర ఏనాడో చేసిన ఋణం కొరకు వారికి ఇచ్చే నూట పదహారు రూపాయల గౌరవ వేతనంలో కొంతభాగం తగ్గించ దానికి ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధాప్యంలో ఆయన అటు ఇటు తిరిగి సంపాదించ లేకపోయారు. చేతికి అందివచ్చిన కుమారులు ఉన్నా వారిని ఉద్యోగాలకు పంపలేక పోయారు. పానుగంటి కవి శేఖరుని దుస్థితి గురించి ఆయన వ్రాసిన లేఖను ఆంధ్రపత్రికలో యర్రవల్లి లక్ష్మీనారాయణ ప్రచురించాడు ... "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును". 1933 నుండి శారీరకంగా, మానసికంగా ఆయన ఆరోగ్యం చెడి పోయింది. 1935 లో పిఠాపురంలో ఉత్సవాలు నిర్వహించి పురజనులు ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. పరిస్థితులు మారి, తీవ్ర మనస్తాపంతో జనవరి 1 న , 1940లో మరణించారు.

# వల్లభనేని వంశీ మోహన్ మిస్సింగ్

**విజయవాడ, డిసెంబర్ 31, పెన్ పవర్:**
వల్లభనేని వంశీ మోహన్ మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కొత్త కేసులు చుట్టుముట్టడంతో అనుచరులతో కలిసి అండర్ గ్రౌండ్ లోకి వెళ్లారు. అయితే ఆది నుంచి వల్లభనేని వంశీ విషయంలో ఒక దూకుడు కనిపించింది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఆయన టిడిపి ఎమ్మెల్యే. పార్టీ ఫిరాయించారు సరే. కానీ అదే పనిగా చంద్రబాబుతో పాటు లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దానికి ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటున్నారు. వాస్తవానికి వల్లభనేని వంశీ మోహన్ పై కొత్తగా కేసులు నమోదు చేయలేదు కూటమి ప్రభుత్వం. తనకు తానుగా చేసిన తప్పిదాలకు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు వంశీ. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి శ్రేణులపై ఆయన దాడి చేయించారు. దీంతో ఆయనతో పాటు అనుచరులపై కేసు నమోదు అయింది. ఎక్కడ అరెస్టు చేస్తారేమోనని ఆయన పరారీ అయ్యారు. కోర్టుల నుంచి తన అరెస్టు విషయంలో సానుకూలత వచ్చేవరకు ఆయన పరారీ లోనే ఉంటారువల్లభనేని వంశీ మోహన్ జగన్మోహన్ రెడ్డికి రాజకీయంగా అండగా నిలిచారు. టిడిపిలో గెలిచి వైసీపీలో ఫిరాయించారు. అయితే నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చంద్రబాబుతో పాటు లోకేష్ ను డామేజ్ చేయాలని చూశారు. కానీ అది వర్కౌట్ కాలేదు సరి కదా ఇప్పుడు ఇబ్బందుల్లో పడ్డారు వంశీ మోహన్. ఇప్పటికే జైలుకు వెళ్లి అనారోగ్యానికి గురయ్యారు. రాజకీయంగా కూడా అంత యాక్టివ్ కాలేకపోతున్నారు. మరోసారి అజ్ఞాతంలోకి అంటే ఎప్పటికైనా మళ్లీ అరెస్టు జరిగే అవకాశం ఉంది. అందుకే జగన్మోహన్ రెడ్డి గన్నవరం విషయంలో ఒక నిర్ణయానికి



రాబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. వంశీని సైడ్ చేసి కొత్త నేతను తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.వల్లభనేని వంశీ విషయంలో జరిగిన వ్యవహారం పై ఎవరూ నోరు మెదపడం లేదు. పైగా సానుభూతి చూపించడం లేదు. నిజంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డిని అభిమానించి.. సంప్రదాయ రాజకీయానికి అలవాటు పడిన ఏ ఒక్క నేత అప్పట్లో వల్లభనేని వంశీ వాడిన భాష, వ్యాఖ్యలను ఇష్టపడలేదు. వైయస్సార్ పార్టీ ఓటమికి ఇటువంటి నేతలే కారణం అన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే ఇప్పుడు వల్లభనేని వంశీ మోహన్ కోసం వెయిట్ చేసే ఉద్దేశం జగన్మోహన్ రెడ్డికి లేదు. అందుకే ప్రత్యామ్నాయ నేతను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.గన్నవరంలో ప్రత్యామ్నాయ నాయకులు చాలామంది ఉన్నారు. వారందరూ యాక్టివ్ అవుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళా నేత ఒకరు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటికే బలమైన నాయకత్వం ఉండగా గన్నవరం టిక్కెట్ ఇచ్చారు చంద్రబాబు 2014లో వల్లభనేని వంశీ మోహన్ కు. 2019లో సైతం రెండోసారి టిక్కెట్ ఇచ్చారు. రెండుసార్లు టికెట్ ఇచ్చి గెలిపించుకున్న చంద్రబాబుపై అనుచితంగా మాట్లాడారు వల్లభనేని వంశీ మోహన్. కానీ ఇప్పుడు ఎవరికోసమైతే ఇదంతా చేశారో అదే జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు గన్నవరం నియోజకవర్గం గురించి సీరియస్గా ఆలోచిస్తున్నారు. తప్పకుండా గన్నవరం నియోజకవర్గానికి కొత్త ఇన్చార్జ్ రావడం ఖాయం అని ప్రచారం నడుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# కాపు దళిత నినాదంతో కొత్త పార్టీ

**విజయవాడ, డిసెంబర్ 31, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై మరో కొత్త అధ్యాయం మొదలుకానుందా? గడిచిన ఎన్నికల్లో కూటమి ప్రభంజనం ముందు డీలాపడ్డ ప్రతిపక్షం.. ఇప్పుడు సరికొత్త వ్యూహానికి తెరలేపుతోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం జోరుగా సాగుతున్న ప్రచారం ప్రకారం.. ఏపీలో కాపు, దళిత సామాజిక వర్గాల కలయికతో ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ వ్యూహ రచన, దివంగత నేత వంగవీటి మోహన రంగా కుమార్తె వంగవీటి ఆశ భాగస్వామ్యంతో ఈ కొత్త శక్తి తెరపైకి రాబోతోందని విశ్వసనీయ సమాచారం.కొంతకాలం క్రితం సస్పెండెడ్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. "కాపులు, దళితులు ఏకతాటిపైకి వస్తేనే రాజ్యాధికారం సాధ్యం. కాపు సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి పీఠం, దళితులకు ఉపముఖ్యమంత్రి పదవి దక్కాలి" అనేది ఆయన ప్రతిపాదన. ఒక మాజీ అధికారిగా కాకుండా, ఒక పొలిటికల్ స్ట్రాటజిస్ట్ లా ఆయన చేసిన ఈ వ్యాఖ్యల వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందనేది బలంగా వినిపిస్తున్న ఆరోపణ. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక బాధ్యతలు నిర్వర్తించి, ఆ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ముద్ర పడిన సునీల్ కుమార్.. ఇప్పుడు తెరవెనుక ఉంటూ ఈ కొత్త రాజకీయ ప్రయోగానికి రూపకల్పన చేస్తున్నట్లు తెలుస్తోంది.ఈ కొత్త సమీకరణంలో ప్రధాన ఆకర్షణ వంగవీటి ఆశ. దివంగత వంగవీటి మోహన రంగాకు కాపు సామాజిక వర్గంలో ఉన్న ఆరాధన భావం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇటీవల విశాఖలో నిర్వహించిన 'రంగా సేన' ఆత్మీయ సమ్మేళనం ఈ కొత్త పార్టీ ఊహాగానాలకు ఊపిరి పోసింది. ఈ సభలో కాపులతో పాటు దళితులు, బీసీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగా ఆశయ సాధన కోసం కొత్త వేదిక అవసరం అని మెజారిటీ కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేయడం గమనార్హం. వంగవీటి రాధా రాజకీయంగా మౌనంగా ఉంటున్న తరుణంలో, రంగా వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఆయన ఇమేజ్ ద్వారా కాపు యువతను ఆకర్షించడానికి వంగవీటి ఆశను ముందు పెడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడానికి ప్రధాన కారణం కాపు ఓట్ల ఏకీకరణ. పవన్ కళ్యాణ్ చొరవతో కాపు ఓట్లు గంపగుత్తగా కూటమికి పడ్డాయి. ఇది వైసీపీని కోలుకోలేని దెబ్బ తీసింది. వచ్చే ఎన్నికల నాటికి ఈ ఓటు బ్యాంకును చీల్చకపోతే వైసీపీకి భవిష్యత్తు కష్టమే. అందుకే, నేరుగా వైసీపీలో చేరలేని కాపు, దళిత వర్గాలను ఆకర్షించడానికి ఒక మూడో ప్రత్యామ్నాయం లేదా కొత్త పార్టీ అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే.. రంగా సెంటిమెంట్ ను వాడుకుని కాపు ఓట్లను చీల్చడం, దానికి దళిత ఓట్లను జత చేయడం ద్వారా కూటమి ఓటు బ్యాంకుకు గండి కొట్టాలనేది మాస్టర్ ప్లాన్ గా కనిపిస్తోంది. పీవీ సునీల్ కుమార్, వంగవీటి ఆశలతో పాటు మరికొందరు వైసీపీ సానుభూతిపరులు, మేధావులు ఈ పార్టీలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.అయితే, కేవలం సామాజిక సమీకరణాలతో పార్టీని నడపడం అంత సులభం కాదు. వంగవీటి

ఆశకు క్షేత్రస్థాయిలో రాజకీయ అనుభవం తక్కువ. పవన్ కళ్యాణ్ లాంటి ఛరిష్మా ఉన్న నేత ముందు ఆమె ఎంతవరకు నిలబడగలరనేది ప్రశ్న. గతంలో కాపు, దళిత సామాజిక వర్గాలను ఏకం చేయడానికి జరిగిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. బీఎస్పీ-జనసేన పొత్తు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఈ రెండు వర్గాల మధ్య క్షేత్రస్థాయిలో ఉన్న అంతరాలను చెరిపివేయడం కత్తి మీద సాము లాంటిది. అన్నిటికీ మించి ఈ కొత్త పార్టీ వెనుక జగన్ మోహన్ రెడ్డి ఉన్నారనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళితే, అది అంతిమంగా ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది.మొత్తానికి, ఏపీలో మరో కొత్త పార్టీ ఆవిర్భావానికి రంగం సిద్ధమవుతోందన్నది కాదనలేని సత్యం. వచ్చే ఎన్నికల నాటికి పూర్తిస్థాయిలో యాక్టివ్ అయ్యేలా గ్రౌండ్ వర్క్ జరుగుతోంది. ఇది కేవలం ఓట్ల చీలిక కోసమే పుడుతోందా? లేక నిజంగానే బడుగు, బలహీన వర్గాలకు ప్రత్యామ్నాయ వేదిక అవుతుందా? అనేది కాలమే నిర్ణయించాలి.

# తిరుమల తరహాలో చెంచులకు శ్రీశైలంలో ప్రాధాన్యం

**కర్నూలు, డిసెంబర్ 31, పెన్ పవర్:** శ్రీశైలం దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలంలో చెంచులకు ఉచితంగా మల్లికార్జునస్వామి స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. చెంచులకు ఉచిత స్పర్శ దర్శనాన్ని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్ నాయుడు, శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రతి మంగళవారం రోజున 500 మంది చెంచులు శ్రీశైలం మల్లన్న స్పర్శ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి నెలా ఒకరోజు చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు వివరించారుతిరుమల.. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఆధ్యాత్మిక క్షేత్రం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు పవిత్ర పుణ్య క్షేత్రం. జీవితంలో ఒక్కసారైనా తిరుమల కోనేటి రాయుడి దర్శనం చేసుకోవాలని ప్రతి మనసూ తపిస్తూ ఉంటుంది. అలాగే తిరుమల శ్రీవారి వైభవాన్ని, తిరుమల ఆధ్యాత్మిక వాతావరణాన్ని కళ్లారా చూడాలని ప్రతి వ్యక్తి కోరుకుంటాడు. ఈ నేపథ్యంలోనే శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు చేపడుతూ వస్తోంది. దేవుడి దర్శనం మొదలుకొని వసతి వరకూ ప్రతి విషయంలోనూ అత్యంత జాగ్రత్తతో వ్యవహరిస్తూ వస్తోంది. అలాగే స్థానికులకు తిరుమల శ్రీవారిని మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో తిరుపతి వాసులకు.. శ్రీవారి దర్శనం ఉచితంగా కల్పిస్తోంది.ప్రతి నెలలో ఓ రోజు స్థానికులకు శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తోంది. ప్రతి నెలా మెదటి మంగళవారం స్థానికులకు శ్రీవారి దర్శనం అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. అయితే తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే శ్రీశైలం దేవస్థానం కూడా కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలంలో చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పిస్తోంది. ప్రతి నెలలో ఒకరోజుచెంచులకు ఉచితంగా శ్రీశైలం మల్లన్న స్పర్శ దర్శనం కల్పిస్తున్నారు. చెంచులకుఉచిత స్పర్శ దర్శనాన్ని శ్రీశైలం దేవస్థానం బోర్డు ఛైర్మన్ రమేష్నాయుడు, ఈవో శ్రీనివాసరావు ప్రారంభించారు. మంగళవారం రోజున సుమారుగా 500 మంది చెంచు గిరిజనులు శ్రీశైలంలో స్పర్శ దర్శనం చేసుకున్నారు.శ్రీశైలం దేవస్థానం పాలకమండలి నిర్ణయం మేరకు ప్రతి నెలా ఒకరోజు చెంచులకు ఉచితంగా స్పర్శ దర్శనం కల్పిస్తామని ఆలయ అధికారులు చెప్తున్నారు. స్వామిని గిరిజనులకు మరింత చేరువ చేయాలనే మంచి ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రతి నెలలో ఓ రోజు చెంచులలో కొంతమందిని ఎంపిక చేసి.. వారికి స్పర్శ దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ఐటీడీఏ సహకారం తీసుకుంటామని.. ఐటీడీఏ సహకారంతో ఉచిత స్పర్శ దర్శనానికి చెంచు గిరిజనులను ఎంపిక చేస్తామన్నారు. దర్శనంతో పాటుగా వారి రాకపోకలకు, వసతి ఏర్పాట్లు కూడా చేయనున్నట్లు వివరించారు.

# పెరగనున్న రైళ్ల సంఖ్య..

**విజయవాడ, డిసెంబర్ 31, పెన్ పవర్:** :రైళ్ల రద్దీని తగ్గించేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రానున్న ఐదేళ్లలో దేశంలోని 48 ప్రధాన రైల్వే స్టేషన్ల నుంచి రైళ్ల సంఖ్యను రెట్టింపు చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు కానుంది. ప్రస్తుతం 37 రైళ్లు నడుస్తుండగా, ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. రూ.500 కోట్లతో స్టేషన్ అభివృద్ధి, ప్లాట్‌ఫారాల విస్తరణతో పాటు, కొత్త కోచింగ్ డిపో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి.రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం నుంచి నడిచే రైళ్ల సంఖ్య రెట్టింపు అవుతుందని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. ఇదిలా ఉంటే ఇప్పటికే రూ. 500 కోట్లతో విశాఖ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్యను 8 నుంచి 14కు పెంచుతామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నం డివిజన్‌లో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయని రైల్వే వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం విశాఖపట్నం రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 37 రైళ్లు నడుస్తున్నాయి. కేంద్రం నిర్ణయం ప్రకారం, రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 74కు చేరుకుంటుంది. అంటే, విశాఖ నుంచి డిమాండ్ అధికంగా ఉండే సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నై, తిరుపతి, ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్, కోల్‌కతా, రాయ్‌పూర్ వంటి నగరాలతో పాటు, అరకులోయ వంటి పర్యాటక ప్రాంతాలకు కొత్త రైళ్లు అందుబాటులోకి వస్తాయి. వీటితో పాటు విశాఖ నుంచే కాశీ వంటి పుణ్యక్షేత్రాలకు కూడా రైళ్లు నడిచే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే తిరుపతి, బెంగళూరులకు వందేభారత్ రైళ్లు నడపాలనే ప్రతిపాదనలు కూడా కార్యరూపం దాల్చుతాయి.విశాఖపట్నం రైల్వే స్టేషన్ రద్దీగా మారింది. ఇక్కడ లైన్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో, కొన్ని రైళ్లు దువ్వాడ దాటిన తర్వాత స్టేషన్ బయటే ఆగిపోతున్నాయి. మరికొన్ని రైళ్లను ఒకటి, 2 రోజుల తర్వాత షెడ్యూల్ చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో వాటిని నిలిపి ఉంచడానికి సరైన చోటు లేక, నగర శివారు మార్గాల్లో ఖాళీగా ఉన్న లైన్లలో వాటిని నిలిపి ఉంచుతున్నారు. దీనివల్ల రైళ్ల నిర్వహణ కష్టమవుతోంది.అయితే ఈ సమస్యలకు పరిష్కారంగా.. జగన్నాథపురాన్ని శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. అక్కడ పెద్ద కోచింగ్ మెయింటెనెన్స్ డిపోతో పాటు, భారీ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఆలోచనలో ఉన్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ. 2,800 కోట్లతో ప్రతిపాదనలు రైల్వే బోర్డుకు పంపించారు.ఇదిలా ఉంటే.. విశాఖపట్నంలో రైల్వే యార్డును ఆధునీకరించడానికి డీపీఆర్ సిద్ధమైంది. ఇందులో 5 కొత్త లైన్లు, 10 స్టేబిలింగ్ లైన్లు, అదనపు ప్యాసింజర్ ప్లాట్‌ఫారాలు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని బోర్డుకు ప్రతిపాదించారు. వీటితో పాటుగా ఫ్లైఓర్లు, బైపాస్‌లు, ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌లను కూడా నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రైల్వే వర్గాలు తెలిపాయి. ఇవన్నీ పూర్తయితే ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలోఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# తిరుపతిలో స్పోర్ట్స్ సిటీకి భూమి

**తిరుపతి, డిసెంబర్ 31, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా దామినేడులో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి భూములు కేటాయించింది. దామినేడులో నేషనల్ స్టాండర్డ్ స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు కోసం గతంలో 28.37 ఎకరాల భూమిని ఏపీ టూరిజం అథారిటీకి కేటాయించారు. అయితే ఆ ప్రాజెక్టు దిశగా అడుగులు పడకపోవటంతో.. తాజాగా జరిగిన ఏపీ మంత్రిమండలి సమావేశంలో ఈ భూమిని స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం శాప్‌కు ఇవ్వాలని నిర్ణయించారు ఈ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం లభించటంతో దామినేడులో 28.37 ఎకరాల భూమిని ఉచితంగా శాప్‌కు బదిలీ చేయనున్నారు.మరోవైపు రాజధాని అమరావతిలో ఏపీ ప్రభుత్వం అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్న సంగతి తెలిసిందే. దీనితో పాటుగా ప్రతి నియోజకవర్గంలోనూ క్రికెట్ గ్రౌండ్లు ఉండేలా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా క్రికెట్ మైదానాలు, స్పోర్ట్స్ సిటీల నిర్మాణం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలోనే శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మించాలని నిర్ణయించారు. ఈ స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం తిరుపతి రూరల్ మండలం దామినేడు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ ఉన్న 28.37 ఎకరాలను టూరిజం అథారిటీ నుంచి శాప్‌కు ఉచితంగా బదిలీ చేస్తూ ఇటీవలే రెవెన్యూశాఖ నిర్ణయం తీసుకుంది.ఈ ప్రతిపాదనలకు తాజాగా జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో ఆమోదం లభించింది. మరోవైపు దామినేడులో ఎకరా భూమి విలువ సుమారుగా రెండున్నర కోట్ల వరకూ ఉన్నట్లు సమాచారం. దీంతో 28 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయిస్తూ ఉండటంతో.. అధికారులు పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేటాయించిన భూమిని అవసరాలకు మాత్రమే వినియోగించాలని.. రెవెన్యూ శాఖ అనుమతి లేకుండా ఈ భూమిలో ఎలాంటి కేటాయింపులు, బదిలీలు చేయొద్దని సూచించినట్లు సమాచారంమరోవైపు దామినేడు వద్ద ఉన్న భూమిని శాప్‌కు కేటాయించాలంటూ శాప్ ఛైర్మన్ రవి నాయుడు గతంలో సీఎం చంద్రబాబును కలిసి కోరారు. తిరుపతిలో క్రీడల్ని ప్రోత్సహించేందుకు, స్పోర్ట్స్ సిటీ నిర్మాణం కోసం భూమిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తికి సీఎం చంద్రబాబు అప్పట్లో సానుకూలంగా స్పందించారు. తాజాగా భూమిని కూడా కేటాయించడంతో తిరుపతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణం వేగం పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు తిరుపతిలోని గొల్లవానిగుంటలో కూడా ఓ క్రికెట్ స్టేడియం సిద్ధమైంది.రూ.3 కోట్లు ఖర్చు చేసి గొల్లవానిగుంటలో క్రికెట్ స్టేడియం నిర్మాణం చేపట్టారు. ఈ పనులు చివరి దశకు చేరుకోగా.. సంక్రాంతి నాటికి పూర్తి చేసి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ స్టేడియంలో.. 75 చదరపు గజాల విస్తీర్ణంలో 5 వికెట్ టర్ఫ్‌లు ఏర్పాటు చేశారు. నాలుగు నెట్‌లు, గ్యాలరీలు, వీఐపీలకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# నేతన్న నెత్తిపై జీఎస్టీ బండ

**హైదరాబాద్ పెన్ పవర్:**మోదీ ప్రభుత్వ విధానాలు బడా కార్పోరేట్ సంస్థలకు మేలు చేసేలా ఉంటున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. టెక్స్టైల్ రంగమే ఇందుకు ఉదాహరణ. వస్త్రోత్పత్తిలో చిన్న పరిశ్రమలకూ అదే 5శాతం జీఎస్టీ వసూలు చేయడం వల్ల బడా కార్పోరేట్ కంపెనీలతో పోటీ పడలేక పోతున్నారు నేతన్నలు. దేశంలోని పారిశ్రామిక ఉత్పత్తిలో టెక్స్టైల్ రంగం13 శాతం వాటా కలిగి ఉంది. ఇందులో 45 మిలీయన్లకు పైగా గ్రామీణ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. సగానికి పైగా ఎంఎస్ఎంఈలపై అధార పడి పొట్టబోసుకుంటున్న వారే ఉన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో బడా కార్పోరేట్ సంస్థలూ మన దేశంలో వస్త్రోత్పత్తులు కొనసాగిస్తున్నాయి. వాటితో పేద, మధ్య తరహా చేనేత, పవర్ లూమ్ పరిశ్రమలు పోటీ పడలేక చితికిల పడుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా టెక్స్టైల్ ద్వారా జీఎస్టీ రూపేణా 22 లక్షల కోట్లు వసూలు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. కేంద్రానికి వచ్చిన ఆదాయంలో చిన్న, మధ్యతరహా వస్త్ర పరిశ్రమలకు అందిస్తోన్న ప్రోత్సాహకాలు ఎక్కడా కనబడడం లేదు. ఒకవైపు 5శాతం జీఎస్టీ వసూలు చేయడం.. మరోవైపు కార్పోరేట్ సంస్థ ఉత్పత్తులతో పోటీ పడలేక నేతన్నలు చితికి పోతున్నారు. చేనేత సహకార సంఘాలు, కార్మికులకు ఇన్సెంటీవ్స్, మార్కెట్ పోటీని తట్టుకునేలా శిక్షణ, ఎగ్జిబిషన్స్ లాంటివి ఏర్పాటు చేయడం లేదు. దీనివల్ల చారిత్రాత్మక చేనేత కుటీర పరిశ్రమ కుదేలౌతోంది. పత్తి ఉత్పత్తిలో దేశంలోనే మూడో స్థానంలో ఉంది తెలంగాణ. గుజరాత్, మహారాష్ట్ర తరువాత తెలంగాణాలోనే పత్తి ఎక్కువ ఉత్పత్తి అవుతోంది. అయినప్పటికీ ఇక్కడ ఆ స్థాయిలో స్పిన్నింగ్ మిల్లులు లేవు. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న పత్తిలో కేవడం 20 శాతం మాత్రమే స్థానిక జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులకు వెళ్తోంది. సిరిసిల్ల, అంతర్గాం, సిర్పూర్ కాగజ్నగర్..లాంటి ప్రాంతాల్లో ఎంతో నాణ్యమైన నూలు అందించిన స్పిన్నింగ్ మిల్లులు మూత పడడం పరిశ్రమ తిరోగమనానికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ప్రస్తుతం ఇక్కడి పత్తి ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తోంది. డిమాండ్ లేక పత్తి ధర పడిపోవడంతో ఇటు రైతులు నష్టపోతుండగా.. సంబంధిత పరిశ్రమలు ఏర్పడక తెలంగాణ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగాలూ కరువయ్యాయి. తెలంగాణలో యేటా సుమారు 65 బిలియన్ మీటర్ల వస్త్రోత్తి జరుగుతోంది. ప్రధానంగా చేనేత, పవర్ లూమ్ పరిశ్రమ ద్వారా వస్త్రాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఎక్కువ శాతం టెస్కో ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలకు సరఫరా అవుతున్నాయి. బహిరంగ మార్కెట్ పోటీని చేనేత వస్త్రాలు తట్టుకోలేక పోతున్నాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్లా హంగులు, ప్రచార ఆర్భాటాలు పబ్లిసిటీ చేయలేక పోతున్నారు నేతన్నలు. దీంతో సిరిసిల్లలో తయారు అవుతున్న చీరల ఉత్పత్తిలో సగం వరకు జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోన్నా..మరో సగం వరకు మాక్ సొసైటీలు భరించాల్సి వస్తోంది. మేక్ ఇన్ ఇండియా నినాదాన్ని పదే పదే చెబుతున్న మన ప్రధాన మంత్రి.. ఆ స్థాయిలో చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని అందించాల్సిన బాధ్యత ఉంది. ఇటు తెలంగాణ ప్రభుత్వం సైతం..వస్త్ర పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా కృషి జరిగితేనే తెలంగాణ రైజింగ్–2047కు సార్థకత ఉంటుంది.

# గాజాపై మళ్లీ దాడులు ఇజ్రాయిల్ దాష్టీకం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తర గాజాలోని బెయిట్ లాహియా పట్టణంపై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు మంగళవారం తాజాగా వైమానిక దాడులు నిర్వహించాయి. అదే సమయంలో మరోపక్క మఘజి శరణార్థ శిబిరం తూర్పు ప్రాంతాన్ని కూడా ఇజ్రాయిల్ విమానాలు లక్ష్యంగా చేసుకున్నాయి. అక్టోబరు 10న కుదిరిన కాల్పుల విరమణను ఉల్లంఘించి గాజా వ్యాప్తంగా ఇజ్రాయిల్ తాజాగా ఈ దాడులు చేపట్టింది. దక్షిణ గాజాలోని రఫా నగర పశ్చిమ భాగంలో అనేక ప్రాంతాల్లో వైమానిక, శతఘ్ని దాడులు జరిపింది. ఇప్పటికే ఇజ్రాయిల్ పలుసార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని గాజా అధికారులు పేర్కొంటున్న తరుణంలో ఈ దాడులు జరిగాయి. ఇప్పటివరకు ఇజ్రాయిల్ బలగాలు 969సార్లు కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడ్డాయని గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం ఆదివారం తెలిపింది. ఈ దాడుల్లో 418మంది మరణించారని, 1100మందికి పైగా గాయపడ్డారని తెలిపింది. ఫ్లోరిడాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్తో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు భేటీ అయిన గంటల వ్యవధిలోనే ఈ దాడులు చోటు చేసుకోవడం గమనార్హం.

## పుతిన్ నివాసంపై డ్రోన్ల దాడి!

**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధికారిక నివాసంపై ఆదివారం రాత్రి ఉక్రెయిన్ డ్రోన్లతో దాడికి యత్నించింది. రష్యన్ విదేశాంగ మంత్రి సెర్గి లావ్రోవ్ మంగళవారం ఈ విషయాన్ని మీడియాకు తెలియజేశారు. మాస్కోకు సమీపంలోని నొవొగార్డ్ ప్రాంతంలోని అధ్యక్షుని నివాసంపైకి ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి డ్రోన్లను ప్రయోగించిందని, అయితే, రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ చర్య ఉగ్ర దాడి కిందికే వస్తుందని ఆయన పేర్కొన్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఉక్రెయిన్ను ఆయన హెచ్చరించారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు ప్రస్తుతం జరుగుతున్న శాంతి చర్చలపై దీని ప్రభావం కచ్చితంగా ఉంటుందన్నారు. ఇలాంటి నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన చర్యకు సమాధానం చెప్పకుండా వదిలివేసే ప్రసక్తే లేదన్నారు. దాడి జరిగిన సమయంలో పుతిన్ ఆ నివాసంలో వున్నారా లేదా అనేది స్పష్టం కాలేదు.

## ఇమ్మిగ్రేషన్ నిఘాతో వలసదారుల వెనుకంజ

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాకు వలసలను పరిమితం చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుండడంతో అనేక మంది వలసదారులు భయాందోళనతో గడపుతున్నారు. ముఖ్యంగా ఇంటిలోనే కాలక్షేపం చేస్తున్నారు. విదేశీ ప్రయాణాలంటే భయపడుతున్నారు. వలసదారులే కాదు.. అమెరికా పౌరులు సైతం దేశం విడిచి వెళ్లడానికి ఇష్టపడడం లేదు. అవసరమైన పత్రాలు చేతిలో ఉన్నప్పటికీ వారు విదేశీ ప్రయాణమంటేనే జంకుతున్నారని కేఎఫ్ఎఫ్–ఎన్వైటీ సర్వే తెలిపింది. వలసదారులలో 27 శాతం మంది.. అంటే ప్రతి పది మందిలో ముగ్గురు ఉద్దేశపూర్వకంగానే దేశంలోనూ, విదేశాలకు ప్రయాణాలను మానుకుంటున్నారు. ఇమ్మిగ్రేషన్ అధికారుల నిఘానేత్రానికి ఎక్కడ చిక్కుతామోనని వారు భయపడుతున్నారు. హెచ్–1బి వీసాలు ఉన్న వారిలో 32 శాతం మంది, పౌరుల్లో 15 శాతం మంది ప్రయాణాలను రద్దు చేసుకుంటున్నారని సర్వే చెబుతోంది. సరైన పత్రాలు లేని వలసదారులలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. వీరిలో మూడింట రెండు వంతులు లేదా 63 శాతం మంది దేశీయ, అంతర్జాతీయ ప్రయాణాలు మానుకుంటున్నారు. అమెరికాలో వార్షిక సెలవుల సీజన్లో ఇప్పటికే సగం పూర్తయింది. ఈ సీజన్లో సాధారణంగా అమెరికాలో ప్రయాణాలు అధికంగా జరుగుతుంటాయి. లక్షలాది అమెరికన్లు రోడ్డు, గగనతల మార్గాలలో ప్రయాణిస్తుంటారు. ఇలాంటి సీజన్లో సైతం ప్రయాణాలు పెద్దగా జరగకపోవడం గమనార్హం. ఇమ్మిగ్రేషన్ అధికారుల దృష్టిలో పడడం ఎందుకనే భావనలో వలసదారులు ప్రయాణాలకు సిద్ధపడడం లేదని సర్వే తెలిపింది. అదీకాక దేశీయ విమానాలపై అధికారులు దృష్టి సారించడం ఇదే మొదటిసారి. సాధారణంగా డిసెంబర్ వరకూ వారు వాటి జోలికి పోరు. అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారుల అరెస్ట్, నిర్బంధం, అప్పగింతకు వీలుగా ప్రభుత్వ సంస్థలన్నీ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ట్రంప్ ప్రభుత్వం వీలు కల్పించింది. భారత్ వంటి దేశాలకు వెళ్లి తిరిగి అమెరికా చేరుకోవాలనుకునే హెచ్–1బి వీసాదారులపై అధికారులు తనిఖీలు పెంచారు. వారి వీసా అపాయింట్మెంట్లు కూడా ఆలస్యమవుతున్నాయి. వలసదారులు ప్రయాణాలు మానుకోవడానికి ఇది కూడా కారణమేనని సర్వే చెబుతోంది.

# మహాత్ముని ఆంతరంగికుడు మహదేవ్ దేశాయ్

**హైదరాబాద్ పెన్ పవర్:**మహదేవ్ దేశాయ్ పేరు చాలా మందికి తెలియకపోవచ్చు. ఈ తరం వారికి ఈ పేరు అపరిచితమై ఉండవచ్చు. జాతిపిత మహాత్మాగాంధీ సేవకోసం సర్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి. అంతకన్నా ఆంతరంగికుడు. ఆయన లేకుండా మహాత్ముని జీవితం గురించి సంపూర్ణంగా తెలిసేది కాదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన ఆయన మహాత్మా గాంధీ యొక్క వ్యక్తిగత కార్యదర్శి. గాంధీకి సంబంధించిన ప్రతి విషయం ఆయనే స్వయంగా దేశాయే చూసేవారు. మహదేవ్ దేశాయ్ (1 జనవరి 1892– 15 ఆగస్టు 1942) భారత స్వాతంత్ర్య సమర యోధులు, రచయిత. మహదేవ్ దేశాయ్ 1892 జనవరి 1 న గుజరాత్ లోని సూరత్ జిల్లాలో సారస్ అనే గ్రామంలో ఉపాధ్యాయుడైన హరిభాయి, జన్మాబెన్ దంపతులకు జన్మించారు.13 సంవత్సరాల వయసులో మహాదేవ్ దుర్గాబెన్ ను వివాహ మాడారు. ఆయన సూరత్ ఉన్నత పాఠశాల, ముంబయిలోని ఎల్ఫిన్‌స్టోన్ కాలేజిలో చదివారు. ఆయన బి.ఎ పట్టభద్రుడు. మహదేవ్ దేశాయ్ మొదటిసారి 1915 లో గాంధీని కలిసారు. దేశాయ్ 1917లో సబర్మతీ ఆశ్రమంలో ఆయన భార్య దుర్గాబెన్‌తో పాటు చేరారు. ఆ సంవత్సరం చంపారన్ ఉద్యమం జరిగింది. ఆయన డిసెంబర్ 13,1917 నుండి ఆగస్టు 14,1942 వరకు ఆయన మరణించే తేదీ ముందురోజు వరకు ఒక డైరీని నిర్వహించారు. దానిలో ఆయనకు మహాత్మాగాంధీ సాన్నిహిత్యం గురించి వ్రాసారు. బ్రిటిష్ ప్రభుత్వం గాంధీజీని 1919లో అరెస్టు చేసినపుడు గాంధీజీ తన వారసునిగా దేశాయ్ ను ప్రకటించారు. దేశాయ్ మొదటిసారి 1921 లో అరెస్టు కాబడి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష అనుభవించారు. ఆయన 25 సంవత్సరాలపాటు గాంధీజీకి వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్నారు. ఆయన నిజానికి గాంధీకి హోం, విదేశాంగ కార్యదర్శి. ఆయన ప్రతీ విషయాన్ని నిర్వహించేవారు. అన్ని యేర్పాట్లు చేసేవారు. ఆయన కార్యాలయాన్ని ఒక అతిథి గృహంగా, వంటగదిగా నిర్వహించే వారు. ఆయన అనేక మంది అతిథులను చూసేవారు. గాంధీజీ కంటే ముందే వేకువ జామున లేచేవారు. రెండవది గాంధీతో నిరంతరం గడపేవారు. ఆరోజు జరిగిన విషయలను డైరీలో నమోదు చేసేవారు. 1920 లో మోతీలాల్ నెహ్రూ తన వార్తాపత్రిక అయిన ఇండిపెండెంట్ ను అలహాబాద్ నుండి నడపడానికి గాంధీ నుండి మహాదేవ్ దేశాయ్ సేవలను కోరారు. ఇండిపెండెంట్ ప్రింటింగ్ ప్రెస్‌ను బ్రిటిష్ ప్రభుత్వం జప్తు చేసిన తరువాత చేతితో వ్రాసిన సైక్లోస్టైల్ వార్తాపత్రికను బయటకు తీసుకురావడం ద్వారా దేశాయ్ ఒక సంచలనాన్ని సృష్టించారు దేశాయ్. 1921 లో దేశాయ్‌ను తన రచనలకు ఒక సంవత్సరం కఠినమైన జైలు శిక్ష విధించారు. దేశాయ్ 1924 లో నవజీవన్ సంపాదకుడిగా బాధ్యతలు స్వీకరించారు. 1925 నుండి గాంధీ ఆత్మకథ, యంగ్ ఇండియాలో దాని సీరియల్ ప్రచురణ కోసం ఆంగ్లంలోకి అనువాదం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం ఆయన సత్యాగ్రహ ఆశ్రమ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ అయ్యారు. నవజీవన్ లో ప్రచురించిన తన వ్యాసానికి గుజరాతీ సాహిత్య పరిషత్ నుండి బహుమతిని వచ్చింది. ఆయన సర్దార్ పటేల్‌తో కలిసి బార్డోలి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గుజరాతీలోని సత్యాగ్రహ చరిత్రను వ్రాసారు. దీనిని అతను ఆంగ్లంలోకి ది స్టోరీ ఆఫ్ బార్డోలిగా అనువదించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆయన్ను అరెస్టు చేసి జైలులో పెట్టారు. కాని గాంధీ–ఇర్విన్ ఒప్పందాన్ని అనుసరించి, జైలు నుండి విడుదలయ్యారు. గాంధీతో పాటు మిరాబెన్, దేవదాస్ గాంధీ, ప్యారేలాల్ లతో కలిసి రెండవ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరయ్యాడు. కింగ్ జార్జ్ %ు% ను కలిసేందుకు వెళ్ళిన గాంధీతో పాటు వెళ్ళిన ఏకైక వ్యక్తి ఆయన. 1932 లో దేశాయ్‌ను మళ్లీ అరెస్టు చేసి గాంధీ, సర్దార్ పటేల్‌తో కలిసి జైలుకు పంపారు. 1933 లో విడుదలైన తరువాత, ఆయన్ను తిరిగి అరెస్టు చేసి బెల్గాం జైలులో అదుపులోకి తీసుకున్నారు. జైలులో ఉన్న ఈ సమయంలోనే ఆయన "గీత ప్రకారం గాంధీ" పుస్తకాన్ని రాశారు. ఇది ఆయన మరణానంతరం 1946 లో ప్రచురించ బడింది. దేశాయ్ 1939 లో రాక్‌కోట్, మైసూర్ రాచరిక రాష్ట్రాలలో ప్రజల ఉద్యమాలను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. 1940 వ్యక్తిగత సత్యాగ్రహ సమయంలో సత్యాగ్రహాలను ఎన్నుకునే బాధ్యతను తీసుకున్నారు. దేశాయ్ యొక్క చివరి జైలు శిక్ష 1942 ఆగస్టు 8 నాటి క్విట్ ఇండియా ప్రకటన తరువాత జరిగింది. ఆయన 1942 ఆగస్టు 9 ఉదయం అరెస్టు చేయబడ్డారు. ఆరు రోజుల తరువాత భారీ గుండె పోటుతో మరణించే వరకు గాంధీతో పాటు అగా ఖాన్ ప్యాలెస్‌లో ఉన్నారు. ఆగస్టు 15 1942 న ఉదయం మరణించేటప్పుడు దేశాయ్‌కు 51 సంవత్సరాలు. గాంధీజీ స్వయంగా దేశాయ్ భౌతిక కాయానికి స్నానం చేయించారు. ఆ పాలెస్ మైదానంలో ఆయనను దహనం చేసారు. ఆ ప్రదేశంలో ప్రస్తుతం ఆయన సమాధి ఉంది. భారత తపాలా శాఖ దేశాయ్ గౌరవార్థం 1983లో తపాలా బిళ్ళపై ఆయన బొమ్మను ముద్రించింది. మహదేవ్ దేశాయ్ గౌరవార్థం ఆయన పేరుతో మహదేవ్ దేశాయ్ సమాజసేవ మహావిద్యాలయ, గురజాత్ విద్యాపీఠ్ యొక్క సైన్స్, ఆర్ట్స్ విభాగం ఆయన పేరుతో నామకరణం చేసారు.

# బ్రిటీషు ఇండియాలో భారత ప్రామాణిక కాలమానం అమలు

**హైదరాబాద్ పెన్ పవర్:**1906, జనవరి 1 నుండి భారతదేశంలో ఏకైక ప్రామాణిక సమయం అమలు కావడం ప్రారంభం అయింది. భారత దేశంలో అమలులో ఉన్న భిన్నాంశ కాలమానాన్ని ఖగోళకారుడు జాన్ గోల్డింగ్‌హామ్ స్థాపించాడని భావిస్తారు. భారత ప్రామాణిక కాలమానం భారతదేశ మంతటా పాటించే సమయం. ఇది గ్రీన్‌విచ్ సమయానికి ఐదున్నర గంటలు ముందు ఉంటుంది. బ్రిటీషు నావికుడు–ఖగోళకారుడు మైఖెల్ టాపింగ్ కృషి ఫలితంగా 1792లో, బ్రిటీషు ఈస్టిండియా కంపెనీ అప్పటి మద్రాసులో మద్రాసు అబ్జర్వేటరీని ప్రారంభిం చింది. 1802లో భారత దేశంలో ఈస్టిండియా కంపెనీ అధికారిక ఖగోళ కారునిగా నియమితుడైన జాన్ గోల్డింగ్‌హామ్, గ్రీన్‌విచ్ ప్రామాణిక సమయానికి ఐదున్నర గంటలు ముందున్న మద్రాసు రేఖాంశంను స్థానిక ప్రామాణిక సమయంగా స్థిర పరిచాడు. దీనితో ప్రస్తుతము ఉపయోగిస్తున్న ప్రమాణిక సమయానికి అది ప్రాతిపదిక అయింది. అప్పటి వరకు ప్రామాణికంగా ఉపయోగిస్తున్న సమయంలో రోజు సూర్యోదయంతో ప్రారంభ మయ్యేది. అయితే కొత్త పద్ధతిలో రోజు అర్ధరాత్రి ప్రారంభ మవుతుంది. బొంబాయి నౌకాశ్రయములో నౌకా కార్యకలపాలకు సమయ పాలనా మద్దతును 1862లో స్థాపించబడిన కొలాబా అబ్జర్వేటరీ అందించేది. చరిత్రలో మొట్టమొదటగా ప్రామాణిక సమయం వివరణ భారతదేశంలో 4వ శతాబ్దపు భారతీయ ఖగోళశాస్త్ర ఆధారిత సూర్య సిద్ధాంతంలో ఇవ్వబడింది. దీనిలో భూమి గుండ్రంగా ఉందని ప్రతిపాదిస్తూ, ప్రైమ్ మెరీడియన్ లేదా "జీరో డిగ్రీల రేఖాంశం" అవంతీ నగరం ( ఉజ్జయినికి (23°10'58?N 75°46'38E / ?23.18278°N 75.77722°), పూర్వపు పేరు) , రోహితక ( కురుక్షేత్ర యుద్ధభూమి దగ్గరలోని నగరం రోహ్‌తక్) (28ీ54ః చీ 76ీ38ఃఙ/ ?28.900ీచీ 76.633ీఙ) గుండా వెళుతుందని నిర్వచించ బడింది. రోహితక, అవంతి నగరాలు (భూమధ్యరేఖ, 76ీ తూ) , దేవతల ఆవాసమైన కైలాస పర్వతం (ఉత్తర ధృవం) గుండా వెళుతున్న సరళ రేఖపై ఉన్నాయి.సాధారణ ఉపయోగములో ఉన్న సమయమే గణించగల సమయము. ప్రాణంతో (ఒక శ్వాసకు పట్టే సమయం) ప్రారంభమై, ఆరు ప్రాణాలు ఒక విఘటిక లేదా పలం, 60 విఘటికలు ఒక ఘటిక, 60 ఘటికలు ఒక నక్షత్ర అహోరాత్రి, లేదా ఒక ఖగోళ దినంగా గణిస్తారు. ఒక నక్షత్ర మాసం లేదా ఖగోళ మాసంలో 30 అహోరాత్రులు లేదా రోజులు ఉంటాయి. ఒక రోజుకు 24 గంటలుగా పరిగణిస్తే, ఈ కాలమానంలోని అత్యంత చిన్న కొలత, ప్రాణం, లేదా ఒక ఉచ్ఛ్వాసనిశ్వాసం నాలుగు సెకన్లకు సమాన మవుతుంది. ఇది ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు సాధారణ ఉచ్ఛ్వాసనిశ్వాస పౌనపున్యంగా భావించే నిమిషానికి 15 శ్వాసలకు సరిపోతుంది. సూర్య సిద్ధాంతం, స్థానిక సమయము నుండి ఉజ్జయినీ ప్రామాణిక సమయాన్ని గణించే పద్ధతిని కూడా వివరించింది. భారతీయ కాలమానం చాలా ముందే ఈ ప్రగతిని సాధించినప్పటికీ, ప్రామాణిక సమయం, ఖగోళ శాస్త్రంలో తప్ప వేరెక్కడా విరివిగా ఉపయోగించ బడలేదు.భారతదేశాన్ని పరిపాలించిన రాజులు, తమ సామ్రాజ్యాలలో, చాలా వరకు భారతీయ పంచాంగం సహాయముతో గణించిన స్థానిక సమయాన్నే పాటించారు.పూర్వపు భారతీయ ఖగోళ శాస్త్రజ్ఞులు ఉపయోగించే రోజు ఉజ్జయిని లోని ప్రైమ్ మెరీడియన్ వద్ద సూర్యుడు ఉదయించ డముతో ప్రారంభ మవుతుంది. అలా ప్రారంభ మయిన రోజు చిన్న చిన్న సమయ ఖండాలుగా విభజించ బడినది. 1884లో, వాషింగ్టన్, డి.సిలో జరిగిన అంతర్జాతీయ మెరిడియన్ సమావేశం ప్రపంచమంతటా ప్రామాణిక కాలమండలాలను వ్యవస్థీకరించింది. ఆ సమావేశంలో భారతదేశంలో రెండు కాల మండలాలు ఉండాలని నిర్ణయిం చింది. కలకత్తా తూర్పు 90 డిగ్రీల రేఖాంశంను, బొంబాయి తూర్పు 75డిగ్రీల రేఖాంశం ఉపయోగించేది. కలకత్తా సమయం గ్రీన్విచ్ కంటే 5 గంటల 30 నిమిషాల 21 సెకన్లు, బొంబాయి సమయం గ్రీన్విచ్ కంటే 4 గంటల 51 నిమిషాలు ముందు ఉండేట్టు నిర్ణయమైంది. 1880ల చివరికల్లా, చాలామటుకు రైల్వే కంపెనీలు రెండు కాలమండలాలకు మధ్యేమార్గంగా రైల్వే సమయంగా పేరొందిన ూ మద్రాసు సమయంను ఉపయోగించడం ప్రారంభించాయి. అండమాన్ నికోబార్ దీవులు రాజధాని అయిన పోర్ట్ బ్లెయిర్ లో పోర్ట్ బ్లెయిర్ మీన్ టైం అనే మరొక ప్రత్యేక కాలమండలం స్థాపించ బడింది. పోర్ట్ బ్లెయిర్ సమయం, మద్రాసు సమయం కంటే 49 నిమిషాల 51 సెకన్లు ముందు ఉండేది. భారత ప్రామాణిక కాలమానాన్ని 82.5ీతూర్పు రేఖాంశం ఆధారంగా లెక్కకడతారు. ఈ రేఖాంశం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అలహాబాదు నగరం దగ్గరున్న మిర్జాపూర్ పట్టాణానికి కొంచెం పశ్చిమంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కాకినాడ నగరం మీదుగా వెళుతుంది. మిర్జాపూరు, యునై టెడ్ కింగ్డం యొక్క గ్రీన్‌విచ్ లోని రాయల్ అబ్జర్వేటరీల మధ్య రేఖాంశ అంతరం కచ్చితంగా 5 గంటల 30 నిమిషాలు. అధికారిక సమయపాలనా యంత్రాగం ఢిల్లీ లోని భారత జాతీయ భౌతిక ప్రయోగశాలకు సమయ పాలన బాధ్యతను అప్పగించినా, స్థానిక సమయాన్ని అలహాబాద్ అబ్జర్వేటరీ (25.15° %N 82.5° E%) వద్ద ఉన్న గడియార స్తంభం నుండి లెక్కకడతారు. భారతదేశంలో అనేక పట్టణాలు 1850లలో రైల్వేలు వచ్చిన తర్వాత కొద్ది సంవత్సరాలకు కూడా తమ సొంత స్థానిక సమయాన్నే ఉపయోగించేవి. రైల్వేల రాకతో ఒక సమైక్య ప్రామాణిక సమయం యొక్క ఆవశ్యకత ఏర్పడింది. అప్పటి బ్రిటీషు ఇండియాలోని రెండు ముఖ్యపట్టణాలైన బొంబాయి , కలకత్తాల స్థానిక సమయాలు ప్రాధాన్యత సంతరించు కున్నాయి. క్రమేణ వాటి చుట్టుపక్కల ప్రాంతాలు , సంస్థానాలు ఈ ప్రామాణిక సమయాన్ని అవలం బించాయి. 19వ శతాబ్దంలో గడియారాలను టెలిగ్రాఫు ద్వారా ఒకే సమయము ఉండేట్టు చేసేవారు (సింక్రొనైజ్) ఉదాహ రణకు రైల్వేలు తమ గడియా రాలని ప్రతిరోజూ ఒక నిర్ణీత సమయంలో ముఖ్య కార్యాలయం లేదా ప్రాంతీయ కార్యాలయం నుండి పంపే సమయ సంకేతం ద్వారా సింక్రొనైజ్ చేసేవారు. అయితే బ్రిటీషు ఇండియా 1905 వరకు అధికారికంగా ప్రామాణిక కాలమండలాలను నిర్ణయించ లేదు. 1905లో ఏకైక ప్రామాణిక సమయాన్ని స్థాపిస్తూ అలహా బాదుకు తూర్పుగా వెళ్ళే 82.5 డిగ్రీల తూర్పు రేఖాంశాన్ని భారత దేశ కేంద్ర మెరిడియన్ గా ఎంచు కున్నది. ఇది 1906, జనవరి 1 నుండి భారత దేశంతో పాటు శ్రీలంకలో కూడా అమలులోకి వచ్చింది. కానీ, కలకత్తా సమయంను మాత్రం 1948 వరకు అధికారికముగా, ప్రత్యేక కాలమండలంగానే నిర్వహించారు. 1925లో, టైం సింక్రొనైజేషన్ సంకేతాన్ని ఆమ్నిబస్ టెలిఫోన్ వ్యవస్థ ద్వారా, నియంత్రిత సర్క్యూట్ల ద్వారా కచ్చితమైన సమయం కావలసిన సంస్థలకు ప్రసారం చేసేవారు. ఈ పద్ధతి 1940ల వరకు కొనసాగింది. తర్వాత ప్రభుత్వ సమయ సంకేతా లను రేడియో ద్వారా ప్రసారం చెయ్యటం ప్రారంభించింది.1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, భారత ప్రభుత్వం భారత ప్రామాణిక సమయాన్ని దేశం మొత్తానికి అధికారిక సమయంగా ప్రకటించింది. వాణిజ్య , అధికారిక ఉపయోగాల కోసం అధికారిక సమయ సంకేతాలు కొత్త ఢిల్లీలోని జాతీయ భౌతిక పరిశోధనశాల వద్ద ఉన్న సమయ, పౌన:పున్య ప్రామాణిక పరిశోధనశాల ద్వారా వెలువడ తాయి. ఈ సంకేతాలు విశ్వవ్యాప్త సమన్వయ సమయ మునకు మద్దతునిచ్చే ప్రపంచ వ్యాప్త గడియార వ్యవస్థతో అను సంధానించ బడిన అటామిక్ క్లాక్ ఆధారంగా వెలువడుతాయి. నిర్దిష్టమైన సమయాన్ని దేశ మంతటా ప్రభుత్వాధీనంలో ఉన్న ఆలిండియా రేడియో , దూర దర్శన్ టెలివిజన్ నెట్‌వర్కుల ద్వారా ప్రసారం చేస్తారు. టెలిఫోన్ కంపెనీలు వినియోగదారులకు కచ్చితమైన సమయాన్ని తెలియ జేసేందుకు ప్రత్యేకంగా నియమిం చిన టెలిఫోన్ నంబర్లు టైం సర్వర్ మిర్రర్లకు అనుసంధా నించబడి ఉంటాయి. కచ్చితమైన సమయం తెలుసు కోవటానికి గణనీయంగా పెరుగు తున్న మరో ప్రాచుర్యమైన పద్ధతి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జి.పి.ఎస్) రిసీవర్లు.

# మానవతా సాయంలో అమెరికా కోతలు

**హైదరాబాద్ పెన్ పవర్:** విదేశీ సాయానికి కోత పెడుతున్న అమెరికా.. ఐక్యరాజ్యసమితి సంస్థలకు తాజాగా హెచ్చరికలు జారీ చేసింది. 'స్వీకరించండి%ొ% తగ్గించు కోండి లేదా చావండి' అంటూ ఆయా సంస్థలకు స్పష్టం చేసింది. ఐరాస మానవతా సాయానికి రెండు బిలియన్ డాలర్ల సాయం అందిస్తానని హామీ ఇచ్చింది. గత సంవత్సరాలలో అమెరికా అందించిన సాయంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఈ స్వల్ప మొత్తం ఆపన్నులను భయపెడుతుంది. కార్యక్రమాలు, సేవల్లో కోతకు దారితీస్తుంది. ఇటీవలి సంవత్సరాలలో ఐరాస మద్దతున్న కార్యక్రమాలకు సంప్రదాయపరమైన అమెరికా మానవతా సాయం ఏటా 17 బిలియన్ డాలర్ల వరకూ ఉంది. ఇందులో 8–10 బిలియన్ డాలర్లు స్వచ్ఛంద విరాళాలే. తన ఐరాస సభ్యత్వానికి సంబంధించిన వార్షిక బకాయిల నిమిత్తం అనేక బిలియన్ డాలర్లు కూడా అమెరికా చెల్లిస్తోంది. ఏదేమైనా పశ్చిమ దేశాల సాయంలో కోత విధిస్తుండడంతో లక్షలాది మంది ఆకలి, వ్యాధులతో బాధ పడే అవకాశం ఉంది. అమెరికా తన మానవతా సాయంలో కోత విధిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ సంస్థల సేవలకు తీవ్ర ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే విదేశీ సాయాన్ని బిలియన్ల కొద్దీ తగ్గించింది. దీంతో ప్రభుత్వ సంస్థలు ఖర్చులు తగ్గించుకోవాల్సి వస్తోంది. ప్రాజెక్టుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. వేలాది ఉద్యోగులు ఉపాధి కోల్పోతున్నారు. అమెరికా మాత్రమే కాదు.. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ కూడా విదేశీ సాయాన్ని కుదించుకున్నాయి. ముఖ్యంగా అమెరికా సాయం తగ్గిపోవడంతో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్, ది వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం, శరణార్థుల సంస్థ యూఎన్‌హెచ్‌సీఆర్ వంటి ఐరాస అనుబంధ సంస్థలు నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి.

# నా విజయాలను ఎవరూ గుర్తించడం లేదు



**హైదరాబాద్ పెన్ పవర్:** గాజాపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో జరిగిన సమావేశం మధ్యలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తన దౌత్య యత్నాలను ఎవరూ గుర్తించడం లేదని ఆయన కినుక వహించారు. నెతన్యాహూతో విందుకు ట్రంప్ కూర్చోగా రెండు దేశాల ప్రతినిధి బృందాలు చర్చలు కొనసాగించాయి. ఈ సమావేశానికి సంబంధించిన దృశ్యాల వీడియో వైరల్ అవడంతో ట్రంప్ అసహనం బయటపడింది. తన ప్రయత్నాల%ు%ఱ తగిన గౌరవం లభించడం లేదని ట్రంప్ అనడం విన్పించింది. 'ముప్పై ఐదు సంవత్సరాలు పోరాడారు. వారు ఇప్పుడు దానిని ఆపేశారు. ఆ క్రెడిట్ నాకు వచ్చిందా? లేదు' అని ఆయన కస్సుబుస్సులాడారు. ఆయన పరోక్షంగా నోబెల్ బహుమతిని ప్రస్తావించినట్లు అర్థమవుతోంది. ఈ సమావేశంలో ట్రంప్ తన విజయాలను ఏకరువు పెట్టారు. ఘర్షణలను నివారించడంలో విజయం సాధించానని చెప్పుకున్నారు. భారత్, పాక్ ఘర్షణను ఆయన మరోసారి ప్రస్తావించారు. ఘర్షణల నివారణలో ఎనిమిది విజయాలు తనవేనని అన్నారు. ఆ తర్వాత విలేకరులు అక్కడ ఉండడాన్ని గమనించిన ట్రంప్ తన స్వరాన్ని తగ్గించి మాట మార్చారు. సమావేశం అనంతరం ట్రంప్‌పై నెతన్యాహూ ప్రశంసలు కురిపించారు. చర్చలు ఫలప్రదంగా సాగాయని, తామిద్దరి మధ్య అసాధారణ స్నేహం ఉన్నదని చెప్పారు. ట్రంప్‌కు ఇజ్రాయిల్ వార్షిక బహుమతిని ప్రదానం చేస్తామని ప్రకటించారు. ఇజ్రాయిలీ కాని వారికి ఈ బహుమతి ఇవ్వడం ఇదే మొదటిసారి.

## ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్.. జపాన్‌ను అధిగమించి 4వ స్థానం కైవసం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత ఆర్థిక వ్యవస్థ అద్భుతమైన పురోగతిని సాధిస్తూ.. వేగంగా ముందుకు దూసుకుపోతుంది. ఈ క్రమంలో 4.18 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.దశాబ్దం క్రితం పదో స్థానంలో ఉన్న భారత్, నేడు ప్రపంచ వేదికపై అగ్రరాజ్యాలైన అమెరికా, చైనా, జర్మనీల తర్వాతి స్థానంలో నిలిచింది. బలమైన దేశీయ డిమాండ్, స్థిరమైన ఆర్థిక సంస్కరణల వల్ల ఇది సాధ్యమైందని ప్రభుత్వ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో భారత్ 8.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసి, ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. తయారీ, నిర్మాణం, సేవా రంగాల్లో వచ్చిన గణనీయమైన మార్పులు, అలాగే స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం ఈ వృద్ధికి ప్రధాన ఇంజన్లుగా నిలిచాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సైతం దేశ ఆర్థిక పురోగతిపై ధీమా వ్యక్తం చేస్తూ తన వృద్ధి అంచనాలను పెంచడం గమనార్హం. ఇదే వేగంతో ముందుకు సాగితే, రాబోయే రెండున్నర నుంచి మూడేళ్లలో జర్మనీని సైతం వెనక్కి నెట్టి, 2030 నాటికి 7.3 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన దేశం) గా మారాలన్న సంకల్పంతో చేపడుతున్న డిజిటల్ విప్లవం, మౌలిక సదుపాయాల కల్పన ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనున్నాయి. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉన్న భారతీయులు సైతం భారత్ వైపు మొగ్గు చూపుతున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

## దక్షిణాఫ్రికాలో అమ్ముడైన 50 శాతం కార్లకు భారత మూలాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ వాహనాలకు అంతర్జాతీయంగా గిరాకీ పెరుగుతోంది. ఈ ఏడాది దక్షిణాఫ్రికాలో అమ్ముడైన మొత్తం కార్లలో దాదాపు సగం భారత మూలాలు ఉన్నాయని ఓ నివేదిక తెలిపింది. అందులోనూ అమ్ముడైన కార్లలో ఎక్కువగా మహీంద్రా, టాటా బ్రాండ్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రముఖ మార్కెట్ పరిశోధనా సంస్థ లైట్‌స్టోన్ నివేదిక ప్రకారం, దక్షిణాఫ్రికాలో విక్రయించిన కార్లలో సగం భారత కంపెనీలు తయారు చేసినవి లేదా భారత్‌లోనే తయారైన విడిభాగాలను ఉపయోగించిన గ్లోబల్ బ్రాండ్ల కార్లు అని పేర్కొంది. అంతేకాకుండా మహీంద్రా దక్షిణాఫ్రికాలో ప్రధాన సంస్థగా అవతరించింది, ముఖ్యంగా కంపెనీకి చెందిన పికప్ (పిక్‌అప్ ట్రక్) మోడళ్లు గతేడాది పెద్ద ఎత్తున అమ్ముడయ్యాయి. దీంతో మహీంద్రా దక్షిణాఫ్రికా కార్ల మార్కెట్‌లో భారత ఉనికిని పెంచడానికి సహాయపడింది. ఇక, అంతకుముందు 2024లో దక్షిణాఫ్రికాలో అమ్ముడైన జపనీస్ బ్రాండ్ కార్లలో 84 శాతం భారత్ నుంచి దిగుమతి అయ్యాయని, కేవలం 10% మాత్రమే జపాన్‌లో తయారయ్యాయని కూడా లైట్‌స్టోన్ పేర్కొంది. జపనీస్, కొరియన్ బ్రాండ్‌ల క్రింద అమ్ముడయ్యే అనేక కార్లు వాస్తవానికి భారత్‌లోనే తయారై, ఆ తర్వాత దక్షిణాఫ్రికాకు రవాణా అయ్యాయి. 2024లో మొత్తం వాహన అమ్మకాలలో చైనీస్ కార్లు కేవలం 11 శాతం మాత్రమే ఉన్నాయి. ఇదే సమయంలో దక్షిణాఫ్రికాలో అమ్ముడైన అన్ని వాహనాలలో 36 శాతం భారత్ నుంచి దిగుమతి అయ్యాయి, ఇది దక్షిణాఫ్రికాలో స్థానికంగా తయారైన కార్ల 37 శాతం వాటాకు దాదాపు సమానం. పికప్ ట్రక్కులు మరియు తేలికపాటి వాణిజ్య వాహనాలను ఈ డేటా నుంచి వేరుచేస్తే, మార్కెట్‌లో భారత వాటా మరింత పెరుగుతుంది. లైట్‌స్టోన్ ప్రకారం, 2025 మొదటి ఐదు నెలల్లో దక్షిణాఫ్రికాలో అమ్ముడైన మొత్తం ప్యాసింజర్ కార్లలో 49 శాతం భారత్ నుంచి దిగుమతి అయ్యాయి. ఈ వాహనాలలో చాలావరకు భారత్‌కు చెందిన మారుతీ సుజుకి ప్లాంట్ల నుంచి వెళ్లాయి. స్టార్లెట్, స్టార్లెట్ క్రాస్, విట్జ్, అర్బన్ క్రూజర్ వంటి పాపులర్ టయోటా మోడళ్లను కూడా మారుతీ సుజుకి సరఫరా చేసింది. ప్రధానంగా తక్కువ కార్మిక, ఉత్పత్తి వ్యయాల కారణంగా మనదేశంలో కార్ల తయారీ చౌకగా ఉండటమే ఈ స్థాయి వృద్ధికి కారణమని నిపుణులు పేర్కొన్నారు.

## భారతీయ గృహాల్లో పసిడి వెలుగులు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో బంగారం అంటే కేవలం ధరించే ఆభరణం మాత్రమే కాదు, అది ఒక బలమైన భావోద్వేగం మరియు తరతరాల నమ్మకం. భారతీయులు పండుగలు, వివాహాలు మరియు శుభకార్యాల సమయంలో బంగారాన్ని కొనుగోలు చేయడం ఒక ఆచారంగా భావిస్తారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న అనిశ్చితి కారణం ఏదైనా, భారతీయుల వద్ద ఉన్న పసిడి నిల్వలు మాత్రం రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఈ సెంటిమెంటే ఇప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక పెద్ద దన్నుగా మారుతోంది. ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా ప్రకారం, ప్రస్తుతం భారతీయుల వద్ద సుమారు 34,600 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఆకాశాన్ని తాకడంతో, ఈ నిల్వల విలువ ఇప్పుడు ఏకంగా వి5 ట్రిలియన్లకు (సుమారు ?420 లక్షల కోట్లు) చేరుకుంది. మన దేశ ప్రజలు దాచుకున్న ఈ సంపద మొత్తం, ప్రస్తుతం మన దేశ అధికారిక +ఞూ కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ గణాంకాలు భారతీయుల పొదుపు శక్తిని ప్రపంచానికి చాటిచెబుతున్నాయి. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ సుమారు వి4.1 ట్రిలియన్లుగా ఉంది, కానీ గృహాల వద్ద ఉన్న పసిడి విలువ దానిని మించిపోవడం అంతర్జాతీయ ఆర్థిక నిపుణులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. విదేశీ సంస్థాగత పెట్టుబడులు లేదా స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం లేకుండా, సామాన్యుల చేతిలో ఉన్న ఈ 'గోల్డ్ పవర్' దేశానికి ఒక ఇన్విజిబుల్ రక్షణ కవచంలా పనిచేస్తోంది. కష్టకాలంలో లేదా ఆర్థిక సంక్షోభం ఎదురైనప్పుడు ఈ బంగారమే దేశ ఆర్థిక స్థిరత్వానికి భరోసా ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భారీ సంపద ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వేదికపై హాట్ టాపిక్‌గా మారింది. కేవలం అలంకరణ కోసమే కాకుండా, సురక్షితమైన పెట్టుబడిగా భారతీయులు బంగారానికి ఇస్తున్న ప్రాధాన్యత మన ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేస్తోంది. భవిష్యత్తులో కూడా బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉండటంతో, భారతీయుల నికర ఆస్తి విలువ మరింత పెరగనుంది. ఈ రకమైన సంపద కేంద్రీకరణ మరే ఇతర దేశంలోనూ కనిపించకపోవడం భారతీయుల ప్రత్యేకతను చాటుతోంది.

# రిలయన్స్ 'ఏఐ వార్ ' మొదలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ చరిత్రలోనే ఏఐ అత్యంత కీలకమైన సాంకేతిక అభివృద్ధి అని ప్రముఖ రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముఖేష్ అంబానీ అన్నారు. భవిష్యత్తులో రిలయన్స్ సంస్థను ఏఐ-నేటివ్ డీప్-టెక్ సంస్థగా మార్చే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు ఆయన తెలిపారు. దీని లక్ష్యం, కంపెనీ పూర్తిస్థాయిలో కృత్రిమ మేధస్సు(ఏఐ) కేంద్రంగా ఉంటుందన్నారు. ఈ మేరకు మంగళవారం రిలయన్స్ సంస్థ నుంచి ఏఐ మేనిఫెస్టోను ముఖేష్ అంబానీ ఆవిష్కరించారు. ఈ మేనిఫెస్టో రిలయన్స్ సంస్థలోని 6 లక్షలకు పైగా ఉద్యోగుల ఉత్పాదకతను 10 రెట్లు మెరుగుపరిచేందుకు సహాయపడుతుందని, దేశ ఆర్థికవ్యవస్థ, సమాజంపై 10 రెట్లు సానుకూల ప్రభావాన్ని సృష్టించగలదని ఆయన అన్నారు. దేశంలోని ప్రతి భారతీయుడికి తక్కువ ఖర్చుతో ఏఐని అందించే నినాదంతో పాటు, ఏఐని సురక్షితంగా, విశ్వసించే, బాధ్యతాయుతమైన టెక్నాలజీగా అందించడమే రిలయన్స్ ప్రధాన సంకల్పమని ముఖేష్ అంబానీ వెల్లడించారు. దేశంలో డిజిటల్ విప్లవాన్ని సృష్టించిన తరహాలోనే భారత ఏఐని ముందుండి నడిపిస్తామని అంబానీ స్పష్టం చేశారు. ఏఐ మేనిఫెస్టో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం మాత్రమే కాదు, రిలయన్స్ సంస్థలో పనిచేసే విధానాన్ని మార్చడం గురించి అని ఆయన వివరించారు. రిలయన్స్ సంస్థ ఏఐ మేనిఫెస్టో గురించి మాట్లాడుతూ.. రెండు దశల్లో ఏఐని అభివృద్ధి చేస్తామని అంబానీ చెప్పారు. మొదటి దశలో విసుగనిపించే, పునరావృతమయ్యే పనిని తొలగించడానికి, ఉద్యోగులు మెరుగైన నిర్ణయాలు తీసుకోవడానికి, వేగంగా, చురుగ్గా పనిచేయడానికి ఏఐని ఉపయోగిస్తాం. అయితే, ఏఐ వినియోగం ఎంత విస్తృత్వమంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయాలకు సంబంధించి మనుషులే బాధ్యత వహిస్తారు. ఏఐ ఉద్యోగులకు పనిలో సహకారం అందిస్తుందని, వారిని భర్తీ చేయదని అంబానీ పేర్కొన్నారు. ఈ దశలో ప్రధానంగా సంస్థ అంతర్గతంగా ఉద్యోగుల పనితీరులో కీలకమైన మార్పులు చేయడమన్నారు. తయారీతో పాటు సరఫరా, అమ్మకాలు, నియామకాల్లో మానవ శ్రమను తగ్గించి, వేగంగా నిర్ణయాలు తీసుకునే పనిని ఏఐ ఏజెంట్లు చూసుకుంటాయి. డేటాపై ఆధారపడి ఏఐ పనులను వేగంగా నిర్వహిస్తుంది, మనుషుల జవాబుదారీతనాన్ని తగ్గిస్తుంది.

## స్వార్థమే పరమార్థం కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏటా నూతన సంవత్సర తొలి దినాన్ని, ఐక్య రాజ్య సమితి మిలీనియం డే గా, గ్లోబల్ ఫ్యామిలీ డే గా జరుపు కుంటారు. ప్రతి సంవత్సరం జనవరి 01న ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతుల మంది ప్రపంచ కుటుంబ దినోత్సవాన్ని జరుపు కుంటారు. కుటుంబాలకు సంబంధించిన సమస్యలపై అవగాహన పెంపొందించడానికి, కుటుంబాలను ప్రభావితం చేసే సామాజిక, ఆర్థిక మరియు జనాభా ప్రక్రియల జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఈ రోజు ఒక ఉపకరిస్తుంది. కుటుంబాలు ఒక దేశం నుండి మరొక దేశానికి, అలాగే ప్రతి జాతీయ సమాజంలో విభిన్న రూపాలు, లక్షణాలను కలిగి ఉంటాయి. కుటుంబాలు వ్యక్తిగత ప్రాధాన్య తలు, సామాజిక పరిస్థితుల వైవిధ్యాన్ని తెలియ జేస్తాయి. భూమిపై ఒక గ్లోబల్ కుటుంబం అంటే వసుధైక కుటుంబంగా అందరూ శాంతి, సామరస్యంతో జీవించాలనే ఆలోచనను ప్రోత్సహించమే ఈ వంబర్ 1997లో, ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ కొత్త సహస్రాబ్ది మొదటి సంవత్సరం (2000) ప్రపంచ పిల్లల కోసం శాంతి మరియు అహింస సంస్కృతి కోసం అంతర్జాతీయ దశాబ్దాన్ని ప్రారంభించాలని ఒక ప్రకటన చేసింది. ఆ సందర్భంగా "శాంతి యొక్క ఒక రోజు"గా ప్రకటించ బడింది. అలా గ్లోబల్ ఫ్యామిలీ డేతో పాటు, జనవరి 01ని ప్రపంచ శాంతి దినోత్సవంగా కూడా పాటిస్తారు. కుటుంబం అంటే ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్న వారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. భారతీయ సంస్కృతికి, సంప్రదా యాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లింది. రక్త సంబం ధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు ఇమిడి ఉన్నాయి. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగా యనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అంద రిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉంటే ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదం డ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మర దళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్ర తో కళకళలాడే ఉమ్మడి కుటుం బాలు సిరి సంపదల నిల యాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్న పుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుం బాలు వారివే అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించి నప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకో వడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించు కునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు, రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో కేవలం ఫోన్ లోనో, మొబైల్లోనో యోగక్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశ యోక్తి కాదు. అనేక కుటుంబాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించు కునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహా లిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసు లోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కని పించే దృశ్యం. కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖ శాంతులు నెలకొల్పడం కోసం స్వచ్ఛంద సంస్థలు కూడా కృషి చేయాల్సి ఉంది.

## అమెరికన్లపై ప్రయాణ నిషేధం విధించిన మాలి, బుర్కినాఫాసో

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికన్ పౌరులపై మాలి, బుర్కినాఫాసో ప్రయాణ నిషేధం విధించాయి. తమదేశాల పౌరులపై అమెరికా విధించిన నిషేధానికి ప్రతీకారంగా ఈ చర్య తీసుకున్నట్లు రెండు పశ్చిమాఫ్రికా దేశాల విదేశాంగ మంత్రులు మంగళవారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. "తక్షణమే రిపబ్లిక్ ఆఫ్ మాలి ప్రభుత్వం మాలియన్ పౌరులపై విధించిన షరతులు, అవసరాలను అమెరికా పౌరులకు వర్తింపచేస్తుందని విదేశీ వ్యవహారాల శాఖ మరియు అంతర్జాతీయ సహకార మంత్రిత్వ శాఖ జాతీయ మరియు అంతర్జాతీయ కమ్యూనిటీకి తెలియజేస్తుంది " అని మాలి విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. బుర్కినాఫాసోలోకి ప్రవేశించే అమెరికన్ పౌరులపై నిషేధం విధిస్తున్నట్లు ద

ఆ దేశ విదేశాంగం మంత్రి కరామోకో జీన్ మేరీ ట్రారే మరో ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 16న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాలి, బుర్కినాఫాసో, నైజర్ సహా మరో 20 దేశాలకు మునుపటి ప్రయాణ ఆంక్షలను విస్తరిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. సాయుధ గ్రూపుల నిరంతర దాడుల కారణంగా పశ్చిమాఫ్రికా దేశాలపై ప్రయాణ నిషేధం విధిస్తున్నట్లు వైట్‌హౌస్ ఆరోపించింది.

## మూడేళ్ల కనిష్టానికి రష్యా ముడి చమురు దిగుమతులు



**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యాకు చెందిన సంస్థలపై అమెరికా తాజా ఆంక్షల నేపథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ నెలలో ఆ దేశం నుంచి చమురు దిగుమతులు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ కంపెనీ కెప్లర్ ప్రకారం, భారత్‌లోకి రష్యా ముడి చమురు దిగుమతులు డిసెంబర్‌లో రోజుకు దాదాపు 1.2 మిలియన్(12 లక్షల) బ్యారెళ్లకు (బీపీడీ) తగ్గుతాయని అంచనా. ఇది నవంబర్‌లో 1.84 మిలియన్(18.4 లక్షల) బీపీడీ కంటే గణనీయమైన క్షీణత. అంతేకాకుండా ఇది 2022, డిసెంబర్ తర్వాత అత్యల్పమని డేటా పేర్కొంది. క్షీణత ఉన్నప్పటికీ, డిసెంబర్‌లో రష్యా భారతదేశానికి అతిపెద్ద చమురు సరఫరాదారుగా కొనసాగుతోంది. ఇందుకు ప్రధానంగా రష్యా చమురు కంపెనీలు రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై ఇటీవల అమెరికా ఆంక్షలు విధించడంతో పాటు, చమురు వ్యాపారం, షిప్పింగ్‌కు ఈయూ ఆంక్షల అంతరాయం కారణాలుగా ఉన్నాయి. ఈ ఆంక్షల వల్ల రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌పీసీఎల్, హిందుస్తాన్ పెట్రోలియం, హెచ్‌పీసీఎల్-మిట్టల్ ఎనర్జీ, మంగళూరు రిఫైనరీ వంటి భారతీయ శుద్ధి కర్మాగారాలు రష్యా ముడి చమురు కొనుగోలును తాత్కాలికంగా నిలిపివేసాయి. అయితే, ఈ సంస్థలు అనుమతి లేని రష్యా సంస్థల నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తున్నాయి. ఈ తగ్గుదల తాత్కాలికమేనని, మళ్లీ రష్యా చమురు దిగుమతులు పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

## తగ్గిన ఎటిఎంలు




**హైదరాబాద్ పెన్ పవర్:** బ్యాంక్‌లు ఎటిఎం కేంద్రాల సంఖ్యను కుదిస్తోన్నాయి. రిజర్వు బ్యాంక్ సమాచారం మేరకు.. ఆర్థిక సంవత్సరం 2024-25లో బ్యాంక్‌లు శాఖలను పెంచుకోగా.. మరోవైపు ఎటిఎం కేంద్రాలను మాత్రంగా తగ్గించుకున్నాయి. 2025 మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల ఎటిఎంలు 2,51,057కి తగ్గాయి. అంతక్రితం ఏడాది 2,53,417గా ఉన్నాయి. పలు ప్రభుత్వరంగ బ్యాంకులు విలీనం కావడంతో వీటి సంఖ్య తగ్గిపోయాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణ, సెబీ అర్బన్, అర్బన్ ప్రాంతాల్లో ప్రభుత్వరంగ బ్యాంకులు అత్యధికంగా ఎటిఎంలను కలిగి ఉండగా.. ప్రయివేటు బ్యాంకులు మాత్రం అర్బన్, మెట్రోపాలిటన్ నగరాల్లో మాత్రమే ఎక్కువగా ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రయివేటు బ్యాంక్ ఎటిఎంలు 79,884 నుంచి 77,117కు పరిమితమయ్యాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎటిఎంల శాఖ 1,34,694 నుంచి 1,33,544కు తగ్గాయి. మరోవైపు వైట్ లేబుల్ ఎటిఎంల సంఖ్య 34,602 నుంచి 36,216కి పెరిగాయి. దేశవ్యాప్తంగా బ్యాంక్ శాఖలు 2.8 శాతం పెరిగి 1.64 లక్షలకు చేరాయి.

# ఓ చిన్న పిప్పలి ముక్క చాలు కడుపంతా క్లియర్

**హైదరాబాద్ పెన్ పవర్:** శీతాకాలం పీక్ స్టేజీకి చేరుకుంది. రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలికాలంలో ఎన్నో వ్యాధులు చుట్టుముడతాయి. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతులో కఫం, ఛాతీలో కఫం, మలబద్ధకం సమస్యలు తీవ్రంగా ఉంటాయి. వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. వీటిని తగ్గించడానికి చాలా మంది అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు మెడిసిన్ వాడితే.. మరికొందరు నాటు వైద్యాన్ని నమ్ముకుంటారు. అయితే, వీటికి చక్కటి పరిష్కారం ఒకటి ఉంది. అదే పిప్పలి. ఒకప్పుడు పిప్పలికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. పిప్పలికి ఆయుర్వేదంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీనిని పొడుగ్గా ఉన్న నల్ల మిరియాలతో పోలుస్తారు. ఆయుర్వేదంలో పిప్పలిని ఔషధ గుణాల నిధిగా పరిగణిస్తారు. ఇది రుచి, ప్రభావంలో చాలా శక్తివంతమైన మసాలాగా పరిగణిస్తారు. పురాతన వైద్య గ్రంథాలు పిప్పలిని జీర్ణక్రియ, శ్వాసక్రియ, రోగనిరోధక వ్యవస్థ బలపేతం చేసే శక్తిగా అభివర్ణిస్తారు. శీతాకాలంలో పిప్పలిని తీసుకోవడం ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. ఈ విషయాన్ని ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ మనీషా మిశ్రా ఎమ్‌డి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. డాక్టర్ మనీషా పిప్పలి ఆయుర్వేద ప్రయోజనాలు, ఎలా తీసుకోవాలో చెప్పారు. ఆ పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం. ఈ రోజుల్లో చాలా మంది మలబద్ధకంతో బాధపడుతున్నారు. ఇక చలికాలంలో మలబద్ధక సమస్య తీవ్రంగా ఉంటుంది. మలవిసర్జన సాఫీగా జరగదు. కడుపులో గందరగోళంగా ఉంటుంది. అయితే పిప్పలిలో ఉండే లక్షణాలు మలబద్ధకాన్ని తగ్గించడంలో సాయపడతాయని డాక్టర్ అంటున్నారు. వాస్తవానికి, ఈ మూలిక జీర్ణ కారకంగా పనిచేస్తుంది. ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయడానికి సాయపడుతుంది. ఇది పేగు కదలికల్ని సులభతరం చేస్తుంది. దీంతో మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. మలవిసర్జన సాఫీగా జరిగేలా ప్రోత్సహిస్తుంది. పిప్పలి మలబద్ధకంతో పాటు గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపర్చడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ



ఎంజైమ్‌లను సక్రియం చేస్తుంది. మెరుగైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. పిప్పలి యొక్క అతిపెద్ద ప్రత్యేకత ఏంటంటే.. ఇది గ్యాస్ట్రిక్ అగ్నిని పెంచుతుంది. దీంతో జీర్ణక్రియ మెరుగుపడి.. ఆకలి పెరుగుతుంది. భోజనానికి ముందు నెయ్యితో చిటికెడు పిప్పలి పొడిని తీసుకోవడం వల్ల అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యల నుంచి రిలీఫ్ లభిస్తుంది. చలికాలంలో వచ్చిందంటే చాలు చాలా మంది జలుబు, దగ్గు, గొంతులో కఫం వంటి సమస్యలతో బాధపడతారు. ఈ సమస్యలకు పిప్పలి చక్కటి పరిష్కారం. పిప్పలికి వేడినిచ్చే ప్రభావం ఉంటుంది. దీంతో ఇది కఫాన్ని కరిగించడంలో సాయపడుతుంది. దీర్ఘకాలిక దగ్గు, శ్లేష్మం పేరుకుపోవడం. తరచుగా జలుబు వంటి సమస్యలకు చికిత్స అందించడంలో పిప్పలి ప్రభావవంతంగా ఉంటుంది. ఆయుర్వేదంలో ఇది శ్వాసకోసం వ్యవస్థను బలోపేతం చేసే మూలికగా పరిగణిస్తారు. మారుతున్న సీజన్లకు దగ్గుతో బాధపడేవారికి ఇది ప్రత్యేకంగా సాయపడతుందని డాక్టర్ అంటున్నారు. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: పిప్పలిలో యాంటీ బాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. అంతేకాకుండా రోగనిరోధక శక్తిని బలపేతం చేస్తాయి. బరువు తగ్గడం: పిప్పలి శరీర జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది కేలరీల బర్నింగ్ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. బరువు తగ్గడంలో సాయపడుతుంది. కీళ్లు, కండరాల నొప్పి నుంచి రిలీఫ్: పిప్పలిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. దీని శోథ నిరోధక లక్షణాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. దీంతో, కీళ్ళ నొప్పి నుంచి రిలీఫ్ లభిస్తుంది. కాలేయ పనితీరును పెంచుతుంది: పిప్పలి కాలేయాన్ని నిర్విషీకరణ చేస్తుంది. టాక్సిన్లు తొలగించడంలో సాయపడుతుంది. కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. పిప్పలిని చూర్ణం చేసి తీసుకోవచ్చు. పిప్పలిని పొడి రూపంలో తీసుకోవచ్చు. పిప్పలి పొడి మార్కెట్లలో లభిస్తుంది. ఒక అర చెంచా పిప్పలి పొడిని పాలు లేదా గోరువెచ్చని నీటిలో తీసుకోవచ్చు. పిప్పలి పొడిని లేదా పిప్పలిని తేనెతో కలిపి తీసుకోవచ్చు. బెల్లంతో కూడా కలిపి తీసుకోవచ్చని డాక్టర్ అంటున్నారు. భోజనానికి ముందు నెయ్యితో చిటికెడు పిప్పలి పొడిని తీసుకోవడం వల్ల అజీర్ణం, గ్యాస్ వంటి సమస్యల నుంచి రిలీఫ్ లభిస్తుంది. అయితే, ఒక విషయం గుర్తించుకోవాలి. అధికంగా తీసుకుంటే సైడ్ ఎఫెక్ట్స్ రావచ్చు. తక్కువ మోతాదులో తీసుకుంటే మంచిది. ఏదైనా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు వైద్యుణ్ని సంప్రదించి తీసుకోవడం మేలు.


# మటన్ లివర్, చికెన్ లివర్ తింటున్నారా?





**హైదరాబాద్ పెన్ పవర్:** వారానికి ఒక రోజు మాంసం తినడం మాంసాహారులకు అలవాటుగా మారింది. ప్రస్తుత కాలంలో చికెన్ లివర్, మటన్ లివర్ తినే వారి సంఖ్య కూడా పెరిగింది.. ఎందుకంటే వీటిలో అనేక పోషకాలు దాగున్నాయి.. అందుకే.. నాన్ వెజ్ ఇష్టపడే చాలా మంది చికెన్ మటన్ లివర్ ఇష్టంగా తింటారు. మాంసాహారులు వారానికి కనీసం ఒకసారైనా చికెన్, మటన్, చేపలను తింటారు. అయితే.. ఇటీవల, పోషకాల ఎక్కువ ఉన్న చికెన్ లివర్, మటన్ లివర్ వినియోగం పెరిగింది. ఈ రెండూ అధిక పోషకాలు కలిగిన ఆహారాలు. కానీ ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి మంచిది.. ఏది తినడానికి ఉత్తమైనది.. అనే ప్రశ్నలు తలెత్తుతుంటాయి. చికెన్ లివర్ తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. చికెన్ లివర్‌లో ఐరన్, సెలీనియం, విటమిన్ ఎ, బి12, ఫోలేట్, ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నాయి. ఇందులోని సెలీనియం కంటెంట్ క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అదనంగా, విటమిన్ ఎ, బి12 కంటి, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మీరు డయాబెటిక్ అయితే, ఇది చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఉడికించిన కాలేయం తినడం వల్ల శరీర కొవ్వు తగ్గుతుంది. చికెన్ లివర్ కంటే మటన్ లివర్ ను ఎందుకు ఎక్కువగా తింటారు. చాలా మంది చికెన్ లివర్ కంటే మటన్ లివర్ తినడానికి ఇష్టపడతారు. మటన్ లో కొవ్వు ఎక్కువగా ఉంటుంది కాబట్టి, చాలా మంది ముందుగా దానిని వండుకుని తింటారు. ఇందులో విటమిన్లు ఎ, డి, బి12, జింక్, పొటాషియం, కాపర్ వంటి పోషకాలు ఉంటాయి. అందువల్ల, దీనిని తినడం వల్ల శరీరంలో ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. శరీరంలో రక్తం తక్కువగా ఉండటం వల్ల కొంతమందికి రక్తహీనత వస్తుంది. అలాంటి వారికి మటన్ లివర్ మంచి ఆహారం. విటమిన్ బి12 శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అయితే, కొంతమంది చికెన్, మటన్ లివర్ తినకూడదు.. కిడ్నీలో రాళ్ళు ఉన్నవారు, కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నవారు, గుండె జబ్బులు ఉన్నవారు, గర్భిణీ స్త్రీలు తినకూడదని నిపుణులు చెబుతున్నారు.

# చిన్న సాంకేతిక పరికరాలదే భవిష్యత్తు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుతం ప్రతీ అవసరానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదో ఒక రూపంలో ఉపయోగించుకుంటున్నాం. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాక ఇది మరింత సులువైపోయింది. చిన్న చిన్న లావాదేవీలు మొదలు కొని పెద్ద పెద్ద వ్యాపారాల వరకు చెల్లింపులు, లెక్కింపులు వంటి విషయాల్లో మోడర్న్ టెక్నాలజీ ఉపయోగపడుతోంది. ముఖ్యంగా క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, వివిధ యూపీఐ సర్వీసులకోసం, ఆన్‌లైన్ పేమెంట్ల కోసం కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, స్వైపింగ్ మెషిన్లు, క్యూఆర్ కోడ్‌ల స్కానింగ్ సాంతికేతికతపై ఆధారపడుతున్నాం. అయితే ప్రస్తుతం వీటికి మించిన వెరీ స్మాల్ స్మార్ట్ టెక్నాలజీ కూడా అందుబాటులోకి వస్తున్నది. భవిష్యత్తులో మరింత విస్తరించనుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. దానినే 'నియర్ ఫీల్డ్ మైక్రో చిప్'గా పేర్కొంటున్నారు. నియర్ ఫీల్డ్ మైక్రో చిప్ అంటే అత్యంత చిన్న సైజులో ఉన్న కంప్యూటర్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్ ఏదైనా రూపంలో ఉండవచ్చు. మీకు నచ్చిన డేటాతో కూడిన మైక్రో చిప్‌ను స్టిక్కర్ రూపంలో మీ షర్ట్ బటన్‌పై గానీ, మనీపర్స్‌పై గానీ, హ్యాండ్ బ్యాగ్‌పైగానీ ఉంచుకోవచ్చు. స్మార్ట్ ఫోన్, కంప్యూటర్, యూపీఐ క్యూఆర్ కోడ్‌లకు ప్రత్యామ్నాయంగానే వీటిని ఉపయోగించుకోవచ్చు. ఇప్పటికే స్వీడన్, చైనా వంటి దేశాలు దీనిని డెవలప్ చేసి ఉపయోగిస్తున్నాయి. కానీ విస్తృతంగా అందుబాటులోకి రాలేదు. కాకపోతే భవిష్యత్తులో ఈ సాంకేతికతకే డిమాండ్ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు? ఒక విధంగా ఇది నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై ఆధారపడిన చిన్న చిప్స్ అని చెప్పవచ్చు. అంటే ఇవి రెండు ఎలక్ట్రానిక్ డివైస్‌ల మధ్య చాలా దగ్గరి దూరంలో (సాధారణంగా 4 సెంటీమీటర్ల లోపు) వైర్‌లెస్‌గా డేటాను ఎక్స్ఛేంజ్ చేస్తాయి. ఈ చిప్స్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ టెక్నాలజీని ఉపయోగించుకుంటాయి. ఇందులో రీడర్ అండ్ ట్యాగ్ మధ్య టూ-వే కమ్యూనికేషన్ సాధ్యమవుతుంది. స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్లెట్లు, కార్డులు, ఇతర డివైస్‌లలో ఎంబెడ్ చేయబడిన ఈ చిప్స్, డేటాను సురక్షితంగా ట్రాన్స్‌ఫర్ చేస్తాయి. ఇండక్టివ్ కప్లింగ్ ద్వారా పనిచేస్తాయి. ఉదాహరణకు స్మార్ట్‌ఫోన్‌లలో Apple Pay, Google Pay, Samsung Pay వంటి యాప్‌ల ద్వారా కాంటాక్ట్‌లెస్ పేమెంట్స్‌కు ఉపయోగిస్తున్నారు. రిటైల్, ట్రాన్స్‌పోర్టేషన్, హెల్త్‌కేర్, మార్కెటింగ్ రంగాల్లో వీటిని ప్రస్తుతం ఉపయోగిస్తున్నారు, ఉదాహరణకు టికెటింగ్ సిస్టమ్స్, యాక్సెస్ కంట్రోల్ (డోర్ లాక్స్), లాయల్టీ ప్రోగ్రామ్స్, ప్రొడక్ట్ ట్రాకింగ్‌లలోనూ యూజ్ అవుతున్నాయి. నియర్ ఫీల్డ్ మైక్రోచిప్‌లను జస్ట్ మీ చేతివేళ్లపైనో, గోర్లపైనో, షర్ట్ బటన్లపైనో, డెస్క్ బోర్డులపైనో ఇలా ఎక్కడైనా అతికించుకోవచ్చు. అవసరమైనప్పుడు వీటి ద్వారా ఇతరులకు ఆన్‌లైన్ పేమెంట్లు చేయవచ్చు. ఇతరులు కూడా మీకు చేయవచ్చు. మీరు ఉపయోగించే మైక్రో చిప్ టైప్‌ను బట్టి అందులో మీ వర్క్ డేటా, ఇంకా ఏవిధమైన సమాచారన్నైనా భద్ర పర్చుకొని యాక్సెస్ చేసుకునేందుకు వీలుటుంది. అలాగే పేమెంట్లు, వివిధ సేవారంగాల్లోనూ నియర్ ఫీల్డ్ మైక్రో చిప్స్ యూజ్ అవుతాయి. జిమ్ సెంటర్లు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, గేటెడ్ కమ్యూనిటీలు, బస్సులు, కార్లు ఇలా ఎక్కడైనా డోర్లపై లేదా ప్రత్యేక ప్లేస్ కేటాయించి అక్కడ వీటిని అతికించుకొని వినియోగించుకోవచ్చు. పేమెంట్లు చేయడానికి, రిసీవ్ చేసుకోవడానికి, డోర్లు లాక్ చేయడానికి, ఓపెన్ చేయడానికి, ఆ ఏరియాలో అందుతున్న సేవలను తెలుసుకోవడానికి ఇలా ఒకటీ రెండు కాదు. ఇంకా అనేక విషయాల్లో సేవలను, సర్వీసులను వినియోగించుకోవడానికి భవిష్యత్తులో నియర్ ఫీల్డ్ మైక్రో చిప్‌లే కీలకం కానున్నాయని నిపుణులు అంటున్నారు.

## గుండె ఆరోగ్యం కోసం..



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి కారణంగా చాలామందిని అధిక రక్తపోటు (బిపి) సమస్య వేధిస్తోంది. రక్తపోటు నియంత్రణ తప్పితే అది కేవలం గుండెపైనే కాకుండా మెదడు, మూత్రపిండాల మీద కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గుండెపోటు, స్ట్రోక్ వంటి ప్రాణాంతక సమస్యల నుంచి తప్పించుకోవాలంటే బిపిని ఎప్పుడూ అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యం. దీని కోసం క్రమం తప్పకుండా రక్తపోటును పరీక్షించుకుంటూ వైద్యుల సలహాలను పాటించడం ఉత్తమం. మనం తీసుకునే ఆహారమే మన ఆరోగ్యానికి పునాది, కాబట్టి బిపిని తగ్గించే ఆహార పదార్థాలను డైట్‌లో చేర్చుకోవాలి. అరటిపండ్లు, పాలకూర వంటి పొటాషియం అధికంగా ఉండే పదార్థాలు శరీరంలోని సోడియం ప్రభావాన్ని తగ్గించి రక్తపోటును నియంత్రిస్తాయి. అలాగే సాల్మన్ ఫిష్‌లోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, వెల్లుల్లిలోని అల్లిసిన్ అనే సమ్మేళనం రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి రక్త ప్రసరణను మెరుగుపరచడమే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు దరిచేరకుండా రక్షణ కల్పిస్తాయి. కేవలం కూరగాయలు, పండ్లే కాకుండా గింజ ధాన్యాల ద్వారా కూడా రక్తపోటును అదుపు చేయవచ్చు. గుమ్మడి గింజలు, అవిసె గింజలు, పొద్దుతిరుగుడు గింజలలో మెగ్నీషియం, ఫైబర్ సమృద్ధిగా లభిస్తాయి, ఇవి రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తాయి. వీటితో పాటు ఆహారంలో ఉప్పు వాడకాన్ని తగ్గించడం అత్యంత అవసరం. సోడియం తక్కువగా తీసుకుంటే సహజంగానే రక్తపోటు పెరగకుండా ఉంటుంది, తద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఆహార నియమాలతో పాటు రోజువారీ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం కూడా చాలా అవసరం. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక, యోగా లేదా ఏదైనా వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా చేసుకోవాలి. వ్యాయామం వల్ల శరీర బరువు తగ్గడమే కాకుండా మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుంది, ఇది బిపిని అదుపులో ఉంచడానికి ఎంతగానో తోడ్పడుతుంది. సరైన నిద్ర, తగినంత విశ్రాంతి తీసుకోవడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకుని ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చు.

## మహిళలు రాత్రిపూట ఈ పనులు చేయకండి



**హైదరాబాద్ పెన్ పవర్:** వాస్తు శాస్త్రం ప్రకారం మహిళలు రాత్రిపూట కొన్ని పనులు చేయకూడదు. కొన్ని పనులు చేయడం ద్వారా నెగిటివ్ ఎనర్జీ వ్యాపిస్తుంది. వాటిని పాటించడం ద్వారా ఇంట్లో శాంతి, సానుకూలత పెరుగుతాయని, మానసిక ప్రశాంతత చేకూరుతుందని పండితులు సూచిస్తున్నారు. మన దైనందిన జీవితంలో మనం చేసే కొన్ని పనులు మనకు తెలియకుండానే మన ఇంటిపై, మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంటాయి. వాస్తు శాస్త్రం ప్రకారం రాత్రిపూట పెరుగు తినడం, గోళ్లు కత్తిరించుకోవడం వంటివి అందరికీ నిషేధించబడినప్పటికీ.. మహిళలు ప్రత్యేకంగా కొన్ని పనులకు దూరంగా ఉండాలని శాస్త్రాలు చెబుతున్నాయి. రాత్రి పడుకునే ముందు మహిళలు చేసే ఈ పొరపాట్లు ప్రతికూల శక్తిని ఆకర్షిస్తాయని పండితులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా మహిళలు జుట్టు చిక్కు పడకుండా ఉండాలని రాత్రిపూట గట్టిగా ముడి వేసుకుని లేదా కట్టుకుని నిద్రపోతుంటారు. అయితే వాస్తు ప్రకారం ముఖ్యంగా ఒంటరిగా నిద్రపోయేటప్పుడు జుట్టు కట్టుకోకూడదు. ఇలా చేయడం వల్ల దుష్ట శక్తులు లేదా ప్రతికూల శక్తులు త్వరగా ఆకర్షించబడతాయని ఒక నమ్మకం. అయితే జుట్టును పూర్తిగా విరబోసుకోవడం కంటే వదులుగా జడ వేసుకోవడం శ్రేయస్కరమని మరికొందరు పండితులు సూచిస్తుంటారు. రాత్రిపూట మహిళలు పెర్ఫ్యూమ్ వేసుకుని నిద్రపోవడం లేదా గాఢమైన సుగంధ ద్రవ్యాలు పూసుకుని బయటకు వెళ్లడం అస్సలు చేయకూడదు. పరిమళాల వాసన ప్రతికూల శక్తులను లేదా అదృశ్య శక్తులను ప్రేరేపిస్తుందని శాస్త్రం చెబుతోంది. కాబట్టి రాత్రివేళల్లో ప్రకృతిసిద్ధమైన వాసనలకు ప్రాధాన్యత ఇవ్వాలి తప్ప, కృత్రిమ పరిమళాలకు దూరంగా ఉండాలి. చాలా మంది మహిళలు పడుకునే ముందు జుట్టు చిక్కు తీయడం లేదా దువ్వుకోవడం చేస్తుంటారు. కానీ శాస్త్రాల ప్రకారం.. సూర్యాస్తమయం తర్వాత స్త్రీలు తల దువ్వుకోకూడదు. ఇది లక్ష్మీ దేవికి ఆగ్రహం కలిగిస్తుందని, ఇంట్లో దరిద్రం ప్రవేశిస్తుందని పెద్దలు చెబుతుంటారు. జుట్టు దువ్వడం వల్ల రాలిన వెంట్రుకలు రాత్రిపూట ఇంట్లో పడితే అది అశాంతికి దారితీస్తుంది. ఇంట్లో శాంతి ఉండాలంటే మహిళలు సాయంత్రం, రాత్రి వేళల్లో తగాదాలకు దూరంగా ఉండాలి. రాత్రిపూట జరిగే వాదనలు మనసును కలుషితం చేయడమే కాకుండా, నిద్రపై చెడు ప్రభావం చూపుతాయి. దీనివల్ల ఇంట్లో ప్రతికూల శక్తి పెరిగి, మానసిక అశాంతి నెలకొంటుంది. ప్రశాంతమైన మనసుతో నిద్రపోతేనే ఆ ఇంట్లో సానుకూలత పెరుగుతుంది. ఈ నియమాలు కేవలం ఆచారాలు మాత్రమే కాదు, వీటి వెనుక మానసిక ప్రశాంతత మరియు సానుకూల జీవనశైలి దాగి ఉన్నాయి. వీటిని పాటించడం ద్వారా ఇంట్లో సుఖశాంతులు ఉంటాయని భక్తుల నమ్మకం.

## చెవిలో గులిమి తీస్తున్నారా.. జాగ్రత్త!



**హైదరాబాద్ పెన్ పవర్:** స్నానం చేసిన తర్వాత లేదా ఖాళీగా ఉన్నప్పుడు చెవిలో బడ్స్ పెట్టుకుని తిప్పడం చాలామందికి అలవాటు. ఇలా చేయడం వల్ల చెవిలోని మురికి (గులిమి) శుభ్రపడుతుందని భావిస్తుంటారు. కానీ ఈ చిన్న అలవాటు మీ వినికిడి శక్తిని శాశ్వతంగా దూరం చేస్తుందని మీకు తెలుసా? చెవిలో గులిమి అనేది ఒక వ్యర్థం మాత్రమే కాదు.. అది మన వినికిడి వ్యవస్థను కాపాడే ఒక కవచం. దీనిని తొలగించడానికి కాటన్ బడ్స్, పిన్నులు లేదా ఇతర వస్తువులను వాడటం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. 70 శాతానికి పైగా చెవి గాయాలకు ఈ బడ్స్ వాడకమే కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు చెవులను ఎలా శుభ్రం చేసుకోవాలి? ప్రకృతి సిద్ధంగా చెవి తనను తాను ఎలా కాపాడుకుంటుంది? అనే ఆసక్తికర విషయాలు మీకోసం. లోపలికి నెట్టే ప్రమాదం: మనం వాడే కాటన్ బడ్స్ చెవిలోని గులిమిని బయటకు తీయడానికి బదులుగా, దానిని మరింత లోపలికి నెడతాయి. దీనివల్ల లోపల ఉండే సున్నితమైన కర్ణభేరి దెబ్బతినే అవకాశం ఉంది. గులిమి లోపలికి వెళ్లడం వల్ల తీవ్రమైన నొప్పి, ఇన్ఫెక్షన్లు తలెత్తుతాయి. క్రమంగా ఇది వినికిడి లోపానికి దారితీస్తుంది. సహజమైన రక్షణ కవచం: నిజానికి చెవిలో ఉండే గులిమి ఒక మురికి కాదు. అది దుమ్ము, ధూళి, బ్యాక్టీరియా మెదడు వైపు వెళ్లకుండా అడ్డుకునే ఒక రక్షణ కవచం. ప్రకృతి సిద్ధంగా చెవి తనను తాను శుభ్రం చేసుకునే గుణాన్ని కలిగి ఉంటుంది. మనం మాట్లాడుతున్నప్పుడు లేదా ఆహారం నములుతున్నప్పుడు చెవిలోని గులిమి సహజంగానే బయటకు వచ్చేస్తుంది. దీనిని ప్రత్యేకంగా శుభ్రం చేయాల్సిన అవసరం లేదు. ఇతర వస్తువుల వాడకం - ఇన్ఫెక్షన్ల ముప్పు: కొందరు పిన్నులు, అగ్గిపుల్లలు లేదా ఇతర పదునైన వస్తువులను చెవిలో పెడుతుంటారు. వీటివల్ల చెవిలోని సున్నితమైన చర్మంపై గాయాలు అవుతాయి. బయటి వస్తువుల ద్వారా బ్యాక్టీరియా లోపలికి ప్రవేశించి వాపు, చీము పట్టడం వంటి సమస్యలను కలిగిస్తుంది. వైద్యుల సలహా: చెవిలో విపరీతమైన నొప్పి ఉన్నా.. గులిమి గడ్డకట్టి వినికిడి తగ్గినట్టు అనిపించినా సొంత ప్రయోగాలు చేయకూడదు. వెంటనే నిపుణులైన వైద్యుడిని సంప్రదిస్తే, వారు సురక్షితమైన పరికరాలతో చెవికి ఎటువంటి హాని కలగకుండా శుభ్రం చేస్తారు.

# దంచికొట్టిన సర్ఫరాజ్ ఖాన్.. 14 సిక్సర్లతో వీరవిహారం

- విజయ్ హజారే ట్రోఫీలో సర్ఫరాజ్ ఖాన్ 157 పరుగుల భారీ ఇన్నింగ్స్
- 56 బంతుల్లోనే సెంచరీ.. తుఫాన్ ఇన్నింగ్స్‌లో 14 సిక్సర్లు, 9 ఫోర్లు
- తమ్ముడు ముషీర్ ఖాన్‌తో కలిసి కీలక భాగస్వామ్యం
- బౌలింగ్‌లో నిరాశపరిచిన అర్జున్ టెండూల్కర్



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశవాళీ క్రికెట్ టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ముంబై బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 2025 సంవత్సరం చివరి రోజైన నేడు గోవా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సర్ఫరాజ్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అలరించాడు. కేవలం బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడుతూ 75 బంతుల్లోనే 157 పరుగుల భారీ వ్యక్తిగత స్కోరు సాధించాడు. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ముంబై జట్టులో.. యశస్వి జైస్వాల్ (46) ఔటైన తర్వాత నాలుగో స్థానంలో సర్ఫరాజ్ క్రీజులోకి వచ్చాడు. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన సర్ఫరాజ్ కేవలం 56 బంతుల్లోనే తన సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత మరింత వేగంగా ఆడుతూ 150 పరుగుల మార్కును దాటాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏకంగా 14 సిక్సర్లు, 9 ఫోర్లు ఉండటం విశేషం. తమ్ముడు ముషీర్ ఖాన్‌తో కలిసి 10 ఓవర్లలోనే 93 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. 209.33 స్ట్రైక్ రేట్‌తో సర్ఫరాజ్ చేసిన బ్యాటింగ్ విన్యాసంతో ముంబై జట్టు నిర్ణీత ఓవర్లలో 444 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

**ముంబైపై అర్జున్ టెండూల్కర్ విఫలం**

మరోవైపు గోవా తరఫున ఆడుతున్న అర్జున్ టెండూల్కర్ తన సొంత జట్టు ముంబైపై ఆడిన తొలి మ్యాచ్‌లో నిరాశపరిచాడు. బౌలింగ్‌లో దారుణంగా విఫలమైన అర్జున్.. 7 ఓవర్లు వేసి వికెట్లేమీ తీయకుండా 62 పరుగులు సమర్పించుకున్నాడు.

# రష్యా ఆటగాడి చేతిలో ఓటమిపాలైన డి.గుకేశ్



**హైదరాబాద్ పెన్ పవర్:** చదరంగంలో మరో సంచలనం నమోదైంది. దోహా వేదికగా జరుగుతున్న ఫిడే వరల్డ్ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్–2025లో భారత యువ గ్రాండ్‌మాస్టర్, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్‌కు ఊహించని షాక్ తగిలింది. కేవలం 12 ఏళ్ల వయసున్న రష్యా యువ సంచలనం సెర్గీ స్లోకిన్ చేతిలో గుకేశ్ ఓటమి పాలవ్వడం క్రీడాకారులను విస్మయానికి గురిచేసింది. మూడో రౌండ్‌లో జరిగిన ఈ ఉత్కంఠ పోరులో చివరి నిమిషంలో చేసిన ఒకే ఒక్క తప్పిదం అతని కొంపముంచింది. నల్ల పావులతో ఆడుతున్న గుకేశ్‌కు గేమ్ 70వ ఎత్తు వద్ద తీవ్రమైన సమయ ఒత్తిడి ఏర్పడింది. చేతిలో కేవలం 8 సెకన్ల సమయం మాత్రమే ఉంది. ఈ దశలో ప్రత్యర్థి స్లోకిన్ డ్రా చేసుకునే ఉద్దేశంతో రూక్ ఎక్స్ఛేంజ్ (ఏనుగుల మార్పిడి) ఆఫర్ చేశాడు. సాధారణంగా అది డ్రా అయ్యే గేమ్.

కానీ, దూకుడుగా ఆడుతూ ఎప్పుడూ గెలుపునే కోరుకునే గుకేశ్, ఆ డ్రా ఆఫర్‌ను తిరస్కరించి తన రూక్‌ను 'ట4' కి జరిపాడు. గెలుపు కోసం గుకేశ్ చేసిన ఈ సాహసం బెడిసికొట్టింది. ఆ తర్వాతి కొద్ది ఎత్తుల్లోనే గుకేశ్ తన బిషప్‌ను, చివరి పాన్‌ను కోల్పోవాల్సి వచ్చింది. పరిస్థితి పూర్తిగా చేజారిపోవడంతో మరో పది ఎత్తుల్లోనే గుకేశ్ తన ఓటమిని అంగీకరించాడు.

# టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్‌గా యువరాజ్ సింగ్?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమ్ ఇండియా బ్యాటింగ్ కోచ్‌గా యువరాజ్ సింగ్ నియామకంపై మాజీ ఇంగ్లండ్ స్పిన్నర్ మోంటీ పనేసర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. భారత జట్టు బ్యాటింగ్ విభాగం మరింత బలోపేతం కావాలంటే యువీ వంటి అనుభవం ఉన్న ఆటగాడు జట్టుతో ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఒత్తిడి సమయాల్లో పరుగుల వరద పారించడంలో యువరాజ్ సింగ్ దిట్ట అని, అతని మార్గదర్శకత్వం జట్టుకు ఎంతో అవసరమని పనేసర్ స్పష్టం చేశారు. టెస్టులు మరియు వన్డే ఫార్మాట్లలో భారత జట్టుకు యువరాజ్ సింగ్ సరైన ఎంపిక అని పనేసర్ బలంగా నమ్ముతున్నారు. గంభీర్ ప్రధాన కోచ్‌గా ఉన్న ప్రస్తుత తరుణంలో, యువరాజ్ కూడా బ్యాటింగ్ కోచ్‌గా చేరితే ఆ కాంబినేషన్ అద్భుతంగా ఉంటుందని ఆయన విశ్లేషించారు. మైదానంలో దూకుడుగా ఉంటూనే, వికెట్ల పతనాన్ని ఎలా అడ్డుకోవాలో యువ ఆటగాళ్లకు నేర్పించడంలో యువీ శైలి ప్రత్యేకం అని ఈ సందర్భంగా పనేసర్ కొనియాడారు. యువరాజ్ సింగ్‌కు కోచింగ్‌లో ఇప్పటికే మంచి పట్టు ఉందని చెప్పడానికి శుభ్‌మన్ గిల్ మరియు అభిషేక్ శర్మలే నిదర్శనమని పనేసర్ గుర్తు చేశారు. ఈ ఇద్దరు యువ బ్యాటర్లు యువీ పర్యవేక్షణలో రాటుదేలి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని, వారి బ్యాటింగ్ టెక్నిక్ మెరుగుపడటంలో సింగ్ కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. యువ ఆటగాళ్ల మానసిక స్థితిని అర్థం చేసుకుని వారిని సరైన బాటలో నడిపించే సామర్థ్యం యువరాజ్ సొంతమని ఆయన ప్రశంసించారు. ప్రస్తుతం టీమ్ ఇండియా కోచింగ్ సిబ్బందిలో మార్పుల గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. విదేశీ పర్యటనల్లో భారత బ్యాటర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడానికి యువరాజ్ వంటి దిగ్గజం కోచింగ్ బాధ్యతలు చేపట్టాలని అభిమానులు కూడా కోరుకుంటున్నారు. పనేసర్ చేసిన ఈ సూచనను బీసీసీఐ పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది, ఒకవేళ ఇది నిజమైతే భారత క్రికెట్‌లో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

# గ్లోబల్ స్టార్ ఆ రేంజ్ సౌండ్ చెయ్యాల్సిందే!



మీనాక్షి చౌదరి చీరకు మృదువైన సొబగులు తెస్తుంది



రాజమౌళి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన –ఆర్‌ఆర్‌ఆం– మూవీతో రామ్ చరణ్ పాన్ ఇండియా స్టార్‌ల జాబితాలో చేరడం, గ్లోబల్ స్టార్‌గా మారడం తెలిసిందే. ఈ మూవీతో భారీ క్రేజ్‌ని సొంతం చేసుకున్న చరణ్ ఆ తరువాత దాన్ని కాపాడుకోవడంలో విఫలం అవుతున్నాడనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. కారణం శంకర్‌తో చేసిన పాన్ ఇండియా మూవీ–గేమ్ ఛేంజర్– బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలవడమే. అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అందులో సగాన్ని కూడా రాబట్టలేక తీవ్ర నిరాశకు గురి చేసింది. –ఆర్‌ఆర్‌ఆర్– వంటి పాన్ ఇండియా హిట్ తరువాత అదే స్థాయి హిట్‌ని సొంతం చేసుకోవాలని ప్రయత్నించిన చరణ్‌కు –గేమ్ ఛేంజర్– ఓ నైట్‌మేర్‌లా మారి షాక్ ఇచ్చింది. మూడేళ్ల శ్రమ కూడా వృధాకావడంతో ఇప్పుడు చరణ్ తదుపరి ప్రాజెక్ట్‌ని చాలా తెలివిగా ప్లాన్ చేసుకున్నాడట. అదే –పెద్ది–ఉప్పెన–వంటి బ్లాక్ బస్టర్ మూవీతో తొలి ప్రయత్నంలోనే దర్శకుడిగా మంచి పేరు తెచ్చుకున్న బుచ్చిబాబు దీనికి దర్శకుడు. క్రికెట్ గేమ్ చుట్టూ సాగే పీరియాడిక్ లవ్‌స్టోరీగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీతో ఎలాగైనా పాన్ ఇండియా లెవెల్లో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకోవాలని, –పెద్ది– విజయంతో మళ్లీ ట్రాక్‌లోకి రావాలని చరణ్ గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలోని కీలక పాత్రల్లో కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్, మీర్జాపూర్ నటుడు దివ్యేందు నటిస్తుండగా మరో ముఖ్య పాత్రలో బాలీవుడ్ నటుడు బోమన్ ఇరానీ నటిస్తున్నారు. ఇక అప్పలసూరి పాత్రలో జగపతిబాబు కనిపించబోతున్నారు. రీసెంట్‌గా విడుదల చేసిన ఆయన ఫస్ట్ లుక్ అందరిని షాక్‌కు గురి చేస్తోంది. గుర్తు పట్టలేని విధంగా జగపతిబాబు మేకోవర్ ఉండటంతో అంతా అవాక్కవుతున్నారు. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన పెద్ది గ్లింప్స్, అందులో చెర్రీ బ్యాటింగ్ చేస్తూ తనదైన మేనరిజంతో ఆడిన షాట్, ఫస్ట్ సింగిల్ చికిరిలో రామ్‌చరణ్ వేసిన స్టెప్స్, రెహమాన్ సంగీతం నెట్టింట ట్రెండ్ అయి సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. 2026 మార్చి 27న పాన్ ఇండియా వైడ్‌గా భారీ స్థాయిలో రిలీజ్ కానున్న ఈ మూవీతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన రేంజ్‌కు తగ్గట్టుగా సౌండ్ చేయాల్సిందేనని అంతా అంటున్నారు. కంటెంట్, క్యారెక్టర్ డిజైన్ చేసిన విధానం, రెహమాన్, రత్నవేలు, నవీన్ నూలి వంటి టాప్ నాచ్ టెక్నీషియన్స్‌తో చేస్తున్న %–%పెద్ది%–%తో ఈ సారి చరణ్ గట్టిగా సౌండ్ చేసి పాన్ ఇండియాకు మించి బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకోవాల్సిందేనని అంతా అంటున్నారు. ఫ్యాన్స్ కూడా ఇదే ఫీలవుతూ చరణ్ నుంచి బ్లాక్ బస్టర్ హిట్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



దీపికా పిల్లి తన తాజా స్నాప్‌లలో స్వచ్ఛమైన సాంప్రదాయ మనోజ్ఞతను తీసుకువస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965